www.jagritiweekly.com

సంపుటి : 77 సంచిక : 47 పుటలు : 52

జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు భాద్రపద బహుళ నవమి

వెల : ₹20/-

15-21 సెప్టెంబర్ 2025

మోదీ @ 75



జైలు బిల్లుకు అడ్డంకులు

స్వయంసేవక్ నుంచి ఉపరాష్ట్రపతి దాకా..

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

జై శ్రీరామ్!!
జై భారత్!!!
11 ఏండ్ల పాలన పూర్తి చేసుకొని
అరుదైన ప్రపంచ రికార్డును సాధించి
ప్రపంచ అగ్రనేతగా కీర్తి పొందారు.
ప్రజాసేవే ప్రథమ ధర్మమని ఆచరించి చూపిన మహానేత,
దేశం ముందు తర్వాత నేను అనే సంకల్పంతో
ప్రతీ క్షణం ప్రజలతోనే అన్న తపనతో గడిపిన,
సబ్ కా సాత్, సబ్ కా వికాస్,
సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్
అనే నినాదమిచ్చి 140 కోట్ల జనుల హృదయాలను జయించి,
అనేక పథకాలను ముందుకు తెచ్చి భారత్‌ను విశ్వగురు స్థానానికి
తీసుకెళుతున్న మన ప్రియతమ ప్రధాని
గౌ॥ నరేంద్ర మోదీ గారికి 75వ జన్మదిన (సెప్టెంబర్ 17)
&
దేశం, ధర్మం కోసం, హిందూ సంఘటనే లక్ష్యంగా అహర్నిశలు పనిచేస్తున్న
ప్రపంచ అతిపెద్ద సేవా సంస్థ స్వయంసేవకులకు, కార్యకర్తలకు
ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి
శుభాకాంక్షలు...
Dr. Ponguleti Sudhakar Reddy
Former MLC, BJP Core Committee Member, T.S.
BJP National Co-Incharge, Tamilnadu & Karnataka.
డా. పొంగులేటి సుధాకర్ రెడ్డి

ప్రియతమ ప్రధాని
శ్రీ నరేంద్ర మోడీ గారికి
75వ జన్మదిన శుభాకాంక్షలు
మరియు
Telangana
తెలంగాణ
తెలంగాణ
విమోచన దినోత్సవం
శుభాకాంక్షలు
సెప్టెంబర్ 17
అర్వింద్ ధర్మపురి
(పార్లమెంట్ సభ్యులు, నిజామాబాద్)

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి :	అసోసియేట్ ఎడిటర్	-
సబ్ ఎడిటర్ :	-	**9959991304**

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 **సంవత్సర చందా రూ.850**

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

ఇది కొన్ని సామాజిక మాధ్యమాలను నిషేధించినందుకు జరుగుతున్న నిరసన అనగలమా? పార్లమెంట్‌ను తగలబెట్టడం ఏమిటి? కేవలం 48 గంటలలో ప్రభుత్వం దిగిపోవడం ఏమిటి? మంత్రుల ఇళ్ల దహనకాండ ఏమిటి? ఇప్పుడు నేపాల్ గురించిన ప్రశ్నలు ఇవే. అసలే పేదరికం. ఆపై వామపక్ష ఉగ్రవాదం దెబ్బ. దిగుమతి చేసుకున్న రాజకీయ సిద్ధాంతాల పోటు, రాచరిక పునరుద్ధరణ ఉద్యమం, ఇది కాకుండా హిందూ దేశంగా తిరిగి అవతరించాలన్న డిమాండ్, వీటికి తోడు తుర్కియే వంటి ముస్లిం దేశాల కన్ను అన్నీ కలిపి నేపాల్ అనే ఆ చిన్న దేశాన్ని ప్రయోగశాలగా మార్చాయి. 1996 నుంచి దేశాన్ని కకావికలు చేసిన వామపక్ష తీవ్రవాదం మొదలు, జూన్ 1, 2001లో రాజు బీరేంద్ర రాజ కుటుంబం హత్య వరకు అన్నీ ఆటుపోట్లే. ఈ నేపథ్యానికి తాజా అల్లర్లు తోడయ్యాయి. కొన్ని సామాజిక మాధ్యమాలను ప్రభుత్వం నిషేధించడం, అందుకు నిరసనగా యువతరం జెన్ జడ్ ఉద్యమించిందని చెబుతున్నారు. కానీ ఆ నిషేధం నాలుగు రోజులలోనే ప్రభుత్వం ఎత్తివేసింది. ప్రధానమంత్రి కేపీ ఓలి శర్మ, మంత్రులు రాజీనామాలు సమర్పించారు. కాల్పులు జరిగి, 20 మంది వరకు చనిపోయారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఓలి శర్మ దేశం వీడి వెళ్లడానికి ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయని వార్తలు వచ్చాయి(ఓలి సైనికాధికారి ఆదేశాలతో రాజీనామా చేశారని వార్త). అయినా అల్లర్లు ఆగకపోవడం అనుమానాలకు తావిచ్చేదే.

సెప్టెంబర్ 4న నిషేధించిన ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్ వంటి 26 సామాజిక మాధ్యమాలు నాలుగు రోజులలోనే, సెప్టెంబర్ 8వ తేదీ రాత్రికే నేపాల్‌లో తిరిగి ప్రత్యక్షమైనాయి. రిజిస్ట్రేషన్ కోసం విధించిన గడువు కూడా ముగిసినా ప్రభుత్వం మాటను ఖాతరు చేయనందుకే వాటి మీద ఆ దేశ ప్రభుత్వం నిషేధం విధించింది. అందుకు దేశాన్ని తగలబెట్టడానికి 'యువతరం' ఉరకలేయడమే విశేషం. రిజిస్టర్ చేసుకోవడానికి ఆయా సంస్థలకు భారత్‌లో లేని అభ్యంతరం నేపాల్‌లో ఎందుకు అన్న ప్రధాని ప్రశ్న సబబే. ఆ నిషేధానికి నిరసనగా సెప్టెంబర్ 8వ తేదీన జడ్ జెన్ (కొత్తతరం) ఒక్కసారిగా వేల సంఖ్యలో వీధులలో పోరాటం ఉధృతం చేసింది. ఇందులో ప్రధాన పాత్ర పాఠశాల విద్యార్థినీ విద్యార్థులదే. నిరసనలో పాల్గొన్న

శాలివాహన 1947 శ్రీ విశ్వావసు భాద్రపద బహుళ నవమి

లోపలి పేజీలలో...



6లో

ముఖపత్ర కథనం
జైలు బిల్లుకు అడ్డంకులు

ప్రత్యేక వ్యాసం
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...

26లో

ప్రత్యేక వ్యాసం
విమోచనోద్యమ వైతాళికులు

32లో

జాగృతి

సంపాదకీయం

నిప్పుల కొలిమి నేపాల్

వారిలో అత్యధికులు 20 ఏళ్లు, అంతకంటే తక్కువ వయసు ఉన్నవారే. వీళ్లంతా యూనిఫారాలతోనే వీధులలోకొచ్చారు. అందుకే దీనికి జన్ జడ్ ప్రదర్శన అని పేరు పెట్టారు. కొంతమంది నిరసనకారులు పార్లమెంట్ ప్రాంగణంలోకి ప్రవేశించడంతో అల్లర్లు తారస్థాయికి చేరాయి. పోఖారా, బత్వాల్, భైరాహవా, భరత్‌పూర్, ఇతాహరి, దామక్ ప్రాంతాలకు అల్లర్లు విస్తరిస్తున్నాయి. ఇంకా కలాంకి, చాపాగాన్ వంటి ప్రాంతాలకు కూడా 9వ తేదీన అల్లర్లు బయలు దేరాయని కఠ్మాండు పోస్ట్ పత్రిక తెలియచేసింది.

సామాజిక మాధ్యమాల మీద విధించిన నిషేధం ఎత్తేశారు. ప్రభుత్వం కూలింది. కానీ అల్లర్లు ఆగడం లేదు. భక్తపూర్‌లోని ప్రధాని నివాసం మీద ఉద్యమకారులు రాళ్లు రువ్వారు. అక్కడ కాల్పులు జరిపితే ఇద్దరు గాయపడ్డారు. నయికాప్ వద్ద హోం మంత్రి రమేశ్ ఇంటికి నిప్పు పెట్టారు. అల్లరిమూకలు మాధేశ్ ప్రాంత ముఖ్యమంత్రి సతీశ్‌కుమార్ నివాసం మీద రాళ్లు రువ్వారని వార్తలు వచ్చాయి. మాజీ ప్రధాని, నక్సలైట్ ఉద్యమంతో రాచరికాన్ని దించిన పుష్పకుమార్ దహాల్ (ప్రచండ) ఇంటినీ వదలలేదు. మరొక మాజీ ప్రధాని షేర్‌బహదూర్ దేవ్‌బా ఇంటిని (కఠ్మాండు) కూడా లక్ష్యంచేసుకుని రాళ్లు రువ్వారు. ప్రభుత్వ అధికార ప్రతినిధిగా కూడా వ్యవహరిస్తున్న కమ్యూనికేషన్‌ల మంత్రి పృథ్విసుబ్బా గురంగ్ సొంత ఇంటికి కూడా ఉద్యమకారులు నిప్పు పెట్టారు. ఆర్థిక మంత్రి బిష్ణు ప్రసాద్ పౌడ్యాల్‌ను నడివీధిలోనే తన్నారు.

ఈ అల్లర్లు శ్రీలంక, బాంగ్లాదేశ్‌లో అల్లర్లను గుర్తుకు తెస్తున్నాయి. డీప్‌స్టేట్ కుట్రల నేపథ్యంలో ఇవాళ ప్రతి ఉద్యమాన్ని నమ్మడానికి లేదు. అవన్నీ స్థానికులే లేవదీసిన ఉద్యమాలని కచ్చితంగా చెప్పలేం. బాంగ్లాలో ఇదే ఇదే రుజువైంది. నేపాల్ అలజడి స్వరూప స్వభావాలు, కారణాలు కూడా విచిత్రంగా ఉన్నాయి. కేవలం నాలుగైదు రోజులలోనే దేశాన్ని అతలాకుతలం చేసే విధంగా ఉద్యమం రగిలింది. పార్లమెంట్ మీద దాడి వరకు ఆందోళన కారులు పెట్రేగిపోతున్నారు. నేపాల్‌లో ప్రస్తుతం చెలరేగిన అల్లర్లకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తి 36 ఏళ్ల సుదాన్ గురంగ్. ఇతడికి హమి నేపాల్ పేరుతో ఎన్‌జీవో ఉంది. విద్యార్థులు యూనిఫారాలతో, చేతిలో పుస్తకాలతో వచ్చి ఉద్యమంలో చేరవలసిందిగా పిలుపునిచ్చినవాడు ఇతడే. ఎక్కడ రోడ్లను దిగ్బంధనం చేయాలి? ఎక్కడ నిరసనలు జరగాలి అనేవి సామాజిక మాధ్యమాల ద్వారా ఇతడే సూచించాడు. ఇలాంటివి చూస్తుంటే, సామాజిక మాధ్యమాల పెత్తనాన్ని మెచ్చాలో, ఎన్నికైన ప్రజా ప్రభుత్వాల భవిష్యత్తు ఏమిటని తలపట్టుకోవాలో అర్థంకాని పరిస్థితి.

నేపాల్ ఆందోళన భారత్‌కు తలనెప్పి కాకుండా ఉండదు. అప్రమత్తంగా ఉండాలని భారతీయులకు కేంద్రం సూచించింది. మన చుట్టూ ఉన్న చిన్న దేశాల మీద చైనా ప్రభావం సుస్పష్టం. కాబట్టి మీ ఇలాకాలలోను గలభా సృష్టించడం మాకు పెద్ద పనేమీ కాదు అని అమెరికా చెప్పదలుచుకుందన్న అభిప్రాయాలు వస్తున్నాయి. ఇప్పటికే నేపాల్ మీడియా అల్లర్ల వెనుక సీఐఏ ఉండవచ్చునని అనుమానిస్తున్నది. నేపాల్‌లో చైనాకు చాలా ప్రాజెక్టులు ఉన్నాయి. ఓలి కూడా చైనా మద్దతుదారేనన్న అభిప్రాయం. ఆయన ప్రచండ మాజీ అనుచరుడే. ప్రపంచంలో మళ్లీ ప్రచ్ఛన్నయుద్ధం బాపతు వాతావరణం తేవడానికి అమెరికా ప్రయత్నిస్తున్నదన్న వాదనకు నేపాల్ తాజా ఉదాహరణ అవుతుందేమో కూడా. ఓటర్ల తొలగింపు పేరుతో కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండీ కూటమి భారత్‌లో చేస్తున్న అల్లర్లు అలాంటి వాతావరణం కోసమేనన్న అనుమానాలు కూడా కొందరికి ఉన్నాయి. నిజమే, అమెరికా అధ్యక్ష పదవి ఇప్పుడు ఒక పిచ్చివాడి చేతిలో రాయి కదా! ★

15 సెప్టెంబర్ 2025, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్

...40లో

కథ

వయసు మళ్లిన వలపు

– పెనుమాక నాగేశ్వరరావు



అందరి బంధువు భారత్ (అంతర్జాతీయం)	-	12
డ్రగ్స్ కార్ఖానా హైదరాబాద్?! (తెలంగాణ)	-	14
'సారథ్య' పర్యటనలతో కొత్త వ్యూహం (ఆంధ్రప్రదేశ్)	-	16
మార్ద్విజం-శ్రీరామరాజ్యం-3	-	18
విస్తరించకూడని వివాదం (చర్చ)	-	23
అనన్య శిల్పి విశ్వకర్మ (ప్రత్యేక వ్యాసం)	-	25
దేశమే కుటుంబం.. ప్రజలే కుటుంబ సభ్యులు (ప్రత్యేక వ్యాసం)	-	28
మబ్బుల దర్బారులో ఎన్ని సంగతులో! (గళమెత్తిన గతం)	-	30
స్వయంసేవక్ నుంచి ఉపరాష్ట్రపతి దాకా..! (విజయం)	-	34
'బంగారు' బాటలో భారత్ హాకీ! (క్రీడ)	-	43



జైలు బిల్లుకు అడ్డంకులు

ప్రధానమంత్రి సహా మంత్రులు ఎవరికైనా ఐదేళ్లకు మించి శిక్షపడే కేసులో 30 రోజులు జైల్లో ఉండాల్సివస్తే వారు పదవి కోల్పోయే విధంగా కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టింది. అయితే ఇప్పటికిప్పుడు ఈ చట్టాన్ని తీసుకురావా ల్సిన అవసరమేంటన్న ప్రశ్న సహజం. కానీ ఇటువంటి చట్టాన్ని తీసుకురావాలని ఎప్పుడు ప్రయత్నించినా ఇదే ప్రశ్నను సంధించే వారు కచ్చితంగా ఉండితీరతారు. ఏ ప్రభుత్వ మైనా ఒక చట్టం తీసుకురావడానికి కొన్ని ప్రత్యేక కారణాలు లేదా ఇందుకు ప్రేరణ కల్పించే కొన్ని పరిస్థితులు నెలకొనడం సహజం. ఏ ప్రభుత్వం ఎటువంటి చట్టాన్ని అమల్లోకి తెచ్చినా అది అందరికీ వర్తిస్తుందనేది నిష్టుర సత్యం. చట్టాన్ని అమల్లోకి తెచ్చిన పార్టీ రేపు విపక్షంలో కూర్చోవచ్చు. అందువల్ల ఈ చట్టం రెండు వైపులా పదునున్న కత్తి వంటిది. ప్రజాస్వామ్యంలో ఎవరూ ఎల్లకాలం పదవిలో కొనసాగడం సాధ్యంకాదు. ఎందుకు చెప్పాల్సి వస్తున్నదంటే, అధికారంలో ఉన్న ఎన్డీఏ ఈ చట్టాన్ని కేవలం ప్రత్యర్థి పార్టీలు అధికారంలో ఉన్న ప్రభుత్వాలను అస్థిరం చేయడానికి మాత్రమే ఒక అస్త్రంగా ఉపయోగిస్తుందని విపక్షాలు ప్రధానంగా ఆరోపిస్తున్నాయి. ఒకవేళ ఇండియా కూటమి అధికారంలో ఉండి ఇదే చట్టాన్ని అమల్లోకి తేవడానికి యత్నించినప్పుడు ఎన్డీఏ కూటమి వ్యతిరేకించకుండా ఉండడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ చట్టం వల్ల ఒనగూడే లాభనష్టాలను బేరీజు వేసుకోవడం అవసరం.

కేంద్ర ప్రభుత్వం 130వ రాజ్యాంగ సవరణ బిల్లు-2025, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ సవరణ బిల్లు-2025, జమ్ము-కశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు-2025 అనే మూడు బిల్లులను ఆగస్టు 20న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. మిగిలిన రెండు బిల్లులతో పోలిస్తే 130వ రాజ్యాంగ సవరణగా పేర్కొంటున్న ఈ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందడం అంత సులభం కాదు. ముఖ్యంగా రాజ్యాంగంలోని 75, 164 అధికరణాలను సవరించాల్సి ఉండటంతో పార్లమెంట్ ఉభయ సభల్లో 2/3వంతు మెజారిటీ సభ్యుల ఆమోదం అవసరం. అంటే ఓటింగ్ రోజు కనీసం 50 శాతం మంది సభ్యుల హాజరు తప్పనిసరి. దేశంలోని సగం రాష్ట్రాల అసెంబ్లీలు కూడా ఈ బిల్లుకు ఆమోదం తెలపాలి. జమ్ము కశ్మీర్, కేంద్రపాలిత ప్రాంతాల బిల్లులు సాధారణ సవరణకు సంబంధించినవి కాబట్టి ఆమోదానికి సాధారణ మెజారిటీ సరిపోతుంది. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వానికి రెండు సభల్లో 2/3 వంతు మెజారిటీ లేదు. అందువల్ల 130వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే విపక్షాలకు చెందిన చాలామంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన కుండాఉండాలి. ఎన్డీఏ భాగస్వాములైన తెలుగు దేశం, జనతాదళ్ (యునైటెడ్) వంటి చిన్న పార్టీలు ఈ సవరణ బిల్లును వ్యతిరేకించే అవకాశాలే ఎక్కువ. ఒకవేళ పార్లమెంట్ ఆమోదం పొందినా సుప్రీంకోర్టు రూపొందించిన "ప్రాథమిక సూత్ర సిద్ధాంతానికి" ఈ బిల్లులు విరుద్ధమని కొందరు లాయర్లు చెబుతున్న మాట. పార్లమెంట్ ఆధిపత్యం నుంచి సమాఖ్య వ్యవస్థ, అధికార విభజన సూత్రాన్ని సుప్రీంకోర్టు సిద్ధాంతం పరిరక్షిస్తోంది. ఒకవేళ బీజేపీ తాను నిబద్ధంగా వ్యవహరిస్తానని చెప్పుకున్నా, మరే ఇతర పార్టీనో అధికారంలోకి వస్తే, అప్పుడు పరిస్థితేంటనేది ప్రశ్నార్థకమే.

రాజ్యాంగ సవరణకే "జైలు బిల్లు"

130వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రధానంగా రాజ్యాంగంలోని 75, 164, 239ఎఎ అధికరణా లను సవరించడానికి ఉద్దేశించింది. దీని ప్రకారం ఐదేళ్లు అంతకంటే ఎక్కువ శిక్ష పడే కేసుల్లో అరెస్టయిన ప్రధానమంత్రి సహా ఎవరైనా మంత్రులు 30 రోజులు జైల్లో ఉన్నట్లయితే వారు తమ పదవు లను కోల్పోతారు. ఇక్కడ పదవులు కోల్పోవడానికి నేరం రుజువు కావాల్సిన అవసరం లేదు. కేవలం ఆరోపణ సరిపోతుంది. బెయిల్ ద్వారా జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత వారు తమ పదవులను తిరిగి పొందవచ్చు. 75వ అధికరణం ప్రకారం ఐదేళ్లు శిక్షపడే కేసులో ఒక కేంద్రమంత్రి అరెస్టయి 30 రోజులపాటు జైల్లో ఉన్నట్లయితే ప్రధానమంత్రి సలహాపై రాష్ట్రపతి ఆయన్ను పదవి నుంచి తొలగించవచ్చు. ఇక 31వ రోజు కూడా జైల్లో ఉన్నట్లయితే ఇక ప్రధానమంత్రి సలహా అవసరం లేకుండానే సదరు మంత్రి పదవిని కోల్పోతారు. పోలీసు కస్టడీ నుంచి విడుదలైన తర్వాత ఆయన తిరిగి మంత్రిపదవిలో చేరవచ్చు. 164వ అధికరణం ప్రకారం ఇవే నిబంధనలు రాష్ట్ర ముఖ్యమంత్రులు, మంత్రులకు వర్తిస్తాయి. ఇక్కడ గవర్నర్‌కు వీరిని తొలగించే అధికారం ఉంటుంది.

ఇక 299ఎఎ అధికరణం ఢిల్లీ ముఖ్యమంత్రి, మంత్రులను తొలగించే అధికారాన్ని లెఫ్టినెంట్ గవర్నర్‌కు కట్టబెడుతోంది. కేంద్రపాలిత ప్రభుత్వాల చట్టం-1963 ఇదే నిబంధన కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య మంత్రులు, మంత్రులను తొలగించడానికి అక్కడి లెఫ్టినెంట్ గవర్నర్‌కు దఖలు పడతాయి. కొత్తగా తీసుకొస్తున్న ఈ బిల్లును గతంలో ఇందిరా గాంధీ 39వ రాజ్యాంగ సవరణ బిల్లు పేరుతో అమల్లోకి తెచ్చారు. ఇందులో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రి, స్పీకర్‌లను న్యాయ సమీక్ష నుంచి మినహాయించడం గమనార్హం. అయితే ఈసారి ఎన్డీఏ ప్రవేశపెట్టిన బిల్లులో ప్రధానిని కూడా చేర్చడం ఒక్కటే ప్రస్తుత బిల్లుకు దానికీ తేడా! మరి విపక్షాలు ఎందుకు నానా యాగీ చేస్తున్నాయో అర్థంకాదు!

పాలనపై ప్రభావం

రాజ్యాంగపరమైన నైతిక నిష్ఠ: నైతిక పాలనను మరింత బలోపేతం చేసేందుకు ప్రస్తుత రాజ్యాంగ సవరణ బిల్లు దోహదం చేస్తుంది. ముఖ్యంగా క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రులు, మంత్రులు పదవుల్లో కొనసాగకుండా నిరోధిస్తుంది. ఉదాహరణకు ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు లిక్కర్ వ్యవహారంలో ఆరోపణలపై అరవింద్ కేజ్రీవాల్ అరెస్టయి జైల్లో ఉండగా, సుప్రీంకోర్టు ఆయనపై కొన్ని పరిమితులు విధించింది. అయితే పదవిలో ఉండాలా వద్దా అనే విచక్షణను ఆయనకే వదిలేసింది.

ప్రజల విశ్వాసానికి రక్షణ: అవినీతికి, నేరపూరిత రాజకీయాలకు వ్యతిరేకంగా తీసుకునే మరింత గట్టి చర్యగా ఈ బిల్లును ప్రజలు పరిగణించవచ్చు. తద్వారా వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం ఏర్పడు తుంది.

ఉత్తమ పాలన: అరవింద్ కేజ్రీవాల్ ప్రవేశపెట్టిన "జైలు నుంచి పాలన" అనే కొత్త విధానాన్ని ఇది పూర్తిగా నిరోధిస్తుంది. రాజ్యాంగ పరంగా జవాబు దారీతనాన్ని ప్రోత్సహిస్తుంది.

చట్టపరంగా ఉన్న అంతరాన్ని తొలగిస్తుంది: ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం కేవలం నేరం రుజువైన తర్వాత మాత్రమే ప్రజాప్రతినిధులు అనర్హులవుతారు. అయితే అరెస్ట్, చట్టపరమైన శిక్ష విధింపునకు మధ్య వుండే అంతరానికి ఈ చట్టం ఒక వారధిగా ఉపయోగ పడుతుంది.

సుప్రీంకోర్టు తీర్పులు: మనోజ్ నారులా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా-2014 కేసులో, నేరచరితులైన నాయకులను మంత్రులుగా నియ మించకూడదన్న నిబంధన రాజ్యాంగంలో లేదని చెబుతూనే తీవ్రస్థాయి నేర ఆరోపణలు ఎదు ర్కొంటున్న వ్యక్తులు కార్యనిర్వాహక పదవిలో కొనసాగడానికి అనర్హులని తేల్చిచెప్పింది. షంషేర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్, ఎస్.ఆర్. బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో కూడా కోర్టు రాజ్యాంగ పరమైన నైతిక నిష్ఠ, చట్టపరమైన సక్రమత ప్రాధాన్యతను స్పష్టం చేసింది. అదేవిధంగా 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన మరొక తీర్పులో, ప్రజాప్రతినిధుల అనర్హతకు సంబంధించిన కఠినమైన నిబంధనల రూపకల్పన, అమల్లోకి తెచ్చే విషయంలో పార్లమెంట్‌కు ప్రత్యేకాధికారాలున్నాయని స్పష్టం చేసింది.

లా కమిషన్: మోపిన ఆరోపణల వివరాలను నిందితుడికి కోర్టు వివరించే విధానం (ఫ్రేమింగ్ చార్జెస్) పూర్తయిన తర్వాతనే ఒక ప్రజాప్రతినిధిని అనర్హుడిగా ప్రకటించాలని పేర్కొంది. కేవలం ఆరోపణలు, ఫిర్యాదుల ఆధారంగా అనర్హతను నిర్ణయించడం సబబుకాదని స్పష్టం చేసింది.

సమస్యలు, విమర్శలు: 21వ అధికరణంలో పేర్కొన్న అమాయకత్వం లేదా నిర్దోషిత్వం అనే సూత్రాలను ఈ బిల్లు అతిక్రమిస్తోందన్న విమర్శ ఉంది. నిజానికి ఈ రెండు పదాలు స్వేచ్ఛగా జీవించే హక్కుగా ఈ అధికరణంలో అంతర్గత భావనతో ఇమిడి ఉన్నాయి. కేవలం కార్యనిర్వాహక సలహాపైనే ఒక మంత్రిని తొలగించడమంటే ఇది రాజకీయ రంగు పులుముకునే అవకాశముంది. ఈ బిల్లు



శాసనసభ్యులు/ఎంపీలకు, మంత్రులకు మధ్య ఉన్న తేడాను స్పష్టంగా పేర్కొనడం వల్ల, సమర్థులైన వారు ఎవరూ మంత్రిపదవిని చేపట్టడానికి ముందుకు రాని పరిస్థితి ఏర్పడవచ్చు. కస్టడీనుంచి విడుదలైన తర్వాత తిరిగి మంత్రిపదవి చేపట్టవచ్చునని బిల్లు పేర్కొంటున్నది. దీనివల్ల రాజకీయ అస్థిరత ఏర్పడే ప్రమాదముంది.

కేంద్రానికి మరిన్ని అధికారాలు

ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వారు, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి. అటువంటి నాయకులపై ఏ విధమైన ఆరోపణల 'మచ్చలు' ఉండటానికి వీల్లేదు. తీవ్ర క్రిమినల్ నేరారోపణలు ఎదుర్కొంటూ బాధ్యతాయుతమైన పదవిలో ఉండే నాయకుడు, రాజ్యాంగ నైతిక నిష్టకు, ఉత్తమ పాలనా సూత్రాలకు న్యాయం చేయలేడు. ఆవిధంగా రాజ్యాంగపరంగా తనపై ప్రజలు వుంచిన విశ్వాసం క్రమంగా సన్నగిల్లిపోతుంది. తీవ్రమైన క్రిమినల్ నేరాలను ఎదుర్కొంటూ అరెస్టయి, జైలుకు వెళ్లిన మంత్రులను ఆ పదవి నుంచి తొలగించేందుకు వీలుకల్పించే అధికరణమేదీ మన రాజ్యాంగంలో పొందుపరచ లేదని ఈ బిల్లు పేర్కొంది. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొందితే కేంద్ర ప్రభుత్వానికి మరిన్ని అధికారాలు రావడం ఖాయం. అవినీతి ఆరోపణలపై ఏ ముఖ్య మంత్రి లేదా మంత్రినైనా కేంద్రం తొలగించ గలదు. జమ్ము-కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి కలిగిస్తానని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. అయితే ఈ బిల్లు ఆమోదం పొందితే, కేంద్రానికి మరిన్ని అధికారాలు దఖలు పడటంతో జమ్ము-కశ్మీర్ రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతంపై తన పట్టును మరింత దృఢంగా కొనసాగించగలదు.

విపక్షాల వ్యతిరేకత

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ 'జైలు బిల్లు'ను పార్ల మెంట్‌లో ప్రవేశ పెట్టి నప్పుడు విపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఆగ్రహంతో ఊగిపోయిన ప్రతిపక్ష సభ్యులు బిల్లు ప్రతులను చించి అమిత్‌షాపై విసిరేసినట్టు వీడియోల్లో కనిపించింది. విపక్షాల ఆగ్రహానికి తట్టుకోలేక అమిత్ షా ఒక దశలో వెనుక బెంచ్‌లో కూర్చోవాల్సి వచ్చింది కూడా! ఇంత జరిగినా అవినీతి, నేరస్తులైన రాజకీయ నాయకులను కట్టడి చేయడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యమని కేంద్రం స్పష్టం చేస్తోంది. మోదీ ప్రభుత్వం "130వ రాజ్యాంగ సవరణ బిల్లు-2025" పేరుతో ఈ జైలు బిల్లును ఆగస్టు 20న ప్రవేశ పెట్టింది. తీవ్రమైన నేరారోపణలను ఎదుర్కొంటున్న వారు రాజ్యాంగ బద్ధమైన పార్లమెంట్‌లోకి ప్రవేశించకుండా నిరోధించడమే ఈ బిల్లు ఉద్దేశమని కేంద్రం పేర్కొంది. విపక్షాల తీవ్ర నిరసనలు, గందరగోళం మధ్య ఈ బిల్లును ఎట్టకేలకు జాయింట్ పార్లమెంట్ కమిటీ పరిశీలనకు పంపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మనీష్ తివారీ మాట్లాడుతూ నేరం రుజువయ్యే వరకు నిందితుడు అమాయకుడే అన్న సూత్రాన్ని ఈ బిల్లు దెబ్బతీసేదిగా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ మాట్లాడుతూ ఇది కేవలం ప్రజల కన్నీళ్లు తుడవడానికి తప్ప మరేంలేదని, ఇదొక ''రాక్షస'' బిల్లని వ్యాఖ్యానించారు. ఎంఐఎం నాయకుడు అసుదుద్దీన్ ఒవైసీ ఈ బిల్లు కేవలం విపక్షాల ప్రభుత్వాలను పడగొట్టడానికి తప్ప మరెందుకూ ఉపయోగించదని విమర్శించారు. తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ బెనర్జీ ఏవిధంగా బాధ్యత వహించకుండా, దేశంపై ఆధిపత్యం వహించడానికే ప్రవేశపెడుతున్నారని విమర్శించారు. శాంతి భద్రతలు రాష్ట్రాల జాబితాలో ఉన్నందున, ఇప్పుడీ బిల్లు అమల్లోకి వస్తే ఈ రాజ్యాంగ సూత్రం కూడా దెబ్బతింటుందని కొందరు విమర్శకుల విశ్లేషిస్తున్నారు. ఎందుకంటే ఈ బిల్లును రాష్ట్ర నాయకత్వానికి కూడా వర్తింపజేయడంవల్ల సమాఖ్య స్ఫూర్తి పూర్తిగా దెబ్బతింటుందన్నది వీరి వాదన. 2014లో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విపక్ష నేతలపై ఈడీ, సీబీఐ సంస్థలను ప్రయోగించడం విపరీతమైందని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ దర్యాప్తు సంస్థల వినియోగంపై స్పష్టమైన మార్గదర్శకాలివ్వాలని కోరుతూ 2023 మార్చిలో విపక్షాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి కూడా. 2014 నుంచి 95 శాతం కేసులు ఈడీ, సీబీఐలు విపక్షాలపై నమోదు చేసినవని, అదే కాంగ్రెస్ హయాంలో ఇవి 60శాతం మాత్రమేనన్నది వాటి వాదన.ప్రస్తుత పార్లమెంట్‌లో 41శాతం సభ్యులు నేరాభియోగాలు ఎదుర్కొంటుండగా వీరిలో 31శాతం మందిపై హత్య, హత్యాయత్నం, కిడ్నాపింగ్ వంటి తీవ్ర నేరాభియోగాలుండటం గమనార్హం.

బిల్లుకు ప్రేరణ

ఈ బిల్లును ప్రభుత్వం తగిన కారణాలు లేకుండా తీసుకురావడంలేదు. గత రెండేళ్ల కాలంలో జరిగిన వివిధ సంఘటనలు ప్రభుత్వాన్ని ఈ బిల్లు ప్రవేశ పెట్టేందుకు ప్రేరేపించాయి. 2024 సాధారణ ఎన్నికల సమయంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆయనకు కుడిభుజం వంటి మరో మంత్రి మనీష్ సిసోదియాను దర్యాప్తు సంస్థలు వివిధ కేసుల కింద అరెస్ట్ చేశాయి. లిక్కర్ స్కామ్‌లో అరెస్టయిన అరవింద్ కేజ్రీవాల్ ఐదు నెలలపాటు జైల్లో గడిపారు. ఈ సందర్భంగా తన పదవికి రాజీనామా చేయడానికి ఆయన అంగీకరించలేదు సరికదా, ఏకంగా జైలు నుంచే పాలన కొనసాగించారు. ఇందుకోసం జైల్లోనే పాలనా నిర్వహణకోసం ఒక ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఇది దేశ చరిత్రలోనే ఒక విచిత్ర పరిస్థితి అని చెప్పాలి! మధ్యంతర బెయిల్ ఇస్తూ సుప్రీంకోర్టు, ఆయన్ను సెక్రటేరియట్‌కు రాకూడదని నిబంధన విధించింది. దీంతో ఆయనకు పదవిని వీడక తప్పలేదు! 2023లో తమిళనాడుకు చెందిన మంత్రి సెంథిల్ బాలాజీ కూడా మనీలాండరింగ్ కేసులో అరెస్టయ్యారు. అయితే ముఖ్యమంత్రి స్టాలిన్ ఆయనకు ఎటువంటి



జమలాపురపు విఠల్‌రావు

సీనియర్ జర్నలిస్ట్

పోర్ట్‌ఫోలియోను కేటాయించ కుండానే మంత్రిగా కొనసాగించడాన్ని గవర్నర్ రవి తీవ్రంగా తప్పుపట్టారు.

సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన తర్వాత సెంథిల్‌ని తిరిగి ఆయన పోస్టులో స్టాలిన్ నియమించారు. విచిత్రమేమంటే మంత్రిగా ఆయన కొనసాగడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమంటూ గట్టిగా చీవాట్లు పెట్టిన తర్వాత మాత్రమే సెంథిల్ పదవికి రాజీనామా చేశారు. అంతకుముందు కొన్ని నెలల పాటు ఆయన మంత్రిగానే కొనసాగారు! అదేవిధంగా జార్ఖండ్ ముఖ్యమంత్రిగా రాజీనామా చేసిన వెంటనే హేమంత్ సొరేన్‌ను అవినీతి ఆరోపణలపై ఈడీ అరెస్ట్ చేసింది. రాజకీయ నాయకుల ఇటువంటి నైతికనిష్ఠ లేని అసంబద్ధ చర్యలకు రాజ్యాంగపరమైన పరిష్కారం చూపాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిర్ణయించి, ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టింది. అంతేకాదు "అవినీతిని ఎంతమాత్రం సహించేది లేదు" అంటూ ప్రధాని నరేంద్రమోదీ ఎప్పటికప్పుడు నొక్కి చెబుతున్న నేపథ్యం కూడా ఈ బిల్లు ప్రవేశపెట్టడం వెనుక ఉంది. గత పన్నెండేళ్ల ఎన్డీఏ పాలనలో కనీసం 12 మంది విపక్షాలకు చెందిన మంత్రులు 30 రోజులకు పైగా జైలు పాలయ్యారు. వీరిలో 9 మంది ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందినవారని పేర్కొంటూ విపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. గత జులై నెలలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ మాట్లాడుతూ ఈడీని కేవలం తమ రాజకీయ కక్షలను తీర్చుకోవడానికే ఉపయోగిస్తున్నారని వ్యాఖ్యానించడం గమనార్హం.

ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

ఆగస్టు 22న ప్రధాని నరేంద్రమోదీ బిహార్‌లో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తూ, మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, నైతిక బాధ్యతగా తన పదవికి రాజీనామా చేయాల్సింది పోయి, పదవిని అంటిపెట్టుకునే జైలుకెళ్లడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారన్నారు. అంతేకాదు తన పదవికి రాజీనామా చేయడానికి తిరస్కరించడం ఏ ప్రజాస్వామ్య సంప్రదాయం? అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి జైలు నుంచే ఫైళ్లపై సంతకాలు చేయడం విచిత్రాల్లోకెల్లా విచిత్రం! ఇట్లాగైతే అవినీతిపై పోరాటం ఎలా సాగుతుంది? నేరగాళ్లు జైల్లో ఉండే పరిపాలన కొనసాగించాలా? అని ప్రశ్నించారు. లిక్కర్ వ్యవహారంలో జైలుకు వెళ్లిన కేజ్రీవాల్, తమిళనాడుకు చెందిన మంత్రి సెంథిల్ కుమార్ నుద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. గతంలో బీజేపీ కురువృద్ధుడు ఎల్.కె అద్వాణీ ప్రస్తుత హోంశాఖ మంత్రి అమిత్‌షాలు తమపై ఆరోపణలు వచ్చినప్పుడు తమ పదవులకు

రాజీనామా చేసి, సచ్ఛీలత రుజువైన తర్వాతనే తిరిగి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ నైతికత కేజ్రీవాల్‌లో లోపించింది! ఈ జైలు బిల్లును కేవలం బిహార్‌లోని పట్టణ ప్రాంత, మధ్యతరగతి ఓటర్లను ప్రభావితం చేయడానికి మాత్రమే కేంద్రం ప్రవేశపెట్టిందని కొందరు విమర్శకుల వాదన. ప్రస్తుతం కాంగ్రెస్ తదితర విపక్షాలు, తమ ప్రభుత్వాలను పడగొట్టడానికే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈచట్టాన్ని తీసుకొస్తున్నదని వాదిస్తున్నాయి.

రాహుల్ అనాలోచిత చర్య

యూపీఏ ప్రభుత్వ హయాంలో న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ఇప్పటికీ అమల్లో ఉంది. దీని ప్రకారం ఎవరైనా ప్రజాప్రతినిధి రెండేళ్లు జైల్లో ఉంటే అతను తన పదవిని కోల్పోతాడు. కానీ దీనివల్ల ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదమున్నదన్న ఆలోచనతో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఈ తీర్పు వర్తించని రీతిలో ఒక ఆర్డినెన్స్‌ను తీసుకువస్తే దాన్ని రాహుల్ గాంధీ మీడియా సమావేశంలో దాన్ని చించివేశారు. నిజం చెప్పాలంటే ఇది రాహుల్ గాంధీ ఆలోచనా రాహిత్యానికి, అవగాహనా లోపానికి గొప్ప నిదర్శనం. తాను ఏకంగా తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈవిధంగా చేస్తున్నానన్న కనీస ఆలోచన లేకుండా చేసిన పనికి అప్పట్లో కాంగ్రెస్ నేతృత్వం లోని యూపీఏ ప్రభుత్వం ఇరుకున పడింది. దీనివల్ల గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమల్లోనే ఉండటంతో, జైలుశిక్ష పడిన ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ రాజ్యసభ సీటును కోల్పోయారు. తర్వాత కాలంలో రాహుల్ గాంధీకి ఒక కేసులో రెండేళ్లు శిక్షపడటం, లోక్‌సభ సభ్యత్వం రద్దవడం కూడా చరిత్ర. తర్వాత సుప్రీంకోర్టుకు వెళ్లి తన సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోగలిగారు. ★

అమెరికా సుంకాలకు జీఎస్టీ సంస్కరణలతో విరుగుడు

Toll Free : 1800 120 000 066 sudhakarind.com info@sudhakarind.com

జాగృత 'సంఘ శతాబ్ది'

- భారతదేశాన్ని విశ్వగురువుగా ప్రతిష్ఠించాలన్న నినాదంతో దేశానికి సేవ చేస్తున్న మహా సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్. వ్యక్తి నిర్మాణంతో ఒక జాతిని మహోన్నతం చేయవచ్చునని నిరూపించిన సంస్థ ఇది. అలాంటి ఆర్ఎస్ఎస్ శతాబ్ది సందర్భమిది (1925-2025). అందుకే ఈ దీపావళికి మీ చేతికి వచ్చే జాగృతి ప్రత్యేక సంచిక ఎన్నో ప్రత్యేకతలతో రూపుదిద్దుకోబోతున్నది. సంఘం నూరేళ్ల ప్రస్థానమే ఇందులో దర్శనమిస్తుంది.
- ప్రతి ఏటా మీ ఇంట దీపావళిని మరింత శోభాయమానం చేసే అక్షరజ్యోతుల సమూహం- జాగృతి ప్రత్యేక సంచిక.
- ఆత్మవిస్మృతి అనే చీకటిని చీలుస్తూ నిత్యం వెలిగే అక్షరావళి జాగృతి వారపత్రిక.
- విశ్వావసు దీపావళి సంచిక సంఘ శతాబ్ది సందర్భంగా వెలువడుతున్న సంచిక.
- ఆర్ఎస్ఎస్ ఆవిర్భావమే హిందూ సమాజంలో ఒక మలుపు. ప్రయాణమే ఒక పోరాటం. ఈ నూరేళ్ల చరిత్ర అసమానం. సేవ, దేశభక్తి ఉచ్ఛ్వాసనిశ్వాసాలుగా సాగుతున్న సంఘ ప్రస్థానం నిరుపమానం. ధర్మరక్షణ కోసం జరిపిన సమరం మహోన్నతం. ఈ అంశాలను గుర్తు చేస్తూ సంఘ పెద్దలు, ప్రముఖులు రాసిన వ్యాసాలతో ఈ దీపావళి ప్రత్యేక సంచిక ముస్తాబవుతున్నది.
- ఇంకా కథలు, కార్టూన్లు అదనపు ఆకర్షణ.

సంచిక తేదీ : అక్టోబర్ 20, 2025

త్వరపడండి!

అదనపు కాపీల కోసం పాఠకులు, ఏజెంట్లు అక్టోబర్ 06 లోగా జాగృతి కార్యాలయానికి 99599 97013 నంబరుకు ఫోన్ చేసి లేదా వాట్సప్‌లో సంప్రదించవచ్చు.

పేజీలు : 300
వెల : 200/-

- ➡ 25 నుంచి 50 కాపీలు ఆర్డరు చేసిన వారికి 30 శాతం
- ➡ 51 నుంచి 99 కాపీలు ఆర్డరు పెట్టుకున్న వారికి 35 శాతం
- ➡ 100, ఆ పైన కాపీలకు 40 శాతం డిస్కౌంట్ లభిస్తుంది.
- ✿ పార్శిల్ ఖర్చులు అదనం

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

అందరి బం

భారత్ విదేశీ విధానం అమెరికా, చైనా, రష్యా దేశాల మధ్య సమతూకం పాటించ డంలో విషమ పరీక్షను ఎదుర్కొంటున్నది. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి దానికి కేంద్రంగా మారింది.

భారత్ విదేశీ విధానంలో పెను మార్పు చోటు చేసుకుందా? లేక ఒక శాశ్వతమైన ప్రాతిపదికగా చైనా, రష్యా కూటమి వైపు మొగ్గు చూపుతోందా? మారుతున్న విదేశీ విధానం అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలో ఉన్న అమెరికా దేశానికి, భారత్‌కు మధ్య దూరాన్ని మరింత పెంచుతుందా? భారత్‌కు, ప్రపంచానికి మధ్య భౌగోళిక–రాజకీయ, వ్యూహాత్మక, ఆర్థిక వ్యవహారాల్లో ముమ్ముందు ఏం జరుగనుంది?

అంతర్జాతీయ వ్యవహారాల పట్ల కాస్తో కూస్తో పరిజ్ఞానం కలిగిన వారి మధ్య జరుగుతున్న చర్చల్లో పైన ప్రస్తావించిన తరహా సమాధానం లేని, ఎటూ తేల్చుకోలేని ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి. గూగుల్, వైబో నుంచి డోయిన్ దాకా కీలకమైన సమాచార రహదారులలోకి అడుగుపెట్టినప్పుడు సైతం ఇవే ప్రశ్నలు తటస్థపడుతున్నాయి.

ప్రధాని నరేంద్ర మోదీ జపాన్, చైనా దేశాల పర్యటనతో అంతర్జాతీయ అంశాలపై సంభాషణలు పతాక స్థాయికి చేరుకున్నాయి. జపాన్, చైనా దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత వైరం ఉంది. రెండో ప్రపంచ యుద్ధం 1945లో జపాన్ లొంగు బాటు దారి తీసింది. ఆ తర్వాత ఇరు దేశాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవడానికి ఎలాంటి విషయమూ లేకుండా పోయింది.

కొత్త మలుపులు తిరుగుతున్న భారత్ విదేశాంగ విధానం 10 అంశాలను తెరమీదకు తీసుకొని వచ్చింది. అవి..

- ప్రధాని మోదీ ఒకరంటే ఒకరికి ఏ మాత్రం పడని రెండు దేశాల్లో వరుసపెట్టి పర్యటనలు చేయడంతో విశ్లేషకులు, ప్రయోక్తలు, అంతర్జాతీయ వ్యవహారాల్లో తలపండిన విలేకరుల మెదళ్లలో అనేక ప్రశ్నలు ఉదయించాయి.
- చైనా, జపాన్ దేశాలు ఎడముఖం పెడముఖంగా ఉండటమే కాకుండా అంతర్జాతీయంగా రెండు వైరి శిబిరాల్లో చెరొక దానిని ఎంచుకున్నాయి. వాటి పంచన చేరాయి. ఆ శిబిరాలకు భౌగోళిక సమీకరణల్లో భారీ వ్యవహారాలు ఉన్నాయి. చైనా, రష్యా దేశాలకు అమెరికా నేతృత్వంలోని నాటో కూటమి అంటే ఏ మాత్రమూ పడదు. జపాన్ నాటో కూటమితో జట్టు కట్టింది.
- అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వాణిజ్యానికి కోరలు తొడిగారు. భారత్ వస్తు, సేవలపై 50 శాతం సుంకాన్ని విధించారు. ఇరుదేశాల మధ్య సంబంధాల వారధిని చేజేతులా తగలబెట్టేశారు. ఈ నేపథ్యంలో మోదీ విదేశీ పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.
- ప్రధాని మోదీ తన రెండు దేశాల పర్యటనలో భాగంగా చైనాలోని తియాన్‌జిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ–ఎస్‌సీవో 20వ సదస్సుకు హాజరయ్యారు. చైనా సదస్సుకు ఆతిథ్యం ఇచ్చి అధ్యక్షత వహించింది. మోదీ హాజరైన ఎస్‌సీవో సదస్సు ద్వారా తన స్థానాన్ని సుస్థిరపరుచుకోవాలని గ్లోబల్ సౌత్ నెట్‌వర్క్ ఆశిస్తోంది.
- భారత్ అమెరికా, చైనాలతో తన సంబంధాలను పునర్ నిర్మించుకోవడం ద్వారా స్వయంప్రతిపత్తి కలిగిన తన వ్యూహాత్మక విధానాన్ని పరీక్షకు పెడుతోందని అనేక మంది విశ్లేషకులు భావిస్తున్నారు.
- భారత విదేశీ వ్యవహారాల శాఖలోని ఉన్నతాధి కారులు అమెరికాతో సంబంధాలు తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయని ఆశిస్తున్నారు. గతంలో పోఖ్రాన్ అణుపరీక్షలు అనంతరం భారత్‌పై అమెరికా ఏకపక్షంగా ఆంక్షలు విధించింది.
- అమెరికా బెదిరింపు ఎత్తుగడలకు భారత్ ఇక ఏ మాత్రం తలొగ్గదు. ఆలాగని తన పనిని కానిచ్చుకోకుండా కుదురుగా ఉండలేదు. భారత్ అందుకోసం ఎలాంటి తొట్రుపాటు లేకుండా అత్యంత సమతూకంతో కూడుకున్న చర్యను ఆచితూచి చేపట్టే అవకాశం ఉంది.
- భారత్ ప్రస్తుత మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులు ఆధారంగా రష్యా లేదా మరో దేశంతో చమురు వాణిజ్యాన్ని కొనసాగించకూడదు అని అనడం వెనుక ఎలాంటి కారణం కనిపించడంలేదు. రష్యా, దాని భాగస్వామ్య దేశాలతో సహజ వాయువుకు సంబంధించి ఆకర్షణీయమైన ఒప్పందాలను కొనసాగిస్తున్న అటు ఐరోపాకు కానీ ఇటు అమెరికాకు కానీ చమురు వాణిజ్యాన్ని సాకుగా చూపి భారత్‌ను ఇరుకునపెట్టే అర్హత ఏ మాత్రం లేదు.
- ప్రధాని మోదీ జపాన్, చైనా పర్యటన భారత్ ఒకరంటే ఒకరికి ఏ మాత్రం పడని రెండు దేశాలతోనూ ముందుకు పోగలదని సూచించింది. అందుకు నిదర్శనం అన్నట్టుగా భారత్– జపాన్ మధ్య కుదిరిన 170 ఒప్పందాల ద్వారా భారత్‌లో జపాన్ పెట్టుబడులు 34 బిలియన్ డాలర్ల నుంచి

ధువు భారత్

68 బిలియన్ డాలర్లకు ఎగబాకాయి. ఇది ఇరుదేశాల వ్యూహాత్మక, ప్రత్యేక సంబంధానికి అతి పెద్ద విజయం. భారత్‌లో విదేశీ పెట్టుబడుల ప్రవాహాన్ని ఎండబెట్టడం ద్వారా ఒక దుర్మార్గమైన వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేలా భారత్‌పై ఒత్తిడి తెస్తున్న అమెరికాకు భారత్‌లో జపాన్ పెట్టుబడులు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాయి.

❊ జపాన్‌పై విజయాన్ని చైనా వేడుకగా జరుపుకున్న అతి పెద్ద కార్యక్రమం దరిదాపులకు కూడా భారత్ వెళ్లలేదు. తద్వారా ప్రపంచంలో తనకు చాలా మంది మిత్రులు ఉన్నారనే భారీ సందేశాన్ని చైనాకు ఇచ్చింది.

ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక సమావేశం ఇరుదేశాల మధ్య సంబంధాల పునర్ నిర్మాణానికి కీలకంగా మారింది. వారు ఆ సమావేశానికి "ప్రత్యర్థులుగా కాకుండా" అభివృద్ధిలో భాగస్వాములుగా పాలుపంచుకోవడం గమనార్హం. సంబంధాలు సాధారణ స్థితికి చేరుకునే దిశగా వేసిన మొదటి అడుగు మంచి ఉద్దేశంతోనే పడింది. కానీ కొన్ని సవాళ్లు ఉన్నాయి. ముఖ్యంగా సరిహద్దులు, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ ద్వారా వాకిలి ముందుకు చైనా ప్రాజెక్టులు తీసుకొని వచ్చే బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్–బీఆర్ఐ లాంటివి ఉన్నాయి.

భారత్, చైనా దేశాలు 75 సంవత్సరాల దౌత్య సంబంధాలను వేడుకగా జరుపుకోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ద్వైపాక్షిక సమావేశాల ఫలితాలపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ప్రధాని మోదీ సరిహద్దు వద్ద శాంతి, సామరస్యం భవిష్యత్తులో ఇరు దేశాల సంబంధాలకు ఒక ఇన్సురెన్సు పాలసీ వంటిది అని చెప్పడం ఒక కీలకమైన అంశంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

సంబంధాల పునర్నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో డ్రాగన్, ఏనుగు ఒకే చోట ఇమడగలవా? అనే బిలియన్ డాలర్ల ప్రశ్న ఉత్పన్న మైంది. ఇరుదేశాలు సంబంధాలను పునర్నిర్మించుకోవ డానికి ఒక సహేతుకమైన ఐచ్ఛికం, పంపక బాధ్యత ఉండాలని ఒక చైనా విద్యావేత్త అన్నారు.

తియాన్‌జిన్‌లో ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ద్వైపాక్షిక చర్చల కోసం ఒకే కారులో రిడ్జ్ కార్ల్‌టోన్ హోటల్‌కు చేరుకోవడం ఒక ఆహ్లాదకరమైన వాతావరణంలో చర్చలు జరగడానికి దారి తీసింది. ప్రోటోకాల్‌ను తోసిరాజని మరీ రష్యాలో తయారైన ఒక కారులో మోదీ, పుతిన్ ప్రయాణిస్తున్న వీడియోలు, ఫోటోలు ఐరోపా యూనియన్ లేదా అమెరికాకు ఏ మాత్రం మింగుపడనివిగా మిగిలిపోయాయి. ఉక్రెయిన్–రష్యా మధ్య నెలకొన్న ఘర్షణను మోదీ జరిపిస్తున్న యుద్ధంగా అమెరికా పేర్కొన్నప్పటికీ ఇద్దరు నేతల భేటీపై ఆ మాటల ప్రభావం నామమాత్రంగా కూడా లేకపోవడం విశేషం. 2025తో ఇండో– రష్యా వ్యూహాత్మక భాగస్వామానికి 15 సంవత్సరాలు వచ్చాయి. ఈ భాగస్వామ్యం ఈ ఏడాది పూర్తి కార్యాచరణకు ఉపక్రమిస్తుంది.

భారత్ వైపు నుంచి చూసినప్పుడు 20 దేశాలతో జరిగిన ఎస్‌సీవో సదస్సు కొన్ని విజయాలను అందించాయి. పెహల్గావ్ ఉగ్రదాడిని సదస్సు ఏకగ్రీవంగా ఖండించడం భారత్ ఊహించిన దౌత్య విజయంగా మిగిలిపోతుంది. అలాగే సంబంధిత కరెన్సీలలో చెల్లింపులు జరిపేలా వేర్వేరు ఎస్‌సీవో సభ్యదేశాల మధ్య వాణిజ్య సంబంధాలు విస్తరించడం అతిపెద్ద విజయంగా పరిగణించాలి. దీంతో అమెరికా డాలర్, యూరో కరెన్సీలతో వాణిజ్యానికి ఉన్న సంబంధం క్రమక్రమంగా తెగిపోతుంది. చైనా కరెన్సీ రెన్‌మిన్‌బీ, రష్యా రూబెల్, భారత్ రూపాయికి ఆమోద యోగ్యతకు సంబంధించి ఆదరణ పెరుగుతుంది.

చైనా ప్రదర్శనకు తెరపడింది. అదే సమయంలో జిన్‌పింగ్, పుతిన్, మోదీల మధ్య కొత్తగా నెలకొన్న స్నేహబాంధవ్యం నుంచి పుట్టుకొచ్చే పరిణామాలతో ట్రంప్ పాలనాయంత్రాంగానికి, బ్రస్సెల్స్‌లో ఐరోపా యూనియన్ ప్రధాన కార్యాలయంలో పెద్దలకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది.

కె.ఎ.బదరీనాథ్

డైరెక్టర్ & చీఫ్ ఎగ్జిక్యూటివ్, సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ అండ్ హోలిస్టిక్ స్టడీస్, న్యూఢిల్లీ.

తెలంగాణలో ఓవైపు ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థల కార్యాచరణలు అందరినీ ఆహా ఓహో అనిపిస్తుంటే, మరోవైపు.. మోసపూరితమైన దందాలు సమాంతరంగా సాగిపోతున్నాయి. పక్క రాష్ట్రం పోలీసులు వచ్చి బట్టబయలు చేస్తేగానీ రాష్ట్ర రాజధానిలో జరుగుతున్న దారుణమైన దందా గురించి స్థానిక పోలీసులు గానీ, ఇక్కడి నిఘా సంస్థలు గానీ, ప్రత్యేకంగా ఆకట్టుకునేలా పేర్లు పెట్టి మరీ రూపొందించిన ప్రత్యేక బృందాలు గానీ పసిగట్టలేక పోయాయి. అది వేలాది మంది విద్యార్థులు, యువకుల భవిష్యత్తును అంధకారంలో ముంచెత్తుతున్న వేల కోట్ల రూపాయల అక్రమ దందా.

డ్రగ్స్ కార్ఖానా హైద

రాష్ట్రంలో, ముఖ్యంగా రాష్ట్ర రాజధాని నగరం హైదరాబాద్‌లో గణపతి నవరాత్రుల ముగింపు వేడుకలు, నిమజ్జన హోరు ఆవరించి ఉన్న సమయంలో మహారాష్ట్రలోని మిరా-భయాందర్, వసాయి-విరార్ పోలీసు- ఎంబీవీవీ అధికారులు అతిపెద్ద మాదక ద్రవ్యాల తయారీ కేంద్రాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ఛేదించారు. పోలీసుల మెరుపు దాడుల్లో ఏకంగా 12 వేల కోట్ల రూపాయల విలువైన మాదక ద్రవ్యాలు పట్టుబడటంతో రాష్ట్ర పోలీసులు ఉలిక్కిపడ్డారు. రాష్ట్రంలో ఇప్పటివరకు పట్టుబడిన, బట్టబయలు చేసిన మాదక ద్రవ్యాల దందాల్లో ఇదే అతిపెద్దదని రికార్డులు చెబుతున్నాయి. మన పోలీసులు, దర్యాప్తు సంస్థలు మాత్రం తాపీగా ఇలాంటి దందాలపై ఉక్కుపాదం మోపుతామని, నగర శివారుల్లో ఉన్న ఇలాంటి రసాయన పరిశ్రమల గుట్టు విప్పుతామని షరా మామూలుగా మైకుల ముందు ప్రకటనలు చేస్తున్నారు. మరోవైపు.. విపక్షాలు కూడా ఈ పరిణామంపై గొంతెత్తడంతో రాజకీయంగానూ ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. పక్క రాష్ట్రం పోలీసులు వస్తే గానీ, ఇక్కడి పోలీసులకు ఏం జరుగుతుందో తెలియడం లేదా? అని నిలదీస్తున్నాయి ప్రతిపక్షాలు.

దశాబ్ద కాలంగా కొనసాగుతున్న దందా!

ఈ దందా దాదాపు దశాబ్ద కాలంగా కొనసాగుతోందని ముంబై పోలీసులు తేల్చారు. గతంలోనే ఈ మాదక ద్రవ్యాల దందా నిర్వాహకులు పట్టుబడి జైలుకు వెళ్లినా.. బయటకు వచ్చిన తర్వాత మళ్లీ ఇదే దందా కొనసాగిస్తున్నారని తేల్చారు. అంటే, ఒకసారి ఇదే కేసులో జైలుకు వెళ్లి బయటకు వచ్చిన నిందితుడిపై నిఘా పెట్టక పోవడంపై చర్చ జరుగుతోంది. ముఖ్యంగా అంతకుముందు పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గానీ, ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గానీ దీనిని గుర్తించక పోవడంపై విస్మయం వ్యక్తమవు తోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పక్క రాష్ట్రం పోలీసులు వచ్చేదాకా ఇక్కడి పోలీసులేం చేస్తున్నారంటూ ప్రశ్నించారు.

తెలంగాణ పోలీసులు,
నిఘా సంస్థల పనితీరు ప్రశ్నార్థకం

రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల కట్టడి కోసం ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్- ఈగల్, హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్- హెచ్-ఎన్‌యాడబ్ల్యూ, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్-డీసీఏ వంటి విభాగాలను ఏర్పాటు చేసింది. అయితే ఇవేవీ మాదక ద్రవ్యాల పరిశ్రమను గుర్తించలేకపోవడం గమనార్హం.



ప్రకటనలు భేష్

తెలంగాణలో మాదక ద్రవ్యాల వాడకానికి తావు లేదని.. మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న వాళ్లు, వాటిని వినియోగిస్తున్న వాళ్ల వెన్నులో వణుకు పుట్టిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పలుమార్లు, పలు వేదికలపై పదేపదే స్పష్టం చేస్తూనే ఉన్నారు. వీటికోసమే ఇంతకు ముందు పనిచేస్తున్న పలు సంస్థల పేర్లు ఆకర్షణీయంగా మార్చేశారు కూడా. యువతను మత్తుతో చిత్తు చేస్తోన్న ముఠాల పనిపట్టేందుకు, మాదక ద్రవ్యాలు, గంజాయి కట్టడికి ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

రూ.12వేల కోట్ల ముడి పదార్థాలు

హైదరాబాద్‌లోని చర్లపల్లిలో వెలుగులోకి వచ్చిన

రాబాద్?!

మాదక ద్రవ్యాల తయారీ పరిశ్రమలో సంచలన విషయాలు బయటపడ్డాయి. సెప్టెంబర్ 5న ఎంబీవీవీ పోలీసులు చర్లపల్లి పారిశ్రామికవాడలోని, నవోదయ కాలనీలో వాగ్దేవి ల్యాబొరేటరీస్‌పై మెరుపు దాడులు చేశారు. రూ.12 వేల కోట్ల విలువైన మాదక ద్రవ్యాల తయారీకి అవసరమైన ముడి రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో 5 కిలోల 968 గ్రాముల మెఫెడ్రోన్, 200 డ్రమ్ముల్లో నిషేధిత మాదక ద్రవ్యాల తయారీకి వినియోగించే 35,500 లీటర్ల రసాయనాలు, 19 పెట్టెల్లో 950 కిలోల మిథైలిన్ డైక్లోరైడ్ పౌడర్ ఉన్నాయి. ఎంబీవీవీ పోలీసులు వాగ్దేవి ఇన్ఫో సైన్స్‌లో భారీగా నిల్వచేసిన మాదక ద్రవ్యాల పౌడర్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. వాటిని రెండు లారీలలో థానేకు తరలించారు. నిందితులు శ్రీనివాస్ విజయ్ ఓలేటి, తానాజి పండరి నాథ్ పట్వారీలను థానే కోర్టులో హాజరుపరిచారు. శ్రీనివాస్ విజయ్ ఓలేటి దశాబ్ద కాలంగా నిషేధిత మాదక ద్రవ్యాలను తయారు చేసి డీలర్లకు అమ్ముతున్నాడు. అనుమానం రానివిధంగా ప్రతిసారి కనీసం 5 కిలోల మెఫెడ్రోన్‌ను సరఫరా చేసేవాడు. కిలో రూ.50 లక్షల చొప్పున ఏజెంట్లకు అమ్మేవాడు.

మూతపడిన కర్మాగారాల్లో తయారీ

కొన్ని ముఠాలు మాదక ద్రవ్యాల తయారీకి హైదరాబాద్ శివార్లలో మూతపడిన కర్మాగారాలు, గోదాములను ఎంపిక చేసుకుంటున్నాయి. వాటిని అద్దెకు తీసుకుంటున్నాయి. మాదక ద్రవ్యాల తయారీ కేంద్రాలుగా మార్చేసుకుంటున్నాయి. గతంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్–డీఆర్ఐ జరిపిన సోదాల్లోనూ సంగారెడ్డి, పటాన్‌చెరు, జిన్నారం, జహీరాబాద్, జీడిమెట్ల, బాలానగర్, చర్లపల్లి తదితర ప్రాంతాల్లో కొన్ని మూతపడిన కర్మాగారాల్లో అల్ప్రాజోలం సహా ఇతర మాదక ద్రవ్యాల తయారీని గుర్తించారు.

ప్రైవేట్ బస్సులు, కొరియర్ సంస్థలతో సరఫరా

ల్యాబ్ ముసుగులో మాదక ద్రవ్యాల కర్మాగారాన్ని నడుపుతుండడం.. అందులో కోట్ల రూపాయల విలువైనవి తయారవుతుండటం అందరినీ ఆశ్చర్య పరుస్తోంది. అయితే గుట్టుచప్పుడు కాకుండా తయారు చేసినప్పటికీ వాటిని ఇక్కడి నుంచే ఇతర ప్రాంతాల్లోని ఏజెంట్లకు చేరవేయాల్సి ఉంటుంది. ప్రైవేటు బస్సులు, కొరియర్ సంస్థల ద్వారా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్కడినుంచి దేశాలు కూడా దాటిస్తున్నారు. వీటన్నింటిపై నిఘా పెట్టాల్సిన ప్రభుత్వ విభాగాలు, పోలీసులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

కార్మికుడి అవతారంలో ముంబై పోలీసు అధికారి

ఎంబీవీవీకి చెందిన అధికారి నెలరోజుల ముందే వాగ్దేవి ల్యాబ్స్‌లో కార్మికుడిగా చేరారు. కంపెనీకి వివిధ ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్న ముడి సరుకులు, రసాయనాలు, మాదక ద్రవ్యాల తయారీ కేంద్రం, కార్మికులు, రవాణా ఏర్పాట్లు తదితరాలపై నిఘా పెట్టారు. వివరాలు సేకరించారు. పక్కా ఆధారాలు దొరకగానే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఎంబీవీవీ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ భడక్, తన బృందంతో వాగ్దేవి ల్యాబ్స్‌పై మెరుపు దాడులు చేశారు. మాదక ద్రవ్యాల తయారీ గుట్టును రట్టు చేశారు.

బెయిల్ మీద జైలు నుంచి బైటికొచ్చి...:

ఎంబీవీవీ పోలీసులు బాంగ్లాదేశ్ యువతి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా మాదక ద్రవ్యాల పరిశ్రమను కనిపెట్టారు. నిందితుడు శ్రీనివాస్‌విజయ్ ఓలేటి గతేడాది ముంబైలో మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు నమోదైంది. ముంబై కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బయటకు వచ్చాడు. హైదరాబాద్ కేంద్రంగా మాదక ద్రవ్యాల తయారీ మొదలు పెట్టాడు. కొన్నేళ్లుగా హైదరాబాద్ నుంచి ముంబై, బెంగళూరు, ఢిల్లీ వంటి మెట్రో నగరాలతోపాటు బాంగ్లాదేశ్ వంటి ఇతర దేశాలకు కూడా మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్నాడు. హైదరాబాద్ కేంద్రంగా వాగ్దేవి ల్యాబ్స్‌తో పాటు వాగ్దేవి ఇన్నోసైన్స్, అటెంటివ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లను నిర్వహిస్తున్నాడు.

రసాయనిక కర్మాగారాలు, గోదాములపై నిఘా

మాదక ద్రవ్యాల పరిశ్రమ వెలుగులోకి రావడంతో రాచకొండ పోలీసులతో పాటు, ఈగల్, హెచ్–ఎన్‌యాడబ్ల్యూ, డీసీఏ సిబ్బంది అప్రమత్త మయ్యారు. రసాయనిక కర్మాగారాలపై , మూతపడిన కంపెనీలు, గోదాములపైన నిఘా పెంచారు.

సుజాత గోపగోని

సీనియర్ జర్నలిస్ట్, 6302164068

ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ నూతన అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ 'సారథ్యం' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించారు. ఆ సందర్భంగా పార్టీ జిల్లా, స్థానిక నాయకులు కార్యకర్తలను కలిశారు. ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. కార్యకర్తలకు పార్టీ, రాజకీయ పదవులు లభించేలా అన్ని రకాల ప్రాధాన్యతలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. స్థానిక కూడలి ప్రాంతాల్లో ఏర్పాటైన చాయ్‌పే చర్చా కార్యక్రమాల్లో పాల్గొన్నవారు తమ ప్రాంతాల్లోని అపరిష్కృత సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. జిల్లాల అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, యువత ఉపాధి వంటి అంశాలపై విలువైన సలహాలు అందాయి. ఉదాహరణకు, ఒంగోలులో విద్యావేత్తలు, వైద్యులు, కర్నూలులో న్యాయవాదులు, విశాఖలో పారిశ్రామికవేత్తలు, ఇంజనీర్లు, ఏలూరులో చేపలు, రొయ్యల సాగురైతులు అనంతపురంలో ఉద్యానవరైతులు పాల్గొన్నారు.

'సారథ్య' పర్యటనతో కొ

భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కొత్త సారథి మాధవ్ ఇరవై అయిదు 'సారథ్య' యాత్రలు చేపట్టి, అందులో భాగంగా పెద్ద ర్యాలీలు నిర్వహించారు. సాయంత్రం మేధావులు, వ్యాపార ప్రముఖులతో సమావేశమై వారి నుంచి సలహాలు స్వీకరించారు. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమలో ప్రత్యేక సమస్యలపై హామీలు ఇచ్చారు. కోస్తాలో అమరావతి రాజధాని, సీమలో వెనుకబడిన అభివృద్ధి ప్యాకేజీలపై స్పందించారు. తిరుపతి, చిత్తూరులో స్థానిక సంస్థలు, భాషా ప్రాధాన్యతలు చర్చించారు. పార్టీని బలోపేతం చేయడంతో పాటు, వచ్చే స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణలను సిద్ధం చేయడం ఈ పర్యటన వ్యూహంగా కనిపిస్తోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని పొందడమే లక్ష్యంగా పేర్కొనవచ్చు. ఇతర పార్టీల నాయకులను ఆకర్షించే ప్రయత్నాలు జరిగాయి. ఎన్డీఏ ఐక్యతను బలపరచడం కూడా కనిపించింది.

కార్యకర్తలకు ప్రేరణ - నూతనోత్తేజం

సారథ్యం పర్యటనతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం గణనీయంగా కనిపిస్తోంది. మాధవ్ జిల్లాల వారీగా విస్తృత స్థాయి సమావేశాల్లో కార్యకర్తలను వ్యక్తిగతంగా కలిసేందుకు సాధ్యమైనంత వరకు ప్రయత్నించారు. 'ప్రతి కార్యకర్త పార్టీ నాయకుడు" అంటూ, వారికి పార్టీలో, ప్రభుత్వంలో ప్రాధాన్యం ఇస్తామని భరోసా ఇవ్వడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంచారు. నిస్తేజంగా ఉన్న కేడర్‌లో కొత్త జోష్ నింపడానికి ఈ పర్యటన పునాది వేసింది, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలు మళ్లీ ఉర్రూతలూగేలా చేసింది. కృష్ణా, ఏలూరు, రాజమండ్రి, కోనసీమ, గుంటూరు, పల్నాడు వంటి జిల్లాల్లో సమావేశాల్లో కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లాల్లో నిర్వహించిన ర్యాలీలు పార్టీ బలాన్ని సమర్థవంతంగా ప్రదర్శించాయి. ఉదాహరణకు, ఒంగోలు, గుంటూరు, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో ర్యాలీలకు పార్టీ కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజలు కూడా ఎండను లెక్కచేయకుండా భారీగా పాల్గొన్నారు. ఈ ర్యాలీలు ప్రత్యర్థి పార్టీలకు బలమైన సంకేతాలు పంపాయి. ముఖ్యంగా పార్టీ బలం తక్కువగా ఉన్న జిల్లాల్లో కూడా స్పందన బాగుంది. పల్నాడులో జరిగిన ర్యాలీలో టీడీపీ నాయకులు కూడా పాల్గొనడం ద్వారా ఎన్డీఏ ఐక్యతను చాటినట్లయ్యింది.

ఛాయ్ పే చర్చతో ప్రజాసమస్యల మథనం

యాత్రలో భాగంగా, మాధవ్ ప్రజలతో మమేక మవుతూ దినచర్యను ప్రారంభించారు. సామాన్య ప్రజలు, పేదలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, స్థానిక సవాళ్లపై ఆరా తీశారు. అణగారిన వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ ధ్యేయమని, వారి రాజకీయ, సామాజిక గుర్తింపునకు పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని హామీ ఇచ్చారు. స్థానిక స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చాయ్ పే చర్చా కార్యక్రమం ద్వారా ప్రజలు, పార్టీ అధ్యక్షుడికి మధ్య దూరం గణనీయంగా తగ్గింది. ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకున్నారు. గుంటూరులో జరిగిన కార్యక్రమంలో విద్య, వైద్యం, రహదారులు, డ్రైనేజీ వంటి సమస్యలతో పాటు ప్రభుత్వ పథకాల అమలులో లోపాలు ప్రస్తావనకు వచ్చాయి. తమ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి జరగాలని, కొత్త పరిశ్రమలు రావాలని, తమ పిల్లలకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కలగాలని జిల్లాల్లోని తల్లిదండ్రులు కోరారు. స్పందించిన మాధవ్, దీనిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

శాంతి భద్రతలపైనా స్పందన

శాంతి భద్రతలపైనా మాధవ్ స్పందించారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిపై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని వివరించారు. విద్యాసంస్థల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, డ్రగ్స్ రవాణ, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నామని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విజయనగరం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన ఇద్దరు యువకులకు పాకిస్థాన్

త్త వ్యూహం

ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు తేలడం అత్యంత ఆందోళనకరమని అన్నారు. దేశంలో మత ఘర్షణలు సృష్టించి, శాంతికి విఘాతం కలిగించాలని చూస్తున్న ఉగ్రవాదుల కుట్రలను తిప్పికొట్టాలని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. నిఘా వ్యవస్థలు మరింత పటిష్టంగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

జిల్లా వాసులకు అభివృద్ధిపై భరోసా

ప్రతి జిల్లాల్లో ఆ ప్రాంత సమస్యలను ప్రస్తావించి హామీలు ఇచ్చారు. రాయలసీమలో సాగునీరు, కేంద్ర నిధులతో బెంగళూరు–అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే, కడప ఎయిర్‌పోర్టు అభివృద్ధి వంటి ప్రాజెక్టులకు హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రలో వలసలు, కోస్తాలో రైతుల సమస్యలపై కూడా దృష్టి సారించారు. పల్నాడులో 4,400 కి.మీ. హైవేలు, రూ.3,000 కోట్ల అమరావతి ఔటర్ రింగ్ రోడ్ వంటి రోడ్‌మ్యాప్ చూపించారు. ముఖ్యంగా కేంద్ర నిధులతో అభివృద్ధి చేస్తామని స్పష్టత ఇవ్వడం ద్వారా ఈ హామీలు ప్రజల్లో నమ్మకాన్ని కలిగించాయి,

కొల్లేరు ప్రాంతంలోని దాదాపు మూడు లక్షల మంది పేదల సంబంధించిన దశాబ్దాల సమస్యల పరిష్కారం చూపి న్యాయం చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందని మాధవ్ వివరించారు. ఏలూరు జిల్లాలో ఆక్వా, నిమ్మ రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆక్వా కల్చర్ అభ్యున్నతి, రవాణా, ఇతర మౌలిక సదుపాయాల కోసం రాబోయే రోజుల్లో రూ.550 కోట్లతో సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నామని చెప్పారు.

విపరీతంగా పెంచిన విద్యుత్ ఛార్జీల భారాన్ని తట్టుకోలేక ఎన్నో ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలు నష్టాల పాలై మూతపడ్డాయని విజయనగరం జిల్లా వాసులకు గుర్తుచేస్తూ, కూటమి ప్రభుత్వం పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తుందని, పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు అందించి, మూతపడిన పరిశ్రమలను తిరిగి తెరిపించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లాలో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తామని, జంఝావతి, తోటపల్లి ప్రాజెక్టులతో సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అనాస హబ్ ఏర్పాటుతో రైతులకు ధర, యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్, జాతీయ రహదారితో ఆర్థికాభివృద్ధి సాధిస్తామని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ వెనుకబాటును తొలగిస్తామని, ఆధునిక సేద్య పద్ధతులతో రైతుల దిగుబడి పెంచుతామని మాధవ్ నొక్కిచెప్పారు. పర్యాటకం, పుణ్యక్షేత్రాల అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయిస్తుందని హామీ ఇచ్చారు. భోగాపురం విమానాశ్రయం, మూలపేట పోర్టుతో పారిశ్రామిక ప్రగతి జరుగుతుందన్నారు. అల్లూరి జిల్లాలో గిరిజనులకు జల్ జీవన్ మిషన్‌తో తాగునీరు అందిస్తున్నామని, పీఎంజీఎస్‌వైతో రోడ్లు నిర్మించి విద్య, వైద్యం చేరువ చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ, జాతీయ రహదారి, వైద్య కళాశాల అభివృద్ధిని వేగవంతం చేస్తామని తెలిపారు. ఏకలవ్య స్కూళ్లు, అరకు కాఫీ ప్రోత్సాహం, జీవో 3 పునరుద్ధరణతో హక్కులు కాపాడతామన్నారు.

మచిలీపట్నం పోర్టు పనులు త్వరలోనే పూర్తవు తాయని, దీంతో స్థానిక యువతకు పెద్ద సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా వాసులకు హామీ ఇచ్చారు. పోర్టు సరకు రవాణాకే పరిమితం కాకుండా దానికి అనుబంధంగా పరిశ్రమలు స్థాపించేలా ప్రోత్సహిస్తామని, పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేసి, యువత వలసలు నివారిస్తామని పేర్కొన్నారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా 'స్వదేశీ దర్శన్' పథకం కింద మచిలీపట్నంకు కేంద్రం రూ.11 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఆంధ్ర బ్యాంక్ వ్యవస్థాపకులు, స్వాతంత్ర్య సమరయోధులు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి అవసరమైన అనుమతులు, నిధుల విడుదల కోసం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో వ్యక్తిగతంగా చర్చిస్తానని చెప్పారు. బందరు మిఠాయి, కలంకారి, రోల్డ్‌గోల్డ్ పరిశ్రమల అభివృద్ధికి తగు ప్రోత్సాహకాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

కడప జిల్లా కొప్పర్తిని పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్రం నిధులు అందిస్తోందని, జాతీయ రహదారుల నిర్మాణంతో పాటు, కడప విమానాశ్రయాన్ని కూడా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. నంద్యాల, కర్నూలు జిల్లాల్లో మాట్లాడుతూ, రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులను త్వరలో పూర్తి చేసేందుకు కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లాకు హైకోర్టు బెంచ్‌ను తీసుకొచ్చేందుకు, రాయలసీమకు స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు కూడా కృషి చేస్తామని, నీటి సమస్యలను పరిష్కరించడం, పర్యాటక రంగాన్ని అభివృద్ధిచేయడం వంటి అంశాలపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

అనంతపురం జిల్లాలో పర్యటిస్తూ రాయలసీమలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు రాబోతున్నాయని టమోటాకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ సైతం రాయలసీమకు రానుందని తెలిపారు. అనంతపురంలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ రావడం మంచి పరిణామమని అన్నారు. చిత్తూరు పాడి రైతులకు మంచి ధర లభించేలా చేస్తామని హామీ ఇచ్చారు. సత్యసాయి జిల్లాలో పర్యటిస్తూ జిల్లాలో పరిశ్రమలను స్థాపించి, యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో పండ్లతోటలకు సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుతో పాటు ఐటీ రంగ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం

పర్యటనలో కిసాన్ సమ్మాన్ నిధి, ఆయుష్మాన్ భారత్, జల్ జీవన్ మిషన్ వంటి పథకాలను బలంగా ప్రచారం చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలలో సింహభాగం నిధులు నరేంద్ర మోదీ ప్రభుత్వం అందిస్తున్న వాస్తవాన్ని గుర్తుచేస్తూ ఈ విషయాన్ని ప్రతి గడపకూ చేర్చాలని మాధవ్ కోరారు. రాష్ట్రానికి జీవనాడి పోలవరం ప్రాజెక్టు పనులు మరింత వేగవంతమయ్యేందుకు కేంద్రం ఇటీవల రూ.15 వేల కోట్లు కేటాయించింది. 'కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమిష్టి కృషితో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దీనివల్ల యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి' అని ప్రతి జిల్లాలో ప్రస్తావించారు.



తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

భాగం-3

మార్క్సిజం-శ్రీరామరాజ్యం

రాజకీయాలలో ఎవరు పాల్గొనాలి?

విద్వాంసులు, మహాత్ములు రాజకీయాలకు దూరంగా ఉండాలని చాలామంది చెబుతుంటారు. అయితే రాజనీతి శాస్త్రాన్ని అధ్యయనం చేసే పండితులు మాత్రం ఉండాలి. సమర్థ రామదాసు, చాణక్యుడు వంటివారిని ప్రశంసిస్తూనే వారు చేసిన మహాకృత్యాలను విస్మరిస్తూ ఉంటారు. ఈ ప్రజాస్వామ్యయుగంలో విద్వాంసులు రాజకీయాలను ప్రభావితం చేయాలని శ్రీకరపాత్రీ స్వామి సందేశమిస్తున్నారు.

'జానాతి ఇచ్ఛతి అధి కరోతి' అనేది ప్రసిద్ధమైన క్రమం. జ్ఞానం నుంచి ఇచ్ఛ పుడుతుంది. ఇచ్ఛ నుంచే క్రియ పుడుతుంది. 'యః క్రియావాన్ స పండితః' (సుభాషిత మంజరి) అని చెప్పడం కూడా ప్రసిద్ధంగా వినిపిస్తుంది. ప్రయోగహీనమైన శిల్పవిజ్ఞానం – శాస్త్రాది విజ్ఞానం వలెనే ప్రయోగహీనమైన రాజనీతి విజ్ఞానం కూడా వ్యర్థమైపోతుంది. క్రియాహీనమైన తర్కవితర్కాలు – జ్ఞానవిజ్ఞానాలు, బుద్ధి వ్యవసాయ మాత్రంగానే మిగిలిపోతాయి.

రావణుని పాలన కాలంలో జ్ఞాన– విజ్ఞాన యుక్తులైన రుషులకు ఏ మాత్రమూ కొదవ లేదు. అయినప్పటికీ రుషి వధ కొనసాగుతూనే పోయింది. వారి రక్తంతో నింపిన పాత్రలను తాగడానికి ఇచ్చినా కూడా రావణునికి సంతృప్తి కలగలేదు. రుషుల ఎముకలు కొండలంతగా పోగుపడ్డాయి అని తులసీదాస్ రామచరిత మానస్‌లో రచించారు.

ఆ సమయంలో సక్రియాపరుడైన విశ్వామిత్రుని రాజనీతి సఫలం అయింది. ఆయన వల్లనే రాముడు రణరంగంలోకి దిగాడు. దుష్టుల దర్పాన్ని అణిచి వేశాడు. దాంతో వేదరక్ష కలిగింది. సాధు సత్పురుషుల పోషణకు వేదరక్షణ ఆవశ్యకమైంది. ఎక్కడైతే రాజనీతిని సక్రమంగా బోధించే వాడు... ప్రయోగసాధనాలు లభిస్తుంటాయో అక్కడ... విద్వాంసులు ఉపదేశాలకు మాత్రమే పరిమితంగా ఉండిపోగలుగుతారు. అలాకాకుండా చెప్పేవారు, చేసేవారు లేనప్పుడు వాటి అన్వేషణ, నిర్మాణం కూడా విద్వాంసుల పనే అయి ఉంటుంది.

రాజులేని సమయంలో అందరికీ 'ఉత్తరదాయి త్వము' (సమాధానం చెప్పడానికి యోగ్యులైనవారు) కలిగిన విద్వాంసులకే ఆ పని అప్పచెప్పవలసి ఉంటుంది. చాణక్యుడు ఇటువంటి పనులే చేశాడు. సమర్థరామదాసు కూడా అలాగే చేశాడు. శుక్రుడు, బృహస్పతి మొదలైన వారు కూడా అనేక విధాలుగా సక్రియా రూపమైన రాజనీతిని బోధించారు. నిజమే విద్వాంసులు రాజ్యాధికారమనే ప్రలోభంలో పడి చదువు మానివేశారు. కానీ చదువు వారికి అత్యవ సరం. వారు చదవడం ఆపివేస్తే, రాజ్యంలో సరైన రాజనీతిని పాటించకపోతే... వేదము... అందులో బోధించిన ధర్మము సంకట గ్రస్థాలైపోతాయి.

సాధు సత్పురుషులు లేకపోతే పాలనలో విశృంఖలత చోటు చేసుకుంటుంది. గూండాలే రాజ్యం చేస్తారు. అప్పుడు ధార్మికులైన వారు రంగ ప్రవేశం చేస్తేనే సమస్య పూర్తిగా తొలగిపోతుంది. సచ్ఛిక్ష లేదా సద్విద్యను ప్రచారం చేయడం ద్వారానే సద్బుద్ధి కలుగుతుంది. సద్బుద్ధి నుంచి సదిచ్ఛ... దానినుంచి సప్రయత్నం... దాని నుంచి అన్ని రకాలైన సాఫల్యము కలుగుతాయని చెబుతుంటారు. ఇది సరైనదే. కానీ ఈరోజున బోధన కూడా స్వతంత్రులైన అధ్యాపకుల చేతిలో ఉండడంలేదు. పాలనాధికారం ఎవరి చేతిలో ఉంటుందో... వారి విధానాలను సమర్థించే పాఠ్యాంశాలే నేడు అందరికీ బోధింపబడుతున్నాయి. స్వతంత్రులైన ఉపాధ్యాయులు, వారి విద్యార్థులు కూడా స్వాతంత్ర్యం కోల్పోయి ప్రభుత్వాల అధికార పరిమితికి లోబడుతున్నారు.

కవులు, పీఠాధిపతులు కూడా నేడు ప్రభుత్వాలను కొనియాడడంలోనే తమ లాభాలను వెతుక్కుంటున్నారు. ఘోరనాస్తికులు, విశృంఖలులైన మంత్రులను, వివిధ పదవులలో ఉన్నవారిని కూడా విద్వాంసులు, మహంతులు, మండలేశ్వరులు ప్రశంసిస్తూనే ఉంటున్నారు. అందువల్ల నాస్తికులైన వారి చేతుల నుంచి రాజకీయ అధికారాన్ని రక్షించడానికి, యోగ్యులైన, ధార్మికులైన శీలవంతులైన వారి చేతిలో అధికారాన్ని ఉంచడానికి... మేధావి వర్గం ప్రయత్నాలు చేయాలి. మహాభారతంలో ఇదే విషయాన్ని ఇలా స్పష్టంగా చెప్పారు.

ప్రమాదాలనుంచి దేశాన్ని రక్షించడానికి, పరమ నిరపేక్ష వృత్తిలో నిలిచేవారు, విరక్తులు అయిన విద్వాంసులు పాలనలో కలగ చేసుకోవాలి. అంతేకాదు, ఎప్పుడైనా వేనుడివంటి అన్యాయవర్తనులైన అధికారంలోకి వస్తే... బుజ్జగించి, భయపెట్టి చెప్పినా వినిపించుకోకపోతే... అతడిని పదవి నుంచి దింపివేసి లేదా హతమార్చి... వాని స్థానంలో యోగ్యుడైన పాలకుడిని నియమించాల్సి వస్తుంది. విద్వాంసులు చేయాల్సిన పనులకు ఇదొక ఉదాహరణ.

రాజనీతిజ్ఞులుగా ప్రపంచ ప్రసిద్ధులైన పాలకులందరూ తమ పాలన పగ్గాలను తపఃపునీతులు, లోకహితైషులు, రాగద్వేష రహితులు అయిన రుషుల చేతిలో ఉంచడం చరిత్రలో మనకు అనేకసార్లు కనిపిస్తుంది. దేవతలకు ప్రభువైన ఇంద్రుడు తన రాజనీతిని దేవగురువైన బృహస్పతి చేతుల మీదుగా నిర్వహిస్తాడు. దైత్యరాజు బలి తన రాజనీతిని మహర్షి శుక్రాచార్యుని యందు నిలిపాడు. అలాగే రామ చంద్రుడు వశిష్ఠుని కనుసన్నలలో నడిచాడు. ధర్మరాజు తన ధౌమ్యుడు, వ్యాసుడు, శ్రీకృష్ణుడు, విదురుల సలహా మేరకు పాలించాడు. చంద్రగుప్తుడు తన పాలన పగ్గాలను మహర్షి చాణక్యునికి అందించాడు. అలాగే శివాజీ తన గురువైన సమర్థ రామదాసు మాటను జవదాట లేదు. అంకుశం లేకపోతే ఏనుగు, పగ్గాలు వేయకపోతే గుర్రమూ ఎంతటి ప్రమాదకారకం అవుతాయో... అలాగే అంకుశము లేదా నియంత్రణ లేకపోతే ప్రభుత్వం కూడా హానికారకం అవుతుంది.

రాజ్యశ్రీ సంపన్నులైన రాజులపైన కూడా అంకుశం ఉండితీరాలి. ఈ అర్థంలోనే రాజైనవారు ధర్మాన్ని పాటించాలని పెద్దలు చెప్పారు. బృహదారణ్యకం ప్రకారం, 'క్షత్రస్య క్షాత్రమ్' (1.4.14) ధర్మనియంత్రితమైన రాజధర్మాన్ని సిద్ధాంతీకరించారు. ధర్మం, కర్మ, సంస్కృతి, ధార్మిక సంస్థల రక్షణ అనేవి... ధర్మనియంత్రితుడైన రాజు ఉన్నప్పుడే సాధ్యమవుతాయి. అలా కాకపోతే విశృంఖలుడైన రాజు రాజ్యాన్ని ప్రమాదంలో పడ దోస్తాడు.

హిందీమూలం : కరపాత్రీ స్వామి

అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ

INTO
YOUR
LIFE
SURYA
INTO YOUR LIFE, WE BRING LIGHT, WARMTH, & STRENGTH.
INTO YOUR LIFE, WE BRING SURYA ROSHNI.
Surya Roshni is the trusted companion bringing light, warmth, and care to every moment. From purity in every sip to safe spaces, we bring innovation and reliability into your life. Let's brighten up your world together!
Consumer Lighting | Steel & PVC Pipes | Fans | Appliances | Professional Lighting
I am SURYA | 50 YEARS OF TRUST | DURABLE PRODUCTS | ASSURED QUALITY
SURYA ROSHNI LIMITED | www.surya.co.in | surya surya_roshni surya.roshni surya-roshni
Email: info@surya.in Tel.: +91-11-47108000

సుకవీంద్ర బృంద రక్షకుడెవ్వడనిన వీ
డను నాలుకకు దొడవైన వాడు
చిత్త నిత్య స్థితి శివుడెవ్వడనిన వీ
డను శబ్దమునకర్థమైన వాడు
దశ దిశా విశ్రాంత యశుడెవ్వడనిన వీ
డని జెప్పుటకు బాత్రమైనవాడు
సకల విద్యా కళాచరణుడెవ్వడనిన వీ
డని చూపుటకు గుఱియైన వాడు
మనుమసిద్ధి మహేశ సమస్త రాజ్య
భార దౌరేయడభిరూప భావభావుడు
కొట్టరువు కొమ్మనామాత్య కూర్మిసుతుడు
దీన జనతా నిధానంబు తిక్క శౌరి!

విక్రమసింహపురం, రాజ పేరోలగం

పొందికైన అందమైన ఆర్భాటాలేవీ లేని చక్కటి సమావేశ మందిరం.. మనుమ వంశీయులైన మహారాజుల ఘనమైన వారసుడు మనుమసిద్ధి భూపాలుడు సింహాసనాన్ని అధిష్టించి ఉన్నాడు. మందిరం వివిధ కార్యార్థులై వచ్చినవాళ్లతో కిటకిటలాడుతోంది.

మనుమసిద్ధి కుమారుడు, యువరాజు తిక్క కుమారుడు చురుకైనవాడు. తండ్రి మనుమసిద్ధి మహారాజు మంత్రులను సైన్యాధ్యక్షులను దగ్గరగా కూర్చోపెట్టుకుని ఏదో దీర్ఘంగా చర్చిస్తుండగా యువరాజు దైనందిన పాలనా వ్యవహారాలను ఇష్టంతో నిష్టతో తండ్రి తరఫున.. నియోగుల సహాయంతో నిర్వహిస్తున్నాడు.

అప్పటికి రెండవ జాము గడచింది.

మనుమసిద్ధి, మంత్రులతో పాటు యువరాజు తిక్క కుమారుడు కూడా మాటిమాటికి దూరంగా మహాద్వారం వంక చూస్తున్నారు. కాసేపటికి వారందరి నిరీక్షణ ఫలించింది. ఎదురుచూస్తున్న ఆ మహాపురుషుడు ద్వారం వద్ద ప్రత్యక్షమయ్యాడు.

కొట్టరువు తిక్కనామాత్యుడు!!

'దైవం మానుష రూపేణా' అన్నట్లుంటాడు తిక్కన. శ్రీకాళహస్తిలో కొలువైన శ్రీకాళహస్తీశ్వరుని అసలు నామం తిరుకాళత్తిదేవుడు. ఆ స్వామిపేరు పిల్లలకు పెట్టుకోవడం ఆ రాజ్యాలలో సర్వసాధారణం. దానిని సాధారణంగా తిక్క, తిక్కన, తిక్కయ, తిక్కప.. అంటూ పిలవడం, పలకడం విక్రమసింహపురివాసులకు అత్యంత ఇష్టం.

వెలనాడు రాజ్యవాసులు కొట్టరువు భాస్కరమంత్రి మనుమడు, కొమ్మనామాత్యుని కుమారుడు. ఆయన బలం సాహిత్యం. మహోన్నత పండితమూర్తి ఆయన. అదే సమయంలో ఆయన మహాయుద్ధ తంత్రజ్ఞుడు. నిజమైన మంత్రి పుంగవుడు. ఈ రాచరిక పాలన విశారదత్వం ఆయనకు తాతతండ్రుల నుండి సంక్రమించింది. కొన్ని తరాలుగా ఆయన తాతముత్తాతలు రాజ్యోద్యోగులు. గొప్ప గొప్ప పదవులను నిర్వహించిన వారు. వాటి ద్వారా మహారాజుల నుండి గొప్ప గౌరవ పురస్కారాలు పొందినవారు.

తిక్కన, మనుమసిద్ధి బాల్యస్నేహితులు. కలసి చదివారు. కలసి స్నేహపరిమళాలను ఆఘ్రాణిస్తూ ఎదిగారు. ఆయన రాజయ్యాడు. ఈయన పండిత ప్రకాండుడయ్యాడు. మామా.. అంటే అల్లుడూ అని కొంటెగా మొదలైన సరదా సరస సంభాషణలను నిజం చేస్తూ, అల్లుడూ నేనో కావ్యం రాస్తున్ననోయ్ అంటే అది నాకు ఇవ్వవా మామా.. అంటే నిజంగానే దానిని మిత్రునికి అంకితం చేసి మనుమసిద్ధి నామాన్ని అజరామరం చేశాడు మిత్ర కవిపండితుడు తిక్కనార్యుడు.

ఆయనను విక్రమసింహపురి రాజ్యానికి మహామంత్రి అంటారు తెలియనివారు, దూర రాజ్యాలవారు. పాలకుడైన మహారాజుకు సర్వం తానైనవాడు తిక్కన. అందుకే మహారాజుకే కాదు రాజ్యానికి, ప్రజలకు కూడా ఆయనే సర్వం. రాజ్యానికి మామ.. స్నేహితుడు.. మిత్రుడు.. కవి పండితుడు. విక్రమసింహపురానికి ఏ కష్టం వచ్చినా రాజుతో పాటుగా స్పందించి మార్గం వెదుక్కుంటూ వెళ్లి సామదాన భేదదండో పాయాలతో విజయవంతంగా పరిష్కరించి మిత్రుడు మనుమసిద్ధినే కాదు విక్రమ సింహపురి రాజ్యాన్ని కూడా కాపాడుతూ వస్తున్నాడు తిక్కనార్యుడు.



ఆయన దగ్గరకు వస్తున్నకొద్దీ మందిరంలోని సమస్త జనులు పెద్దలూ పిన్నలు కూడా లేచి నిలబడి వినమ్రంగా వంగి నమస్కరిస్తున్నారు. ఆయనను అర్ధనిమీలిత నేత్రాలతో నడిచే దైవాన్ని చూస్తున్నట్లు చూస్తున్నారు. యువరాజు తిక్క పరుగున వెళ్లి ఆయన పాదాలకు నమస్కరించి ఆయన ఆశీర్వదించే లోపే వెనక్కి వెళ్లి పోయాడు. అతని చురుకును చూసి మధురంగా నవ్వుకుంటూ మనుమసిద్ధి దగ్గరగా వెళ్లాడు తిక్కన. అందరూ లేచి నిలబడగా..

గణపతిదేవుడు

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

రాచరిక హోదాను, మిత్రత్వాన్ని కాపాడుతున్నట్లు సింహాసనం నుండి లేవకుండా మధురంగా నవ్వుతూ ఆప్యాయతతో చూస్తున్నవాడు మనుమసిద్ధి మహారాజు మాత్రమే.

దగ్గరకు వచ్చాక ప్రక్కనున్న సమున్నతాసనం చూపి, "ఆసనం అలంకరించు మామా.." అన్నాడు.

అక్కడ ఉన్న తోటి మంత్రులను, నియోగులను "విష్ణు రూపాయ నమశ్శివాయ.." అంటూ పలుకరించి నవ్వుతూ ఆసీనుడయ్యాడు తిక్కన.

"ఆలస్యానికి కారణం!" అన్నాడు మనుమసిద్ధి. తిక్కన ఆరోగ్యం గురించిన కుశల ప్రశ్న అది.

"ఓ సమాచారం తేవాల్సిన ఆశ్వికుని కోసం ఎదురుచూపులు మహారాజా! వస్తే రాజసభకు పంపమని అనుచరులకు చెప్పి వస్తున్నాను. ఆ.. ఏవిటి చర్చ?" అన్నాడు వర్తమానంలోకి వస్తూ.

మనుమసిద్ధి తాను చెప్పకుండా ప్రక్కనే ఉన్న అంతరంగిక వ్యవహారాల నియోగ మంత్రి కేసి చూశాడు. ఆయన గొంతు సవరించుకుని చెప్పడం ప్రారంభించాడు.

"మనకు పాండ్య రాజుల నుండి, చోళ రాజుల నుండి వస్తున్న వత్తిడి తమకు తెలియంది కాదు తిక్కనార్యా! నిన్న కూడా రెండు రాజ్యాల సంధి విగ్రహిలు వచ్చారు. వాళ్ల నుండి బేరాలు రాయ బేరాలూ.. మీకు తెలియంది కాదు కదా.." నవ్వాడు అమాత్యుడు. అందరూ ఆయన నవ్వులో పాలుపంచు కున్నారు.

ఒకప్పుడు వేంగీ రాజ్యానికి కప్పాలు కడుతూ రాజరాజనరేంద్రునికి సామంతరాజ్యంగా ఉన్న విక్రమసింహపురి ఆయన తరం ముగిశాక సామంత హోదాను వదిలించుకుని కప్పాలు కట్టడం మానేసింది.

ప్రస్తుతం చోళ రాజ్య వంశం పూర్తిగా నిర్వీర్య మయ్యింది. పాండ్యులు చోళులను తీవ్రంగా అణచివేసి తమిళ రాజ్య ప్రాంతాలలో ప్రచండశక్తిగా ఎదుగుతున్నారు.

పాండ్యులు కూడా నెల్లూరుకు స్నేహ హస్తం ఆహ్వానిస్తున్నారు.

దక్షిణావర్తంలోనే కీలకస్థానంలో ఉంది విక్రమ సింహపురి రాజ్యం. ఇటు దిగువ చోళ, పాండ్య, పల్లవ రాజ్యాలు.. పైన అతి సస్యశ్యామలమై ధనవంతమైన తెలుగు రాజ్యాలలోకి వెళ్లాలంటే నెల్లూరును ముందు దాటాలి. దాటాలి అంటే జయించాలి. అది అత్యంత క్లిష్టమైన అంశం. అందుకు అనేకానేక కారణాలు. అన్నిటిని మించి నెల్లూరుకు పెట్టనికోట తిక్కనామాత్యుని చాణక్యం.

నిజానికి తెలుగునాట చిన్నరాజ్యాలలో అత్యంత ధనికరాజ్యం విక్రమ సింహపురి. సముద్రతీర రాజ్యాలు, నదీ తీర రాజ్యాల వారు ఎప్పుడూ భాగ్య వంతులే. అటు నది, ఇటు సముద్రమూ కలిగిన రాజ్యాలైతే చెప్పేదేముంది! మిత్రులకు, శత్రువులకు కూడా అసూయ కలిగించే ధన ధాన్యరాశులలో తుల తూగుతుంటాయి.

తమిళులు అనాది కాలం నుండి నెల్లూరును తమ ఉత్తరాది రాజ్యంగా భావిస్తారు, చెప్పుకుంటారు. వేంగి వరకు తమరాజ్యంగా చెప్పుకునేవారు. ఇప్పుడు భాషారాజ్యాల భావనలు స్పష్టమయ్యాక వేంగి వరకు తమిళ రాజ్య భాగంగా ప్రకటిస్తున్నారు.

'మీరు తెలుగువారా.. తమిళులా' అని నన్నయ ప్రశ్నించినప్పుడు రాజరాజనరేంద్రుడు తాను తమిళు డనని స్పష్టం చేశాడని.. అందువల్లనే నన్నయ భారతాంధ్రీకరణ ఆపివేశాడని తిక్కన చెబుతుంటాడు. వేంగి రాజ్య మహా ప్రధాని వజ్జియ ప్రెగ్గడ తిక్కనా మాత్యునికి దగ్గరి బంధువు.

"సరే సరే.. మామా.. మీ అభిప్రాయం ఏవిటో సెలవివ్వండి.." అన్నాడు మనుమసిద్ధి తిక్కన నుద్దేశించి.

"మన మిత్రులంతా ఏమంటున్నారు?" అన్నాడు తిక్కన.

"ఏముంది.. మన మంత్రిమండలిలో సగంమంది చోళ సామంతులుగా ఉందామని.. మిగిలిన సగంమంది భవిష్యత్తు పాండ్యులది కాబట్టి పాండ్యుల స్నేహహస్తం అందుకుందామని అంటున్నారు.." అన్నాడు. తిక్కన అందరిని పరికించి చూశాడు. రెండు వర్గాలు ఆయన అభిప్రాయం కోసం రెప్పవేయకుండా చూస్తున్నాయి.

అప్పుడే మహాద్వారం నుండి భటుడు తిక్క కుమారుడి దగ్గరకు వచ్చి, తిక్కనార్యుని కోసం ఆయన అనుచరుడు వచ్చాడని విన్నవించగా తిక్క వెళ్లి తిక్కనకు చెప్పాడు.

చటుక్కున కదిలిన తిక్కన, "అతన్ని లోపలికి పంపండి... వెంటనే.." అన్నాడు.

ఆయన మాటల్లోనూ, ముఖంలోనూ కదలాడుతున్న ఉత్సుకత అందరికి తెలుస్తోంది.

అనుచరుడు తిక్కన దగ్గరకు వచ్చి చెప్పాడు.

"కాకతీయ యువరాజు గణపతిదేవుల వారిని దేవగిరి రాజ్యంలో కారాగారంలో ఉంచిన మాట వాస్తవమే మహామాత్యా.. ప్రస్తుతం ఆయనను సాధారణ కారాగారం నుండి రాజప్రాసాదంలోని ఓ గదిలో ప్రత్యేక బందీగా ఉంచారు. కాకతీయ సైన్యం యుద్ధభూమిలోని వారి స్కంధావారంలోనే ఉంది. ఏ క్షణమైనా యువరాజు కోసం సైన్యం దేవగిరిపై విరుచుకుపడే అవకాశం ఉంది."

అప్పటివరకూ కాస్త స్తబ్దుగా కనిపించిన తిక్కనార్యుడు, శబ్దమేదో విన్న సింహంలా దిగ్గున లేచాడు ఆసనం మీద నుంచి. వ్రేలికి ఉన్న ఉంగరం తీసి ఆ వార్తాహరునికి అందించాడు.

"గొప్ప శుభవార్త చెప్పావ్.. చాలు! దేవగిరిలో ఏం జరుగుతున్నదో ఎప్పటికప్పుడు నాకు తెలియాలి.."

"అలాగే మహామాత్యా.." అతడు ఉంగరాన్ని కళ్లకద్దుకుని గాలిలో తేలుతూ బయటికి పరుగెత్తాడు.

తిక్కనవైపు అందరూ నోళ్లు వెళ్లబెట్టి చూస్తున్నారు.

అప్పుడన్నాడాయన.

"హమ్మయ్య. ఇక దిగులు లేదు. త్వరలో తెలుగు భాషా సామ్రాజ్యం ఏర్పడబోతోంది. మనం చోళ



మత్తి భానుమూర్తి

నికో, పాండ్యునికో సామంతులుగా ఉండనక్కరలేదు. వాళ్లకు దోచిపెట్టిందీ వాళ్లు అధికారికంగా దోచుకున్నదీ చాలు. తెలుగు సామ్రాజ్యంలో భాగమౌదాం. తెలుగు సామ్రాజ్యాధినేతకు సామంతులుగా ఉందాం.”

‘అవతల చోళులా పాండ్యులా అనే తలలు బద్దలుకొట్టుకుంటుంటే మధ్యలో ఈ తెలుగు సామ్రాజ్యం ఏమిటి! కాకతీయ రాజ్యాన్ని దేవగిరి జైత్రపాలుడు జయించాడని.. యువరాజు గణపతి దేవుని బంధించి పట్టుకుపోయాడని వార్తలు విన్నాం కదా.. ఈయన గారు అనేదేవిటో అర్థంకావడం లేదు’ అని అందరూ గొణుక్కుంటున్నారు.

“ఆ.. సిద్ధీ! తప్పక తెలుగు సామ్రాజ్యం ఏర్పడబోతోంది. ఇప్పుడు నాకు నమ్మకం కుదిరింది. రాసి పెట్టుకోండి. మన తెలుగు సామ్రాజ్యాధినేత కాకతీయ గణపతిదేవుడు. తమిళుడో, కన్నడిగుడో, రాష్ట్రకూటుడో, మరాఠీయుడో కాదు. స్వచ్ఛమైన పదహారణాల తెలుగువాడు. సామ్రాజ్యాన్ని స్థాపించగల దమ్మున్న తెలుగువాడు.”

ఈసారి మనుమసిద్ధి కూడా నోరు తెరిచాడు.

“ఏం అర్థంకాలేదా! ఇప్పుడు చెప్పనా.. తర్వాత చెప్పనా??”

ఏమనాలో తెలియని అయోమయంలో విక్రమసింహపురి మంత్రాంగవేత్తలు ఉండిపోయారు. దాచుకోలేని ఉత్సాహంతో తన ఊహల్లోని భవిష్యత్ తెలుగు సామ్రాజ్యాన్ని అర్ధనిమీలిత నేత్రాలలో దర్శిస్తూ చెప్పసాగాడు తెలుగు సామ్రాజ్య ద్రష్ట తిక్కనామాత్యుడు.

ఆయన ఊహల్లోని సామ్రాజ్యస్రష్ట శ్రీశ్రీశ్రీ కాకతీయ గణపతిదేవ చక్రవర్తి!

మొట్టమొదటి తెలుగు సామ్రాజ్యాధినేత!!

* * *

దేవగిరి రాజ ప్రాసాదంలోని కారాగారం.

అనుమకొండలో, కాకతీయ స్కంధావారంలో జరుగుతున్న సంఘటనలు గణపతికేమీ తెలియదు. కాని ఇక్కడ తనను సాధారణ చెరసాల నుండి ఈ రాజప్రాసాద చెరసాలకు మార్చడం వంటి పరిణామాలపై వాటి ప్రభావం ఉన్నదని భావిస్తున్న గణపతి మౌనంగా కారాగారవాసం అనుభవిస్తున్నాడు. అతనికి కనిపించేది చెరసాల ముందుగా అటూ ఇటూ తిరుగాడే కాపలా భటులు, ఊడ్చి కడిగి శుభ్రం చేసే పనివారు, రాత్రివేళ దీపాలకు నూనె పోస్తూ తెల్లవార్లూ అటూ ఇటూ తిరుగాడే దీప రక్షకులు. అందరిని చూసి చూసి అందులో ఒకరిద్దరిని గణపతి గుర్తుపడతాడు కూడా. అందులో ఒకడు అప్పుడప్పుడు గణపతిని చూస్తూ కాస్త నవ్వు ముఖం పెడతాడని గణపతి ఓ వారం తరువాత గుర్తించాడు.

దినమూ కాలకృత్యాలు తీర్చుకుని లోపలికి వచ్చే వేళ అతడు దీపాలు ఆర్పేసి వెళుతుంటాడు. అప్పుడు లిప్త కాలంలో వినయంగా వంగి నమస్కరించి వడివడిగా వెళతాడు. అతడు చూపిస్తున్న వినయం గణపతిలో సందేహాలను రేపింది. వీడు గూఢచారి కాదు కదా, అనుకున్నాడు.

ఓరోజు అదే అడిగాడు.“ నువ్వు మరీ నా దృష్టిలో పడటానికి యత్నిస్తున్నావ్. కొంపదీసి గూఢచారివి కాదు కదా?” అన్నాడు గుసగుసగా.

వాడు అంతే వినయంగా, “అవును యువరాజా.. నేను గూఢచారినే. నాగతిస్య నా పేరు..” అంటూ వెళ్ళిపోయాడు. నోరు తెరిచాడు గణపతి.

ఆ రోజు..

ఉదయం లేచేటప్పటికి పొద్దెక్కింది. ఎప్పటిలా ప్రక్కకు ఒత్తిగిల్లి గుమ్మం వైపు చూశాడు. చిత్రంగా చెరసాల గది తలుపులు పూర్తిగా తీసి ఉన్నాయి. అక్కడ కాపలా భటులు ఎవ్వరూ కనిపించలేదు.

బయటకు వచ్చాడు గణపతి.

అడ్డుకున్న వాళ్లెవ్వరూ లేరు. బహిర్భూమికి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకుని మళ్లీ తన గదికి తిరిగి వచ్చాడు. అప్పుడొచ్చాడో భటుడు. ఆకుల దొన్నె కాకుండా వెండి పళ్లెరంలో తినుబండారాలు తెచ్చాడు.

“నేను బందీని కదా! మీ రాజ్యంలో బందీలకు ఇంత గౌరవమర్యాదలా.. ఏమిటీ వింత?” అన్నాడు గణపతి.

భటుడు సమాధానం చెప్పకుండా ముసిముసిగా నవ్వాడు.

“జుట్టు చూడు! పిట్టలు గూడు కట్టుకుంటాయి. అంతలా పెరిగింది. ఈ గడ్డం చూడు.. పిచ్చుక గూడు లాగే ఉంది. కాస్త క్షురకుడిని ఏర్పాటు చేసిపెట్టు మిత్రమా పుణ్యం ఉంటుంది.” అన్నాడు.

వాడు వేగంగా వెళ్లి క్షురకుడితో వచ్చాడు. అతను క్షురకర్మ నిర్వహించి శిరోభారం తగ్గించిపోయాడు.

బయట ఉన్న బావి వద్ద స్నానించాక గణపతి ప్రశాంత శరీరుడయ్యాడు.

మరి కొంతసేపటికి మరొక భటుడు వచ్చాడు. కొత్త వస్త్రాల దొంతర.. చేతిలో.

గణపతిదేవునికి అర్థమయ్యింది. అయినా అడిగాడు కొంటెగా, “ఎవరికీ అలంకరణ మహాభటా?”

వాడు సిగ్గుపడి, “తమరికే..” అన్నాడు.

అందుకుంటూ “ధరించమంటావా..” అన్నాడు. అప్పటికి వాడు కొంచం తెప్పరిల్లాడు.

“ధరించి తమరు వ్యాహ్యాళికో వ్యాయామానికో.. ఇష్టపడితే.. తీసుకువెళ్లమని మహాసేనానుల ఆజ్ఞ.”

నిజంగానే ఆశ్చర్యపోయాడు. అంతలోనే నవ్వుకున్నాడు. ‘ఇక్కడంతా ఆశ్చర్యమే కదా..’ అనుకుంటూ క్రొత్త పంచె, అంగీ మార్చుకుని, ఉష్ణీషం (తలపాగ గుడ్డ) చుట్టుకోకుండా పైన వల్లెవాటుగా వేసుకుని, “సేనానుల ఆజ్ఞను శిరసావహిద్దాం..” అంటూ ఆ భటుడికి గౌరవసూచికంగా వంగి చేయి చూపుతూ దారి చూపాడు. వాడు సిగ్గుతో అటూ ఇటూ చూసి ఆనందంగా ముందుకు సాగాడు. వెనక గణపతి.

భటునిలోని ఉత్సాహం వెనుకనున్న గణపతికి తెలుస్తోంది.

“అవునూ భటదేవా.. మనం ఈ మార్గం ఎక్కడికి పోతుంది?”

భటుడు వెనుదిరిగి మరింత స్నేహ ప్రకటనతో, “వ్యాయామ స్థలికి యువరాజా! కేవలం మా యువ రాకుమారుల కోసమే నిర్మించిన వ్యాయామశాల..” అన్నాడు.

గతం కంటే వినయం తగ్గి స్నేహభావన పెరిగింది.

“మీరు నాబోటి బందీలనూ యువరాజా అని సంబోధించడం.. మాకెక్కువ మక్కువ పెంచుతున్నది..”

“సంతోషం యువరాజా! మా మహానాయకులు తమ సంభాషణల్లో మిమ్ములను యువరాజులుగారు అనే సంబోధించుచున్నారు.” అన్నాడు మరింత చనువుగా.

“అటులనా.. ప్చ్..ఏవిటో మీరు మీ మర్యాదలు.. అయినా మరొక్క సందేహం.. క్రొత్త వస్త్రములు తొడిగించి మీరు వ్యాయామానికి తీసుకువెళ్లడం మీ రాచ మర్యాదయా?”

భటుడు నాలిక కరచుకున్నాడు. “క్షమించండి యువరాజా. అలా అయితే వ్యాహ్యాళికి వెళదామా?!”

“అబ్బెబ్బే.. ఏదో అనాలని అన్నాను. మాకు వ్యాహ్యాళి అయినా వ్యాయామమయినా ఒక్కటే.”

ఈసారి భటుడు తెల్లముఖం వేశాడు. రెండూ ఒక్కటే ఎలా అవుతుందో అర్థం కాలేదు.

అప్పటికే ఇద్దరూ రాచనగరులోని వ్యాయామశాలకు చేరుకున్నారు.

విశాలమయిన వ్యాయామశాల ప్రాంగణం. కొందరు వ్యాయామం.. కొందరు గుర్రపు స్వారీ.. కొందరు గజ యుద్ధ రీతుల అధ్యయనం చేస్తున్నారు. గణపతిదేవునిలో కూడా వ్యాయామ ఉత్సాహం పెచ్చరిల్లింది. ఒళ్లు విరుచుకున్నాడు. భటుడు కాస్త ఆవలకు వెళ్లాడు.

వ్యాయామం చేస్తున్నట్టే ఉన్నా, వారంతా గణపతిని చూస్తున్నారు.

అంతా యువకులే. భటుని మాట గుర్తొచ్చింది. అంతా రాచనగరు రాజకుటుంబాల యువకులే వ్యాయామం, యుద్ధవిద్యలు నేరుస్తున్నారు. దూరంగా చూశాడు గణపతి. అక్కడ కొందరు యువతులు కూడా ఉండటం అతని చూపును దాటిపోలేదు.

దాదాపు ఆరు మాసాలుగా చెరసాలలో ఉండటం వల్ల వ్యాయామమూ లేదు. యుద్ధ శిక్షణ లేదు. మళ్లీ ఇక్కడ ఇప్పుడు ఆ వాతావరణంలో కాస్త సేద దీరుతున్నాయి మనసు శరీరమూ. దగ్గరగా ఉన్న మందిర కుడ్యానికి జారగిలబడ్డాడు. ఒకరిద్దరు

యాదవ యువవీరులు దగ్గరగా వచ్చారు. వారి చూపుల్లో, కదలికల్లో గణపతి పట్ల చిన్న చూపు.. హేళనతో కూడిన చిరునవ్వు. సింహాన్ని బంధించి తెచ్చిన వేటగాడి కొడుకుల్లా..

కదిలి వ్యాయామం చేస్తూ మల్లయుద్ధ పట్లు పడుతున్న ఇద్దరు యువకుల వద్దకు వేగంగా వెళ్లాడు గణపతి.

ఒకడి మొలకున్న అంగవస్త్రం కాస్త స్థానభ్రంశం చెందుతున్నట్లు కనిపిస్తోంది. చటుక్కున వంగి ఆ అంగవస్త్రం సరిచేశాడు. వాడు సిగ్గుతో ముడుచుకుపోయాడు.

"క్షమించండి యువరాజా! అవతల యువతులు ఉన్నారని కాస్త చనువు తీసుకున్నాను.." అన్నాడు గణపతి.

అప్పటికే గణపతి వైపుగా యువకులంతా దూసుకు వచ్చారు. కాని జరిగింది చూసి ఆగిపోయారు. దాదాపు పాతిక అడుగుల దూరం నుండి అతని అంగవస్త్రాన్ని చూసిన గణపతి నిశిత దృష్టిని వాళ్లు గ్రహించారు. అప్పటికే దగ్గరగా వచ్చిన అశ్వికులను చూశాడు. ఓ యువరాజు స్వారీచేస్తున్న అశ్వాన్ని చూస్తూ "ఆగు ఆగు! యువరాజా. ఇది.. ఈ అశ్వం.." అన్నాడు గణపతి. ఆ యువరాజు కోర మీసం తిప్పాడు.

"మాదే. మేము రోజూ అశ్వయుద్ధాన్ని అభ్యాసం చేసేది దీని పైననే." అన్నాడు. మళ్లీ కోరమీసం తిప్పాడు.

"దిగండి! దీని స్థానం యుద్ధభూమి కాదు.."

"మరి..?"

"దగ్గరలో ఏదైనా దిగుడు బావి ఉంటే అక్కడకు పంపండి."

"ఎందుకు?"

"ఈ గుర్రం బావిలో నీళ్లు తోడటానికి బాగా ఉపయోగపడుతుంది. దీనిని అధిరోహించి యుద్ధభూమికి వెళ్లిన వాడిని శత్రువు ముందు పడేసి పోతుంది."

ఆ యువరాజు మ్రాన్పడిపోయాడు. ఈ సంభాషణ వింటున్న యువ కుమారులంతా తమ తమ అశ్వాలతో అక్కడకు వచ్చారు. దగ్గరకొచ్చిన ఒక్కొక్క గుర్రాన్ని వివరంగా చూస్తున్నాడు గణపతి. చూస్తున్న కొద్దీ అతని ముఖం రంగులు మారుతోంది.

"చ ఛ.. అబ్బెబ్బే.. ఇదేమి గుర్రం.. ఇది కూడా నాసిరకపు గుర్రమే. ఇది జబ్బుతో బాధపడుతోంది. దాని ముఖం చూశారా.. దీని సుడి చండాలం. దాని నడక అసహ్యంగా ఉంది. అది కూడా అధమ జాతి గుర్రం. ఇవన్నీ యుద్ధాశ్వాలు కాదు. పెంటలు ఎత్తే బళ్లను లాగడానికి సరిపోతాయి.."

ముఖం అత్యంత రోతగా పెట్టుకుని ఒక్కొక్క గుర్రాన్ని పరిశీలిస్తూ గణపతి చెబుతుంటే ఆ యువ యోధులంతా మాటలు రాక రెప్పవేయకుండా దిగ్భ్రమతో చూస్తున్నారు.

తమ గుర్రాలు గొప్పవేనని గణపతికి చెప్పాలని అనుకున్నా, వాళ్లకు గుర్రాల లక్షణాలు, సంబంధిత అంశాలు అస్సలు తెలియవు. ఉన్న గుర్రాలపైకెక్కి స్వారీ చేస్తూ అభ్యాసం చేయడం తప్ప అసలు గుర్రాల గురించిన సమాచారం వారి వద్ద లేదు. ఇప్పుడు గణపతిదేవుడి మాటలు విన్న తర్వాత గణపతినే కాదు తమ తమ గుర్రాల వైపు కూడా కాస్త పరిశీలనగా చూస్తున్నారు. ఇవన్నీ తెలియాలి అనే జ్ఞానం కూడా వారికి లేదు. ఎవ్వరూ చెప్పగా వినలేదు. రకరకాల ముఖ కవళికలతో గణపతిదేవుడు ఒక్కొక్క గుర్రాన్ని పైనా క్రిందా, ముఖం, కాలిగిట్టలు, శరీరపు రంగు, దాని పైనున్న వెంట్రుకల మృదుత్వం.. ఇలా అశ్వశాస్త్రం తెలిసినవాడిలా పరీక్షిస్తున్నాడు. ప్రతి గుర్రపు జాతి, రంగు, సుడులు, నడక చూస్తూ.. వీపుపై చరుస్తూ పరిశీలించడం వారినందరినీ సంభ్రమంలో ముంచేసింది.

"అసలు మీరు సేవణ రాజ్యపు యువయోధులేనా.. రేపు దేవగిరి తరపున యుద్ధం చేయవలసినవారేనా.. అలాంటి మీరు అధిరోహించేది ఇలాంటి గుర్రాలనా?! ఎవరు.. ఎక్కడ.. మీ అశ్వశిక్షకుడు.. పిలిపించండి.."

(సశేషం)

చర్చ

విస్తరించకూడని వివాదం

రాష్ట్ర శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లుల మీద గవర్నర్లు తప్పనిసరిగా మూడు నెలల్లోగా సంతకాలు పెట్టాలంటూ సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు ఈ సమస్యకు శాశ్వతంగా తెర దించకపోగా మరో వివాదానికి తెరతీసింది. తమిళనాడు గవర్నర్ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తమిళనాడుతో సహా పశ్చిమ బెంగాల్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, కేరళ రాష్ట్రాలు మరోసారి సవాలు చేశాయి. సంతకాలు పెట్టడానికి గవర్నర్లకు మూడు నెలల కాల పరిమితిని ఇవ్వడాన్ని ఇవి గట్టిగా వ్యతిరేకించాయి. రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లుల మీద సంతకాలు చేయడానికి గవర్నర్లకు మూడు నెలల సమయం ఇవ్వడం చాలా ఎక్కువని, నిజానికి వారు తక్షణం బిల్లులను ఆమోదించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాలు వాదించాయి. గవర్నర్లకు మూడు నెలల సమయం ఇవ్వడం వల్ల రాజ్యాంగపరమైన సమస్యలు తలెత్తుతాయని కూడా రాష్ట్ర ప్రభుత్వాలు గత సెప్టెంబర్ 3వ తేదీన సుప్రీంకోర్టులో వాదించాయి.

గవర్నర్ల ఇష్టానిష్టాల మీద ప్రజాభిప్రాయం, ప్రజల ఆకాంక్షలు ఆధారపడి ఉండకూడదని పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు వాదించాయి. శాసనసభలు ఆమోదించిన బిల్లులు ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలిస్తాయని అవి పేర్కొన్నాయి. బిల్లుల మీద సంతకాలు చేయకుండా కాలయాపన చేయడమంటే బిల్లులపై సంతకాలు చేసే ఉద్దేశం గవర్నర్లకు లేదనే అర్థమని అవి తెలిపాయి. బిల్లుల మీద అభ్యంతరాలు ఉన్నప్పుడు వాటిని పునఃపరిశీలనకు ప్రభుత్వాలకు తిప్పి పంపాల్సి ఉంటుందని, గవర్నర్లు ఆ పని కూడా చేయకపోవడం రాజ్యాంగ విలువలకు, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించడమే అవుతుందని అవి వాదించాయి. గవర్నర్ల అధికారాలను, హోదాను, హుందాతనాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు గౌరవించాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాలను, అభిప్రాయాలను గౌరవించాలని గవర్నర్లు కూడా భావించాలని అవి తెలిపాయి.

రాజ్యాంగం ఏమంటోంది?

రాజ్యాంగంలో గవర్నర్ల అధికారాలకు సంబంధించిన సెక్షన్ 200లో గవర్నర్లకు కాల పరిమితి విధించే నిబంధనేమీ లేదు. అవసరమైనప్పుడు గవర్నర్ ప్రభుత్వాలు ఆమోదించే బిల్లులను రాష్ట్రపతికి పంపించే అధికారాన్ని రాజ్యాంగం స్పష్టంగా పేర్కొంది. ఈ అధికారాన్ని అడ్డం పెట్టుకుని గవర్నర్లు దాదాపు ప్రతి

బిల్లునూ తొక్కిపెడుతున్నారని, దీనివల్ల ప్రభుత్వం ప్రజలకు సంబంధించిన పథకాలు, కార్యక్రమాల విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోతోందని తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు మొదటి నుంచి ఫిర్యాదులు చేస్తున్నాయి. సుప్రీంకోర్టు కూడా కొద్ది కాలం క్రితం తన తీర్పులో గవర్నర్లకు, చివరికి రాష్ట్రపతికి కూడా ఈ విషయంలో కాల పరిమితి విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే, రాజ్యాంగాన్ని సవరిస్తే తప్ప సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసే అవకాశం లేదు. పైగా, రాష్ట్రపతికి కాలపరిమితి విధించడం అన్నది సుప్రీంకోర్టు పరిధిలో లేని అంశం. ఫలితంగా ఈ తీర్పు అమలులో ప్రతిష్ఠంభన ఏర్పడింది. అయితే, ప్రభుత్వాలు మళ్లీ సవాలు చేయడంతో సుప్రీంకోర్టు దీనిపై మళ్లీ స్పందిస్తూ, గవర్నర్లకు మూడు నెలల కాల పరిమితి విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ సారథ్యంలోని అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పు చెప్పింది.

తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో 68 బిల్లుల వరకూ గవర్నర్ల సంతకాల కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ రాష్ట్రాలకు చెందిన గవర్నర్లంతా రాజ్యాంగ నిపుణులని, వారికి రాజ్యాంగ విలువలు గానీ, రాజ్యాంగ స్ఫూర్తి గానీ తెలియకపోలేదని రాజ్యాంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. పథకాలు, కార్యక్రమాలు, నియామకాలు, చట్టాల విషయంలో ఈ ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు రాజ్యాంగ నిబంధనలు పాటించకపోగా, సొంత అజెండాలను ముందుకు తీసుకు వెడుతున్నాయని గవర్నర్ల కార్యాలయాలు తరచూ విమర్శలు సాగించడం జరుగుతోంది. నియామకాల్లోనూ, కార్యక్రమాల్లోనూ, చట్టాలు రూపొందించడంలోనూ వివక్షను ప్రదర్శించడం, సర్వసమానత్వానికి తిలోదకాలు ఇవ్వడం, ఉద్దేశపూర్వకంగా ఒక వర్గాన్ని నిర్లక్ష్యం చేయడం జరుగుతోందని తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి సన్నిహితులు బహిరంగంగానే వ్యాఖ్యానించడం కూడా జరిగింది. గవర్నర్లు ఈ కారణంగానే బిల్లులను ఆపివేయడం, పునఃపరిశీలనకు తిప్పి పంపినా రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని యథాతథంగా గవర్నర్లకు తిరిగి పంపడం జరుగుతోందని తెలిసింది.

వివక్షలు అధికం?

తమిళనాడు గవర్నర్ ఆ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన పది బిల్లులను తొక్కి పెట్టి ఉంచారు. కొన్నేళ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రెండవ పర్యాయం ఈ బిల్లులను ఆమోదించాల్సి వచ్చింది. దీనికి సంబంధించి తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసి, గవర్నర్ తీరుతెన్నులపై ఫిర్యాదు చేసింది. రాష్ట్ర శాసనసభలు బిల్లులను ఆమోదించిన తర్వాత వాటిని గవర్నర్ అనుమతికి పంపించాలని సూచించే రాజ్యాంగం 200వ సెక్షన్ పై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సెక్షన్‌ను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని కూడా అది వ్యాఖ్యానించింది. న్యాయస్థానం ప్రధానంగా గవర్నర్లకు బిల్లులను ఆమోదించే విషయంలో లేదా స్పందన తెలియజేసే విషయంలో కనీస కాలపరిమితి ఉండాలన్న అంశం పైనే దృష్టి కేంద్రీకరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు రెండవ పర్యాయం బిల్లులను గవర్నర్‌కు పంపించినప్పుడు వాటిని తిరస్కరించడానికి వీల్లేదని రాజ్యాంగం చెబుతోంది. సుప్రీం కోర్టు ఇదే విషయాన్ని పదే పదే చెబుతోంది. నిజానికి, బిల్లులపై సంతకాలు చేయడానికి గవర్నర్లు కాలయాపన చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వానికి సందేహం కలిగినప్పుడు రాజ్యాంగంలోని ఆర్టికల్ 167 ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి గవర్నర్‌ను స్వయంగా కలుసుకుని, చర్చించి ఆమోదం పొందడానికి అవకాశం ఉంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఆర్టికల్‌ను ఉపయోగించుకుంటున్న దాఖలాలు లేవు.

నిజానికి, ఈ సమస్య శాశ్వతంగా పరిష్కారం కావాలన్న పక్షంలో ఒక పకడ్బందీ అయిన చట్టం అవసరం. బిల్లుల ఆమోదానికి సంబంధించి గవర్నర్లు వ్యవహరించాల్సిన తీరును రాజ్యాంగం స్పష్టంగానే నిర్వచించింది. బిల్లులపై నిర్ణయం తీసుకునే అధికారం మంత్రిమండలికి ఉంటుంది. ఒకసారి ఆ బిల్లులను రాష్ట్ర శాసనసభ ఆమోదించిన తర్వాత, వాటిపై శాసనసభకు కూడా అధికారం ఉంటుంది. బిల్లులపై ఆమోద ముద్ర వేయడం అన్నది చాలావరకు లాంఛనం మాత్రమే. అయితే, ఇది తప్పనిసరి లాంఛనం. బిల్లును అవసరమైతే ఒకసారి రాష్ట్ర ప్రభుత్వానికి తిప్పి పంపడానికి గవర్నర్‌కు అధికారం ఉంది. రెండవ సారి తప్పనిసరిగా ఆమోదంతెలియజేయాల్సి ఉంటుంది. తప్పనిసరి అనుకున్నప్పుడు గవర్నర్లు ఈ బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపించవచ్చు. అయితే, బిల్లులను ఆమోదించే విషయంలో రాజ్యాంగం ఎటువంటి కాలపరిమితినీ విధించలేదు. దీనిని అవకాశంగా తీసుకుని గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాలను ఇరకాటంలో పెడుతున్నారన్న అభిప్రాయం ఉంది. సుప్రీం కోర్టు ప్రధానంగా ఈ లొసుగులపైనే దృష్టి సారిస్తోంది.

గవర్నర్లు ఈ అవకాశాన్ని ఈ విధంగా దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు సుప్రీం కోర్టు ఒక చట్టాన్ని తీసుకు రావాల్సిన అవసరం ఉంది. బిల్లును తొక్కిపెట్టి ఉంచడమనేది బిల్లు తిరస్కరణకు సంకేతమా, బిల్లును పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని లేదా శాసనసభ ఈ బిల్లును మార్చాల్సి ఉంటుందని చెప్పడం దీని ఉద్దేశమా అన్నది తేలాల్సి ఉంది. దీనిపై సుప్రీంకోర్టు నిర్దిష్టమైన రూలింగ్ ఇవ్వడంతో పాటు ఒక స్పష్టమైన చట్టాన్ని రూపొందించాల్సి ఉంటుంది. ఆర్టికల్ 200 ప్రకారం ఒకసారి బిల్లును పునఃపరిశీలన చేసిన తర్వాత గవర్నర్ ఎటువంటి పరిస్థితుల్లోనూ ఎక్కువ కాలం అతని దగ్గర ఉంచుకోవడానికి అవకాశం లేదు. నిజానికి, రాజ్యాంగం ఈ విషయంలో స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో 'సలహాలు, సహాయాలు' అన్న మాటలకు అత్యంత ప్రాముఖ్యం ఉంటుంది. అయితే, గవర్నర్లు ఈ రెండు మాటలను పెద్దగా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. రాష్ట్ర ప్రభుత్వాలు గవర్నర్లు తమకు లేని విచక్షణాధికారాలను ఇష్టారాజ్యంగా ఉపయోగించుకుంటున్నారన్న అభిప్రాయాన్ని వ్యాపింపజేస్తున్నాయి. గవర్నర్ల వ్యవస్థకు సంబంధించిన అంశాలన్నిటినీ సుప్రీం కోర్టు పునస్సమీక్షించి, ఇకనైనా సరైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.



జి.రాజశుక
సీనియర్ జర్నలిస్ట్

అనన్య శిల్పి విశ్వకర్మ

విశ్వకార్మికతకు మూలపురుషుడు విశ్వకర్మ. సర్వవృత్తులకు నాందీ ప్రస్తావన పలికిన ఆయనను రుగ్వేద, కృష్ణయజుర్వేదాలు సృష్టికర్తగా పరిగణిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ప్రతి సంవత్సరం సూర్యభగవానుడు సింహరాశి నుంచి కన్యారాశిలోకి ప్రవేశించే సమయంలో విశ్వకర్మ జయంతిని జరుపుకొంటారు. ఆంగ్లమాసం ప్రకారం, సెప్టెంబరు 17న విశ్వకర్మజయంతిని పాటిస్తున్నారు.

త్రిమూర్తులలో ఒకరైన బ్రహ్మదేవుని కుమారుడు విశ్వకర్మ. స్వయం భూమన్వం తరంలో దేవతా శిల్పిగా చెప్పే ఆయన సమస్త కళలకు, వస్తువులకు మూల పురుషుడు. వాస్తు (నిర్మాణ) శాస్త్ర స్థాపకుడు. తన హస్త నైపుణ్యం, బుద్ధి కుశలతతో వివిధ రకాల వస్తువులు తయారుచేశాడు.. సామాజిక జీవన సిద్ధాంత దృష్ట్యా ఆయన ఆదర్శ పురుషుడు. ముల్లోకాలను గడగడలాడించిన వృత్రాసురుడిని (విశ్వకర్మ కుమారుడు) సంహరించేందుకు ఆయుధం కరవై, దేవగణం ఎటూ పాలుపోని స్థితిలో ఉండగా, నూతన ఆయుధాన్ని సృజించిన మహనీయుడు విశ్వకర్మ. లోకకల్యాణానికి కుమారుడి వధ కోసం ఆయుధం (వజ్రాయుధం) నిర్మించిన మహత్తర త్యాగశీలి. లోక శ్రేయస్సు కోసం దధీచి మహాముని ప్రాణత్యాగం చేయగా, ఆయన వెన్నెముకతో విశ్వకర్మ ఈ ఆయుధాన్ని రూపొందించాడు. అపూర్వ శిల్పి, సత్యయుగంలో దేవతల నివాసం కోసం స్వర్గలోకం, త్రేతాయుగంలో సువర్ణ లంకను, ద్వాపరయుగంలో ద్వారకానగరాన్ని, హస్తినాపురం, ఇంద్రప్రస్థం నిర్మించాడు. నాటి సమాజంలో కులవృత్తులన్నీ సమానమేనని చాటి చెప్పాడు.

దేశంలో సంపద పెరగాలంటే వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ఉత్పత్తి పెరగాలి. అది కార్మికుల చేతుల్లో ఉంది. విశ్వకర్మ స్ఫూర్తితో కృషి చేయాలి. కార్మికులు కేవలం జీతభత్యాల కోసమే పనిచేస్తున్నామనే భావన సరైనది కాదు. తన శ్రమ ద్వారా ఉత్పత్తిని పెంచుతూ సమాజంలోని అన్ని వర్గాలకు అవసరమైన అన్ని వస్తువులు అందిస్తున్నామనే భావన అలవరచుకోవాలి. శక్తివంచనలేకుండా పాటుపడుతూ కుటుంబపోషణకుతగిన ప్రతిఫలం కోరుకోవాలి. అవసరమైతే ఉద్యమించాలి తప్ప తనసమయాన్ని, కష్టాన్ని కేవలం డబ్బుకు అమ్ముకొనే స్థితికి చేరకూడదు.

విశ్వకర్మను ఆరాధించే హస్తకళాకారులు ఆయన జయంతి రోజున తమ పని ముట్లను పూజిస్తారు. ఈ పవిత్రమైన రోజున వాటిని ఏ పనికి ఉపయోగించరు. తాము క్షేమంగా ఉండాలని తమకు నిత్యం జీవనోపాధిని కల్పించి సురక్షితంగా ఉంచాలని తాము చేపట్టిన ప్రతి ప్రయత్నంలో విజయం సాధించాలని విశ్వకర్మను ప్రార్థిస్తారు.

దేశం ఆనాడు ప్రథమ నాగరికత దేశంగా కీర్తిని పొందడానికి విశ్వకర్మ కర్మీయుల పరంపరే కారణమని విజ్ఞులు చెబుతారు.కార్మికశక్తికి ప్రతీకకంగా నిలిచిన విశ్వకర్మ జయంతిని జాతీయ పర్వదినంగా గుర్తించాలని బీఎంఎస్ సహా అనేక సంస్థల నుంచి ప్రభుత్వాలకు దశాబ్దాలుగా వినతులు అందుతూనే ఉన్నాయి.

ఎ. చెన్నకేశవరావు
బీఎంఎస్ కేంద్ర కార్యవర్గ సభ్యులు

జాగృతి యాప్ వినియోగంపై విన్నపం

జాగృతి

ఏడున్నర దశాబ్దాలకు పైబడిన సుదీర్ఘ ప్రస్థానంలో సాంస్కృతిక ఔన్నత్యం, రాజకీయాలు, సామాజిక అంశాలు, వర్తమాన సమస్యలు, కళలు, సాహిత్యం, విజ్ఞానశాస్త్రం, పర్యావరణం వంటి పలు అంశాలను చర్చించే విలువైన ఎన్నో వ్యాసాలను జాగృతి అందిస్తూ వస్తోంది. ఈ సంవత్సరం సంఘ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నాము.

ఈ సందర్భంగా పాఠకులకు మరింత చేరువయ్యేందుకు జాగృతి యాప్‌ని సిద్ధం చేశాం.

యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవడానికి పక్కనున్న QR Code స్కాన్ చేయగలరు.

APP Login -ఎడమవైపు Menu మీద క్లిక్ చేసి, Login ఎంపికపై క్లిక్‌చేస్తే Login Screen కనిపిస్తుంది.

1. తెరపై కనిపించే యూజర్ నేమ్, పాస్ వర్డ్‌తో లాగిన్ కావచ్చు.
2. Login Screen కింద **Click here to** login with Phone Number పైన క్లిక్ చేసి ఫోన్ నెం. నమోదు చేస్తే, మీ మొబైల్‌కి OTP వస్తుంది. OTPతో లాగిన్ అవ్వండి.
3. మొదటిసారి Login కాగానే, Password మార్పు చేసుకోమని సందేశంతో Screen వస్తుంది. మార్చుకొని, మరలా Login అవ్వాలి.
4. Dashboard: Profile information – User Id, Name, Profile status, Start, End Date, and Receipt Amount వివరాలు కనిపిస్తాయి.
5. Profile Management : View Profile–మీ వ్యక్తిగత చిరునామా, అమౌంట్ వివరాలు చెక్ చేసుకోండి. చిరునామా మార్పు కోసం పైన ఉన్న **JAGRITI** లోగోకి పక్కనే ఉన్న Edit Profileని క్లిక్ చేయండి. పోస్టల్ అడ్రసు ఇచ్చి, పిన్‌కోడ్ టైప్ చేస్తే రాష్ట్రం, జిల్లా వివరాలు వాటంతట అవే వస్తాయి. మండలం, సబ్ పోస్ట్ ఆఫీసు, సంఘ విభాగ్, జిల్లా, ఖండ/నగరాలను మీరు ఎంపిక చేస్తే సరిపోతుంది.
6. Support ticket: మీకు ఏదైనా సమస్య ఉంటే ఇందులో నమోదు చేయండి. 24 గంటలో మీకు కాల్ చేస్తాము.
7. మిగితా వివరాలు Subscriber Login Videoలో చూడండి.

– మేనేజర్

బతుకమ్మ బతుకమ్మ

పూలతో దేవతలను అర్చించడం సహజం. కానీ పూవులనే దేవతగా సంభావించడం బతుకమ్మ పండుగలోని ప్రత్యేకత. ప్రకృతిని ఆరాధించే అతి పెద్ద పండుగ. బతుకమ్మగా, బతుకునిచ్చే అమ్మగా, ఇంటింటి ఆడబిడ్డగా నవరాత్రులు వేళ నడచి వస్తుంది. తమ బతుకులు చల్లగా ఉండాలని కోరుకుంటూ ఏరేరి తెచ్చిన పూలతో అలకరించి జరుపుకొనే సంబరం. బతుకమ్మ సంతానాన్ని, బతుకును ఇచ్చే దేవత అని జానపదుల/పల్లెప్రజల భావన.తమ పిల్లలు సుఖసంతోషంగా ఉండాలని కాంక్షిస్తూ ఈ పండుగ సందర్భంగా వారికి దుస్తులు, గాజులు, నగలు కానుకలుగా ఇస్తారు. వీటన్నిటికి అవసరమైన ధనాన్ని ఇచ్చేది శ్రీలక్ష్మీదేవి కనుక, బతుకమ్మ శ్రీలక్ష్మి అవతారమని నమ్మకం.హైటెక్/ఆధునిక యుగంలోనూ అత్యంత ఆదరణ పొందుతున్న పండుగ అనడంలో అతిశయోక్తిలేదు. రాష్ట్రేతర, ప్రవాసాంధ్రులు ఈ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు.

ప్రకృతి అందాలను చాటి చెప్పే పండుగ ఇది. భాద్రపద అమావాస్య నుంచి ఆశ్వీయుజ శుద్ధ నవమి వరకు పండుగను ఎంతో సంబరంగా చేసుకుంటారు. ఈ పండుగ భాద్రపద అమావాస్య నాడు ఆరంభవుతుంది. దీనికి పెత్తరామాస, పెద్దల అమాస అని పేర్లు. చివరి రోజు పండుగను 'పెద్ద బతుకమ్మ' లేదా 'సద్దులు' అంటారు. ఆరవనాటి పండుగను 'అర్రెం' అంటారు. ఆరోజు బతుకమ్మలు పేర్చడం గానీ, ఆడడం గానీ ఉండదు.మొదటి రోజు మొగ్గలను సేకరించి పెదవులతో ఊది బతుకమ్మను పేరుస్తారు కనుక దీనిని 'ఎంగిలి పూలు' అంటారని జానపదులు భావిస్తారు కాని దీనిని 'తొలి'అనే అర్థంలో వాడతారు.

బతుకమ్మ పండగ వస్తూందంటే పల్లెల్లో నూతన ఉత్సాహం వెల్లి విరుస్తుంది. దానిని పెద్ద సంబురంగా భావించి, ఇళ్లను శుభ్రపరచి, చక్కగా అలంకరించు కుంటారు. అత్తింటి నుంచి ఆడపిల్లలను పుట్టింటికి తీసుకు వస్తారు. కొత్తగా పెళ్లయిన ఆడపిల్లలకు అత్తింటి వారు కృత్రిమ (కాగితపు)పూలతో చేసిన బతకమ్మను వాయనంగా పంపుతారు.

బతుకమ్మను బతుకునిచ్చే అమ్మగా,'త్రిమాత'ల స్వరూపంగా పూజిస్తారు. ప్రకృతిని ఆధారం చేసుకుని భక్తి పారవశ్యంతో బతుకమ్మ తల్లిని కొలుస్తారు. ఈ పండుగ రోజులలో ప్రతి రోజు (ఆరవ రోజు మినహా) వెదురు లేదా దుసేరు తీగలతో అల్లిన సిబ్బిలో గుమ్మడి పూవులు పరచి దానిపై తంగెడు, పైడి తంగేడు, గునుగు, నువ్వు, రుద్రాక్ష, కట్ల, గట్టి గొరిమిడి, కాకర,సొర,బీర, గన్నేరు, పొట్ల, కట్టాయి తదితర పువ్వులతో బతుకమ్మను పేర్చి దానిపై గౌరమ్మ (పసుపు ముద్ద)ను నిలుపుతారు. పసుపు కుంకుమలతో అర్చించి దేవుడి గదిలో చెక్క పీటపై ఉంచుతారు. సాయంవేళ పెద్దలు, పిన్నలు ఆలయ ప్రాంగణంలోనో, ఊరి బయట చెరువు/కాలువ దగ్గరనో గుమిగూడి ఆడి పాడతారు. ఈ పాటలు మాత్రాఛందస్సులో సాగుతూ ద్విపద కవితకు దగ్గరగా ఉంటాయి. మామూలు పాటల్లా కాకుండా చిన్నచిన్న ఇతి వృత్తాలు, పౌరాణిక, చారిత్రక సంబంధిత పురాణగాథలతో, నీతిసూత్రాలతో సాగుతూ, ప్రతి పాదం చివరలో కోల్ ఉయ్యాలో, చందమామ, గౌరమ్మ మొదలైన పదాలు,పదబంధాల్లో ఏదో ఒకటి వస్తుంది. ఉదాహరణకు...

'శ్రీరాముని తల్లి ఉయ్యాలో...
శ్రీమతి కౌసల్య ఉయ్యాలో
ప్రేమతో శాంతను ఉయ్యాలో
పిలిచి దగ్గరకు ఉయ్యాలో...' అంటూ కౌసల్యను స్మరించుకొంటూ, ఆడపిల్లలు పెరిగి, అత్తింట్లో మెలగవలసిన తీరును వివరిస్తుంది.

'తంగేడు పూవుల్లా చందమామ
మల్లెసండొస్తవు చందమామ
గునుగేయ పూవుల్ల చందమామ
బత్కమ్మ పోతుంది చందమామ....' అంటూ... పుట్టింటి నుంచి అత్తింటికి వెళ్లే కూతురిని కానుకలతో పంపినట్లే, బతుకమ్మను దుర్గాష్టమి నాడు సాగనంపుతారు.

వాడుకలోని చిన్నచిన్న మాటలతో ఎంతో సారాన్ని ఇమిడ్చుకున్న సామెతలు కూడా ఈ పాటల్లో విరివిగా కనిపిస్తాయి. ప్రతీపాట ఒక కథ చెబుతున్న ట్లుంటుంది. జీవితంలో ఒడుదొడుకులను అధిగమించి, జీవితాన్ని చక్కదిద్దుకునే తీరును ఈ పాటలు వివరిస్తాయి.

తొలి రెండు రోజులు బొడ్డెమ్మగా, మూడోనాడు మహాలక్ష్మిగా, నాలుగవ రోజు గౌరమ్మగా, అయిదో రోజు అట్ల బతుకమ్మగా, ఆరో రోజు అలిగిన బతుకమ్మగా (అందుకే ఆ రోజు ఆడరు), ఏడవనాడస్తు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదో రోజు బతుకమ్మగా, తొమ్మిదో నాడు సుద్దుల బతుకమ్మగా కొలుస్తారు. నైవేద్యాల పరంగా చూస్తే...

తొలిరోజు (ఎంగిలి బతుకమ్మ)న నువ్వులు, నూకలు, బియ్యం పండితో నైవేద్యం సమర్పిస్తారు. రెండవ నాడు (సప్పిడి బతుకమ్మ)సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో; మూడవ నాడు (ముద్దపప్పు బతుకమ్మ) ముద్దపప్పు, పాలు,

ఉయ్యాలో...

బెల్లంతో; నాలుగవరోజు (నాను బియ్యం బతుకమ్మ) నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లంతో; ఐదవనాడు (అట్ల బతుకమ్మ) అట్టు/దోశలు; ఆరవనాడు (అలిగిన బతుకమ్మ) ఆదరు, నైవేద్యం పెట్టరు. ఏడవ రోజు (వేపకాయల బతుకమ్మ) బియ్యం పిండిని బాగా వేయించిన వేపకాయల ఆకారంలో నైవేద్యం తయారు; ఎనిమిదో నాడు (వెన్న ముద్దల బతుకమ్మ) వెన్న, నువ్వులు, బియ్యం మిశ్రమం; తొమ్మిదో రోజు (సద్దుల బతుకమ్మ) ఐదు రకాల పదార్థాలు.. పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మ అన్నం, కొబ్బరి అన్నం, నువ్వుల అన్నంతో పాటు వివిధ రకాల పిండి పదార్థాలు నైవేద్యంగా పెడతారు.

ఈ పండుగ పుట్టుకకు సంబంధించి ఎన్నో సామాజిక, చారిత్రిక గాథలు/కారణాలు ప్రచారంలో ఉన్నాయి. ఊరికోసమో, తన వారి కోసమో తమ జీవితాలను చెరువుల వద్ద తృణ ప్రాయంగా త్యాగం చేసిన వీర నారీమణుల ప్రతిరూపం బతుకమ్మ అని భావిస్తారు. ఒక కథనం ప్రకారం, చోళరాజ్యంలో ధర్మాంగద, సత్యవతి దంపతుల నూరుగురు పుత్రులు యుద్ధంలో మరణించగా, సత్యవతి కఠోర తపస్సు ఫలించి లక్ష్మీదేవి ఆమెకు కూతురుగా జన్మించి, ఎందరో బతుకులకు దారి చూపే దేవతగా 'బతుకమ్మ'గా ప్రాచుర్యంలోకి వస్తుందని ఆమె అవతరించడానికి మునుపే మునులు ఆశీర్వదించారట. ఆ స్ఫూర్తితోనే ప్రజాకవి కాళోజీ, *'గుమ్మడి పూలు పూయగా బ్రతుకు/తంగెడి పసిడి చిందగ బ్రతుకు/ గునుగు తురాయి కులకగ బ్రతుకు/కట్ల నీలిమలు చిమ్మగ బ్రతుకు/బ్రతుకమ్మా బ్రతుకు/అమ్మని మరువని సంతానము గని/బ్రతుకమ్మా బ్రతుకు..'* అని రాశారు. భూస్వాముల దాష్టీకాలను ప్రతిఘటించి బలైపోయిన ఒక గ్రామీణ మహిళ స్మృత్యర్థం ఈ పండుగను జరుపుకుంటున్నారని మరో కథనం. ఈ పండుగను కాకతీయరాణి రుద్రమదేవికి అన్వయించారు సాహితీవేత్తలు. ఆమె తమ దయాది, దేవగిరి (మహారాష్ట్ర) రాజుపై విజయం సాధించి ఓరుగల్లు చేరిన వెంటనే విజయ సూచికగా బతుకమ్మ సంబరాలను పెద్ద ఎత్తున నిర్వహించిందని ఆచార్య తిరుమల రామచంద్ర పేర్కొన్నారు.

తమ పిల్లలు సంతోషంగా ఉండాలని కాంక్షిస్తూ ఈ పండుగ సందర్భంగా వారికి దుస్తులు, గాజులు, నగలు కానుకలుగా ఇస్తారు. వీటన్నిటికి అవసరమైన ధనాన్ని ఇచ్చేది శ్రీలక్ష్మీదేవి కనుక, బతుకమ్మ శ్రీలక్ష్మి అవతారంగా పరిగణిస్తారు. ఈ పండుగ సామాజిక ఐక్యతను పెంపొందిస్తుంది. ఇతర రోజుల్లో నిత్య వ్యవహారాల్లో నిమగ్నమవుతూ, కలుసుకోలేని మహిళలు ఈ తొమ్మిది రోజులు కలసి ఆటపాటలతో ఆనందిస్తారు.

జానపదుల నమ్మకాలతో పురుడు పోసుకొని, 'పూల దేవత'గా పూజలందుకొంటున్న బతుకమ్మ పండుగ ఇక్ష్వాకులు,విష్ణుకుండినులు, చాళుక్యులు, కాకతీయులు కాలంలో పరిఢవిల్లి నేడు రాష్ట్ర పండుగగా అవతరించింది. బతుకమ్మ పూవనరులలోని ప్రధానమైన 'తంగేడు' రాష్ట్ర పుష్పంగా గుర్తింపు పొందింది. నల్లగొండ జిల్లా వాడపల్లిలో బతుకమ్మకు సంబంధించిన స్పష్టమైన శాసనాధారం లభించింది. కృష్ణా–మూసీ నదుల సంగమ ప్రదేశంలో సాధారణ శకం 1211 నాటికి 'బ్రతుకేశ్వర స్థానం' ఉండేదని ఆ శాసనం పేర్కొంటోంది. దీనిని బట్టి అక్కడ (కృష్ణానదిలో) బతుకమ్మ నిమజ్జనం చేసేవారని తెలుస్తోంది. మేలుగుంటు సోదరులు సుమారు అక్కడ బతుకమ్మ గుడిని నిర్మించారు.

బొడ్డెమ్మ

బతుకమ్మ పండుగకు పూర్వం తొమ్మిది రోజులు బొడ్డెమ్మ పండుగను జరుపుకుంటారు. ఇది మహాలయామావాస్యతో పూర్తి అవుతుంది. ఇది పిల్లల పండుగ. తెలంగాణ ప్రాంతంలో 'బొడ్డి' అంటే చిన్నపిల్ల అని అర్థం. మంచి భర్త లభించాలని కోరుతూ పెళ్లీడు పిల్లలు భాద్రపద బహుళ పంచమి లేదా దశమి నుంచి మహాలయ అమావాస్య వరకు 'బొడ్డెమ్మ' ఆడతారు (అధిక ఆశ్వయుజంలో నిజమాసం తిథుల ప్రకారం కార్యక్రమం ఆరంభ, ముగింపులు ఉంటాయి). బొడ్డెమ్మను పసుపుతో చేయడం ఒక పద్ధతికాగా, పుట్టమన్నుతోనూ చుట్టూ పందిరి వేస్తారు. దీనిని 'పందిరి బొడ్డెమ్మ' అంటారు. చిన్న గుంతతీసి,దాని చుట్టూ పుట్టమన్నుతో గోపురం ఆకారంలో నిర్మిస్తారు. లేదా...చెక్కపై పుట్ట మన్నుతో ఐదు లేదా ఏడు దొంతర్లుగా గోపురం ఆకారంలో తీర్చిదిద్ది, దానిపై తులసి మొక్కను అలంకరిస్తారు. చాలా గ్రామాలలో బొడ్రాయి వద్ద లేదా ఆలయాల వద్ద బొడ్డెమ్మను ఆడతారు. బతుకమ్మ పండుగలప్పుడు పాడే పాటలను ఈ బొడ్డెమ్మ పండుగలోనూ పాడతారు.

'బొడ్డెమ్మ బొడ్డెమ్మ వలలో/బిడ్డాలెందారే వలలో
బావిలో పడ్డవారికి వలలో/వారిద్దరమ్మా వలలో

....

నిద్రపో బొడ్డెమ్మ వలలో/నిద్రబోవమ్మా వలలో
నిద్రకు నూరేండ్లు వలలో/నీకు వెయ్యేండ్లు వలలో
నిను గన్న తల్లికి వలలో/నిండు నూరేళ్లు
వలలో...' అంటూ బొడ్డెమ్మను నీటిలో వదులుతారు.



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

సెప్టెంబర్ 17 మోదీ జన్మదినం

ఏడున్నర దశాబ్దాల భారత రాజకీయ చరిత్రలో మరెవరికీ దక్కనటువంటి అరుదైన, అసాధారణమైన ఘనత ఆయనది. నరేంద్ర దామోదర్ దాస్ మోదీ. ఆధునిక కాలపు భారతదేశ చరిత్రకు కేంద్ర బిందువు. సామాన్య కుటుంబంలో జన్మించి అంచె లంచెలుగా ఎదుగుతూ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్‌కు ప్రధానిగానే కాకుండా తనకంటూ ప్రత్యేక తను దక్కించుకున్నారు. సెప్టెంబర్ 17న 75వ జన్మదినం జరుపుకుంటున్న ప్రధాని నరేంద్ర మోదీ జీవితం భారతీయులకు, భారత ప్రజాస్వామ్యానికి కూడా ఒక కొండ గుర్తు.

దేశమే కుటుంబం.. ప్ర

పెహల్గావ్ ఉదంతం తరువాత ఆయన పాకిస్తాన్‌ను లొంగదీసిన వైనం చెప్పుకోదగినది. అమెరికా అధ్యక్షుడి ఫోన్ కాల్‌ను నాలుగుసార్లు పట్టించుకోక పోయినా, మోదీ తనకు మంచి మిత్రుడని ట్రంప్ చెప్పవలసి వచ్చింది. ఆయన రాజకీయ సంకల్పం, దేశం పట్ల నిబద్ధత ఇటీవలి అద్భుతాలు. ప్రధాని మోదీ ఇంతటి ప్రజాదరణ ఎలా పొందగలుగు తున్నారో అర్థం చేసుకోవాలంటే ఆయన జీవిత మూలాల్లోకి వెళ్లాలి. పేదరికంలో పుట్టి పెరగడమే తనకు మొదటి స్ఫూర్తి అని 'టైమ్' మ్యాగజైన్ ఇంటర్వ్యూలో అన్నారు మోదీ.

దేశానికి స్వాతంత్రం వచ్చిన మూడేళ్లకు సెప్టెంబర్ 17, 1950న నరేంద్ర దామోదర్‌దాస్ మోదీ జన్మించారు. మోదీ చిన్నతనంలో తిండి కోసం పడ్డ కష్టాలను ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. తన తల్లి ఇల్లు గడవడానికి నాలుగు ఇళ్లలో పని చేసేదని, తన తండ్రి స్థానికంగా ఉన్న స్టేషన్‌లో ఛాయ్ అమ్ముకుని జీవించేవారని, తండ్రికి సహాయంగా తానూ వెళ్లేవాడినని తరచూ చెప్తుంటారు.

నరేంద్రునికి చిన్నప్పుడే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో పరిచయమైంది. ప్రచారక్‌గా సామాజిక, సేవా కార్యక్రమాల ద్వారా క్షేత్రస్థాయిలో పట్టు సాధించి, దృఢమైన నేతగా ఎదిగారు. చిన్నప్పుడు సైన్యంలో చేరాలని జామ్‌నగర్ సైనిక్‌స్కూల్‌లో ప్రవేశానికి ప్రయత్నించారు కూడా. కానీ, ఆర్థిక సమస్యలతో ఆ కల.. కలగానే మిగిలిపోయింది. అయితే.. 1965 ఇండో-పాక్ వార్ సమయంలో స్టేషన్‌కు చేరుకునే భారత సైనికులకు టీ అందించడం ద్వారా తన అభిమానాన్ని చాటుకున్నట్లు చెప్పేవారు.

మోదీ తన 17వ ఏట తొలిసారి దేశ పర్యటనకు వెళ్లారు. కలకత్తాలోని రామకృష్ణ మఠంలో సన్యాసం తీసుకోవాలని ప్రయత్నించారు. అక్కడ నిబంధనలు అంగీకరించకపోవడంతో ఉత్తరప్రదేశ్‌లోని ఆల్మోరాకు వెళ్లి రామకృష్ణ మఠం ఆశ్రమంలో కొంతకాలం గడిపారు. అందుకే ఆయన రాజకీయ దృష్టిలో ఆధ్యాత్మిక దృక్పథం కూడా అంతర్లీనంగా ఉంటుంది. 20 ఏళ్లు వయసు నాటికి ఉత్తర భారతంలో ముఖ్యమైన ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను తెలుసుకున్నారు.

మోదీ తన పర్యటనను ముగించుకొని స్వగ్రామమైన వాద్ నగర్ కి చేరుకున్నారు. అనంతరం తల్లి హిరాబాయి దీవెనలు తీసుకొని అహ్మదాబాద్‌లో మేనమామ నడుపుతున్న ఆర్టీసీ క్యాంటిన్‌లో పని చేయడం ప్రారంభించారు. ఈ సమయంలో తన గురువు లక్ష్మణరావు ద్వారా తిరిగి ఆర్‌ఎస్‌ఎస్‌లోకి ప్రవేశించారు. సంఘ కార్యక్రమాల్లో చురుకగా పాల్గొంటూ 1975లో గుజరాత్‌లో విశ్వహిందూ పరిషత్ తలపెట్టిన సాధు పరిషత్ కార్యక్రమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంలో భాగస్వామి అయ్యారు. తర్వాత ఏబీవీపీ నాయకుడిగా బాధ్యతలు చేపట్టారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు 'గుజరాత్ లోక్ సంఘర్ష్ సమితి'కి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

ఒక మనిషి దేశభక్తి ప్రజాస్వామ్యంలోనే ఎక్కువ రాణింపునకు వచ్చే అవకాశం ఉందని రుజువు చేసిన వారు బీజేపీ ఇద్దరు ప్రధానులు. అటల్ బిహారీ వాజపేయి సాధారణ కుటుంబం నుంచే వచ్చారు. మోదీ కూడా అంతే. కానీ వీరి దేశభక్తి అత్యున్నత పీఠం వైపు నడిపించింది. 1986లో భారతీయ జనతా పార్టీలో చేరిన మోదీ సంస్థను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై దృష్టి పెట్టారు. దీనికి నాటి పార్టీ జాతీయ అధ్యక్షుడు లాల్ కృష్ణ అద్వానీ ప్రోత్సాహం తోడైంది. అనతి కాలంలోనే గుజరాత్ రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 1990లో అద్వానీ చేపట్టిన అయోధ్య రథయాత్రకు గుజరాత్ ఇన్‌చార్జ్‌గా, 1992లో మరళీ మనోహర్ జోషి చేపట్టిన కన్యాకుమారి-కశ్మీర్ ఏక్తా రథయాత్రకు జాతీయ ఇన్‌చార్జ్‌గా పనిచేశారు.

1995లో గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడానికి మోదీ కీలక పాత్ర పోషించారు. ఈ విజయం తరువాత పార్టీ మోదీని హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల ఇంఛార్జిగా నియమించింది. అలా కొంత కాలం గుజరాత్ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. శంకర్ సింగ్ వాఘేలా రూపంలో పార్టీలో చీలిక వచ్చి రెండు గ్రూపులు ఏర్పడ్డాయి. ఒక వర్గం ఖజారియాగా, మరో వర్గం హుజూరియాగా పేర్గాంచాయి. ఆ సమయంలో ఓ జర్నలిస్టు మీరు ఏ శిబిరం అని అడిగితే తాను మజ్బూరియా అని చెప్పారు.. అంటే తాను పని చేసేవాడిని మాత్రమే అని.

గుజరాత్ ముఖ్యమంత్రిగా..

2001లో గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో సంభవించిన భారీ భూకంపం తర్వాత సహాయ కార్యక్రమాలు చేపట్టడంలో కేశూభాయి ప్రభుత్వం విఫలమైందని పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దీంతో బీజేపీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. 2001 అక్టోబరులో నరేంద్ర మోదీని గుజరాత్ సీఎంగా ప్రకటించింది. అప్పటి వరకూ ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయని మోదీ ఉప ఎన్నికలో రాజ్‌కోట్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

2002లో గోధ్రాలో సబర్మతి ఎక్స్‌ప్రెస్ ఘటన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు చెలరేగినప్పుడు కాంగ్రెస్ పార్టీ గుజరాత్ ప్రతిష్టకు మచ్చ తెచ్చేలా దుష్ప్రచారం సాగించింది. మోదీ, బీజేపీ ప్రభుత్వం రాజీనామా చేయాలనే డిమాండ్ వినిపించడంతో శాసనసభను రద్దుచేసి మళ్లీ ఎన్నికలను ఎదుర్కొన్నారు.

2002 డిసెంబర్లో జరిగిన గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో మొత్తం 182 స్థానాలకు గాను బీజేపీ 126 స్థానాలలో విజయం సాధించడంతో మోదీ వరసగా రెండోసారి సీఎం పీఠాన్ని అధిరోహించారు. ఆయనపై ఎన్నో విమర్శలు వచ్చినా.. వాటిని సమర్థంగా తిప్పికొట్టారు. తన అధికారాన్ని సుస్థిరం చేసుకున్నారు. గుజరాత్‌ను ప్రగతి పథంలో నడిపించి దేశంలోనే ఉత్తమ సీఎంగా పేరు తెచ్చుకున్నారు. 2007, 2012ఎన్నికల్లో కూడా మోదీ నాయత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. గుజరాత్‌కు వరుసగా 4 సార్లు ముఖ్యమంత్రి అయ్యారు. మోదీ తన గుజరాత్ అభివృద్ధి నమూనా ద్వారా దేశ ప్రజల దృష్టిలో అద్భుత నాయకునిగా గుర్తింపు పొందారు

జలే కుటుంబ సభ్యులు

2013లో జరిగిన కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయానికి 'గుజరాత్ మోడల్'ఎంతగానో ఉపకరించింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే బీజేపీ అధిష్ఠానం నరేంద్రమోదీని ప్రధాన మంత్రి అభ్యర్థిగా ప్రకటించింది. 2014 సార్వత్రిక ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి గణనీయమైన స్థానాలు సాధించింది. నరేంద్ర మోదీ వారణాసి నుంచి దాదాపు 5 లక్షల భారీ మెజారిటీతో గెలు పొందారు. ప్రధానమంత్రిగా ఆయన ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అందులో ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వం సవరణ చట్టం, ట్రిపుల్ తలాక్ రద్దు, రామమందిర నిర్మాణం వంటి ఎన్నో ఉన్నాయి.

పీఎం కిసాన్‌సమ్మాన్ నిధి, ప్రధానమంత్రి ఉజ్జ్వల యోజన, శ్రమయోగి మాన్ ధన్ యోజన, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన, జన్ సురక్ష, పిఎం కిసాన్ సమ్మాన్ నిధి, మేక్ ఇన్ ఇండియా, యోగా దివస్ వంటి పథకాలు ప్రవేశపెట్టారు. 2019 ఎన్నికల్లో మరోసారి గెలిచి రెండోసారి ప్రధాని పీఠం అధిరోహించారు. 2024లో కూడా ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో మూడోసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు మోదీ. కుటుంబ పాలనలు సాగుతున్న ఈ రోజుల్లో బంధుప్రీతి చూపకుండా యావత్ దేశం తన కుటుంబంగా భావించి పరిపాలన కొనసాగించడం ఈ దేశంలో ఎంత మంది రాజకీయ నాయకులకు సాధ్యం?

'సబ్ కా సాథ్, సబ్ కా విశ్వాస్' మంత్రంతో సమ్మిళితమైన, అభివృద్ధి ప్రధానమైన, అవినీతి రహిత మైన పాలన అందించే దిశగా ఒక కొత్త మార్పునకు శ్రీకారం చుట్టారు. అంత్యోదయ అంటే చివరి వ్యక్తికి కూడా పథకాలు, సేవలను అందించాలన్న ధ్యేయంతో కార్యక్రమాలు చేపట్టారు. ప్రపంచంలో అతి పెద్దదైన ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ఆయుష్మాన్. 50 కోట్ల మంది భారతీయుల కు వర్తించే ఈ కార్యక్రమం పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను సమకూర్చుతోంది.

కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో చైనా మన దేశ భూభాగాలను ఆక్రమించినా దీటుగా జవాబు ఇవ్వలేదు. కానీ 2017లో భారత్, భూటాన్ సరిహద్దుల్లోని డోక్లామ్‌లో చైనా చొరబాటును మన సైన్యం గట్టిగా ప్రతిఘటించింది. 2020లో లద్దాక్ లోని గాల్వాన్ లోయలో చైనా సైనికుల అతిక్రమణను మన సైనికులు అడ్డుకున్నారు. ఈ రెండు ఘటనలతో చైనాకు భారత్ గట్టి బుద్ధి చెప్పింది.

భారత్ గతంలో ఇతర దేశాల వెంట, ముఖ్యంగా అమెరికా వెంట పరుగులు తీసేది. ఇప్పుడు అగ్రరాజ్యం మనను గుర్తించేలా చేస్తున్నాం. తాజాగా అమెరికా విధించిన సుంకాలకు కూడా లెక్క చేయలేదు ప్రధాని మోదీ. అమెరికా, యూరప్ దేశాల ఆంక్షలను పెడచెవిన పెట్టి చౌకగా రష్యా నుండి ఆయిల్ కొనుగోలు చేశారు. బ్రిక్స్ దేశాల కూటమిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని తెచ్చే ప్రయత్నాల ద్వారా అమెరికాకు షాక్ ఇచ్చారు ప్రధాని మోదీ. గ్లోబల్ లీడర్‌లలో అత్యధిక ఫాలోయింగ్ ఉన్న నేతగా గుర్తింపు దక్కించుకున్నారు.

స్వతంత్ర భారతదేశంలో పుట్టిన మొదటి ప్రధాని, ఎక్కువ కాలం పనిచేసిన కాంగ్రెసేతర ప్రధానిగా ఘనత సాధించిన నరేంద్రమోదీ ఖాతాలో మరో రికార్డ్ చేరింది. రెండుసార్లు మెజారిటీతో గెలిచిన ఏకైక కాంగ్రెసేతర నాయకుడిగా నిలిచిన నరేంద్ర మోదీ అత్యధిక కాలం పనిచేసిన రెండో ప్రధాన మంత్రిగా రికార్డు సృష్టించారు. ఇప్పటివరకూ ఈ రికార్డ్ దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరిట ఉండేది. తాజాగా ప్రధాని మోదీ ఈ ఘనత సాధించారు. హిందీ మాట్లాడని రాష్ట్రం నుంచి అత్యధిక కాలం పనిచేసిన ప్రధాని కూడా మోదీనే. రెండు పూర్తి వరుస పదవీకాలాలను పూర్తి చేసిన, రెండుసార్లు మెజారిటీతో తిరిగి ఎన్నికైన తొలి, ఏకైక కాంగ్రెసేతర నాయకుడు నరేంద్ర మోదీ. లోక్‌సభలో సొంతంగా మెజారిటీ సాధించిన ఏకైక కాంగ్రెసేతర నాయకుడుగా నిలిచారు. అత్యధిక విదేశీ పర్యటనలు చేసిన భారత ప్రధాని నరేంద్ర మోదీనే. పలు దేశాలు తమ దేశ అత్యున్నత పౌర పురస్కారాలతో ప్రధాని మోదీని సత్కరించాయి.

సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎప్పుడూ అవినీతికి పాల్పడలేదు. తన బంధువులకు కూడా ఎలాంటి ప్రయోజనం కలిగించలేదు. దానితో ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజాహితం దృష్టిలో పెట్టుకొని తీసుకుంటాడనే ప్రజలకు ప్రగాఢ విశ్వాసం ఉన్నది.అది ఆయన ప్రధాన మంత్రి అయిన తర్వాత కూడా నిరూపిత మైంది. మోదీ రోజుకు పద్దెనిమిది గంటలు పనిచేసినా అలసిపోరు. ఆ పని వల్లే తనకు నిద్ర దూరమైందని, కాకపోతే యోగా, ప్రాణాయామం వల్ల తాను ఆరోగ్యంగా, ఉత్తేజంగా ఉండగలుగు తున్నానని మోదీ తరచూ చెప్తుంటారు.

ఉన్నత పదవుల్లో, స్థానాల్లో ఉన్నవాళ్లు తరచూ విరామం తీసుకోవడం చూస్తుంటాం. కానీ, నరేంద్ర మోదీ మాత్రం గుజరాత్ ముఖ్యమంత్రిగా.. పదమూడేళ్లలో ఏనాడూ సెలవు పెట్టింది లేదు. అసలు ఆయన అంతకాలంలో జ్వరం బారిన పడిన దాఖలాలు, విరామం తీసుకున్నారనేది కూడా లేకపోవడం విశేషం. ఇప్పుడు ప్రధానిగానూ దేశం కోసం ఆయన అదే నిబద్ధతను ప్రదర్శిస్తున్నారు. నిత్యం యోగా చేసే అలవాటు ఉన్న ఆయన.. పక్కా శాకాహారి. ఫొటోగ్రఫీ, కవితలు-పద్యాలు రాయడం ఆయనకు ఇష్టం. ఆయన ఫొటోలతో చాలాసార్లు ఎగ్జిబిషన్ కూడా నిర్వహించారు. మరి ఇలా మంచి లక్షణాలు ఉండి రాజకీయాల్లో విజయం సాధిస్తున్న నాయకులు ఎందరు ఉన్నారు.



క్రాంతిదేవ్ మిత్ర, సీనియర్ జర్నలిస్ట్



మబ్బుల దర్పా

"అన్నం న నింద్యాత్! అన్నం న పరిచక్షీత" తైత్తరీయోపనిషత్ లోని ఈ శ్లోక పాదాల భావం- అన్నాన్ని ఎప్పుడు నిందించ కూడదు, అవమానించ కూడదు. నిరసన భావంతో నిరాకరించకూడదు. మన పెద్దల దృష్టిలో నోట్లోకి వెళ్లే ప్రతి ఆహార పదార్థం అన్నమే. ఇక్కడ నిందించకూడదంటే పారవేయకూడదు. 'అన్నం బ్రహ్మేతి వ్యజానాత్', అంటే సృష్టి అంతటికి మూలాధారమైనది అన్నం. అన్నం పరబ్రహ్మ స్వరూపం. ఆకలి తీర్చి శక్తినిచ్చే ఆ అన్నమే దైవమని భావం.

వ్యవసాయం చేసి అన్నాన్ని పండించగలం. దానికి వర్షం అవసరం. వ్యవసాయం అతి ప్రాచీన మైన వృత్తి. మిగిలిన వృత్తులన్నింటికి మూలమైనది. లోకాను భూతమైన వ్యవసాయ వృత్తి ప్రాధాన్యాన్ని వేరే చెప్పాలా? 'ధాన్యలక్ష్మితో ధనలక్ష్మి ఓపదు' అన్న సామెత ఇక్కడ సేద్యానికి ఉన్న ప్రాధాన్యాన్ని పట్టిస్తున్నది.'తల్లి పెంచంగవలయు, ధరణి పెంచంగ వలయు/ తల్లి యిచ్చిన పాలకన్న ధరణి యిచ్చిన పాలు మిన్న' వంటి సూక్తులు కూడా 'కృషి' ఎంత ముఖ్యమైనదిగా చెబుతాయి. 'కృషితో నాస్తి దుర్భిక్షం జపతోనాస్తి పాతకమ్' అన్న సంస్కృత లోకోక్తి అర్థం కూడా ఇదే. రెట్టడి మతశాస్త్రం చదివిన తరువాత ఇలాంటి అభిప్రాయాలే ముందు గుండెను తాకుతాయి.

అయ్యాలాఖ్య, భాస్కరరాఖ్య కవిద్వయం రెట్ట మతశాస్త్రాన్ని పరిష్కరించింది. మద్రాసులో ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో, శిథిలావస్థలో దీని వ్రాతప్రతులు లభించాయి. వీటిని 1921లో పమ్మి త్యాగరాయ శ్రేష్టి మొదట అచ్చు వేయించారు. ఇది తాత్పర్య సహితంగా కావాలని చాలామంది పాఠకులు కోరారు. కానీ అది కన్నడ ప్రతి. ఆ కవిద్వయం దీనిని తెలుగు పద్యకావ్యంగా రచించారు. పురాణం సూర్యనారాయణ తీర్థులు మూలప్రతిలోని తప్పులను సవరించారు. కృతిపతి కోసం ప్రయత్నించగా వేంకటపతిరాజు లభించారు.

గాథ సుజ్ఞాన "రెట్ట" ఘనుడు మున్ను
చెలిగి కన్నడ భాషను జెప్పినట్టి
శాస్త్రమంతయు నేను సజ్జనులు పొగడ
దెనుగు బాస నొనర్చంగ దివురునపుడు

రెట్టడు అనే జ్ఞానసంపన్నుడైన పండితుడు పూర్వం కన్నడ భాషలో రాసి పెట్టిన శాస్త్రాన్నే అభిరుచి కలిగిన వారంతా ప్రశంసించే విధంగా తాను తెలుగు భాషలో రాయడానికి ఉపక్రమిస్తున్నట్టు సూర్య నారాయణ తీర్థులు చెప్పుకున్నారు. ఈ గ్రంథం జ్యోతిష్య, వ్యవసాయ ప్రకృతి, శకున శాస్త్రాల పరిజ్ఞానాన్ని అందిస్తుంది. భారతావనే వ్యవసాయ సంస్కృతి కలిగిన దేశం. వ్యవసాయం గురించి ఇక్కడ ఎంతో జ్ఞానం పరిఢవిల్లింది. కొన్ని అద్భుత గ్రంథాలు వెలువడినాయి. వాటిలో ఒకటి రెట్టడి శాస్త్రం. ఇందులో ఆయన వర్షం రావడానికి ముందు ప్రకృతిలో వచ్చే మార్పులను అద్భుతంగా నమోదు చేశాడు. మేఘాల ఆకృతి, రంగులను బట్టి అవి ఇచ్చే వానను అంచనా వేయవచ్చునంటాడు. విత్త డానికి ఎలాంటి సమయం మంచిదో సూచించాడు. ఇవన్నీ ప్రకృతితో మమేకమై ఉన్నవే.

ప్రకృతి సమతూకం దెబ్బతినకుండా తెలుగు రైతులు సాగు చేశారు. ఆ అనుభవ జ్ఞానసారమే వ్యవసాయ విజ్ఞానంగా ఆవిష్కృతమైంది. మరొక వంక జీవితానికీ, సేద్యానికీ ఉన్న బంధం వలెనే భాషకూ సామెతకీ ఉన్న బంధం వల్ల సామెతలూ నానుడుల రూపంలో కూడా ఆ అనుభవానికి కావ్య గౌరవం కల్పించారు. జ్యోతిష్కులు 27 నక్షత్రాల ఆధారంగా జాతకాలు, పంచాంగాలు రూపొంది స్తారు. సూర్యుడు ఏ నక్షత్రానికి దగ్గరగా ఉంటే ఆ కాలానికి ఆ కార్తె పేరు పెట్టారు. సంవత్సరానికి 27 కార్తులు. తెలుగువారు చంద్రమానాన్ని పాటిస్తుంటే తమిళులు సౌరమానాన్ని పాటిస్తున్నారు. తెలుగు కర్షకులు ఆయా కార్తెల నెలలు రాశుల వారీగా పైరుదీ, వాతావరణానిదీ ఎలాంటి బంధమో సామెతల రూపంలో చెప్పుకున్నారు. ఇలా: 'అశ్వని కురిస్తే అంతా నష్టం, అప్పులు ఖాయం'. 'భరణి కురిస్తే ధరణి పండుతుంది'. 'కృత్తిక పునర్వసులు సత్తువ పంట'. 'రోహిణిలో (ఎండకి) రోళ్లు పగులు తాయి'. 'మృగశిర కురిస్తే ముసలెద్దు రంకె వేస్తుంది'. 'ఆరుద్ర వాన ఆదాయాల బాన'. 'ఆశ్లేష కురిస్తే ఆరోగ్యం'. 'పుబ్బలో చల్లినా, బూడిదలో చల్లినా ఒకటే'. 'ఉత్తర చూసి ఎత్తరగంప- విశాఖ చూసి విడవరా కొంప'. 'హస్తలో చల్లితే హస్తంలోకి రావు'. 'చిత్త కురిస్తే చింతకాయలు కాస్తాయి'. 'స్వాతి వానకు సముద్రాలు నిండుతాయి'.

ఐదు ఆశ్వాసాల ఈ శాస్త్రగ్రంథంలో విషయాల గురించి అసలు రచయిత రెట్టడు చెప్పాడు. దీనిని ఆయన ప్రబంధంగా చెప్పుకున్నాడు. పళ్లూ పూలూ ఇచ్చే చెట్లకు జన్మనిచ్చే వర్షం లక్షణాలు, మేఘగర్జనల వివరాలు, ఇంద్రధనుస్సు మర్మం, సూర్యతాపం, గాలి లక్షణాలు, గ్రహచారం, ఉషోదయం, అస్తమయం, సంవత్సరాది ఫలాలు తన గ్రంథంలో ఇచ్చినట్టు చెప్పుకున్నాడాయన. వర్షపాతం గురించి రాస్తూ, మోదుగకాయలో మూడు గింజలుంటే ఆర్ద్ర కార్తె మొదలుకొని అనగా ఆరుద్ర, పునర్వసు పుష్యమి, అశ్లేష, మఘ, పుబ్బ, ఉత్తర, హస్త, చిత్త, స్వాతి, విశాఖ, అనూరాధ, జ్యేష్ట, మూల, పూర్వాషాడ అనే కార్తెలలో చక్కని వర్షం పడుతుందని చెప్పాడాయన. మరొకచోట, హెచ్చుగా మంచుకురిసినా, చింత, మామిడి, నేరేడు బాగా పూసినా, కాసినా, క్రిమికీటకా దులు అభివృద్ధి అయినా, నెమలి పురివిప్పి ఆడినా వర్ష సూచనగా భావించవచ్చునన్నాడు.

గోశకునం, అంటే గోవు ద్వారా వెల్లడయ్యే సూచనను బట్టి వర్షం రాకను పసిగట్టవచ్చునంటాడు రెట్టడు. ఆవులమందకు పూజ చేసిన తరువాత ఆ మంద నుండి ఎర్రని కాంతి గలది గానీ, కుంటిది, గుడ్డిది, బక్కచిక్కినది గాని, నడువలేని ఎద్దుగాని, మనో దుఃఖంచేత మంద నుంచి బయటకు వస్తే ఆ ప్రాంత ప్రజలు రోగాలతో చనిపోతారని తేల్చాడు రెట్టడు. ఇంకా, వానలు కురియవు, ఆ దేశ పాలకుడికి హాని జరుగుతుందని చెప్పాడు. రూపురేఖలను బట్టి, ఇతర లక్షణాలను బట్టి మేఘాలను కూడా కులాల పేర్లతో వర్ణించాడాయన. వర్షపాతాన్ని ద్రోణం అనే ప్రమాణంతో చెప్పాడు. తీవ్రంగా ఎండలు కాయడం, నేల పగలడం, సూర్యుడి చుట్టూ వలయం ఏర్పడడం, బండి నడిచినట్లు గర్జించడం, విస్తారంగా ఉరుములు, మంచు, గాలి వీచటం, ఉక్క పెట్టటం, చిన్న చిన్న చినుకులు, చలి ఈ పది వర్షధాతువులు. చాలా వేడిమి, చంద్రుడి చుట్టూ వలయం, మేఘాలు గర్జించడం వంటి అయిదు పంచధాతువులు. ఈ

రులో ఎన్ని సంగతులో!

ధాతువులు సరిగా ఉంటే వాన సకాలంలో పడు తుంది. సస్యములు ఫలిస్తాయి అంటాడు రెట్టడు. ఛాయాదేవి కుమారుడు శని మేషంలో సంచరిస్తే, వృషభంలో గురుడుంటే ధనుర్మాసం మొదలు మాఘ మాస పర్యంతం స్వాతి మూలానురాధలలో, మకరి మత్స్యకర్కట రాశిలోను విత్తితే జొన్న విశేషంగా ఫలిస్తుందని సూచించాడు రెట్టడు.

ఇళ్ల మీదకెక్కి, నదులు, చెరువుల మధ్యన నిలబడి కుక్కలు మొరిగినా, నక్కలు పశువులను తరుముకొచ్చి కరిచినా, పిచ్చుకలు మొదలైన పక్షులు పచ్చికల మీద విచ్చల విడిగా మేసినా, పొడిమట్టిలో జంట గూడి పొరలినా, చిలకల వంటివి సుఖప్రదమైన తమ తమ గూళ్లు విడిచి ఆకాశంలోకి వెళ్లినా, అలాగే కాకులు కూడా ఆకాశానికి ఎగసినా, రెక్కలార్చినా, పిల్లులు తల నేలకు ఆన్చి బుస్సు బుస్సుమన్నా, నల్లని ఈగలు మోతతో గుంపులుగా నీటిపై మూగినా, నేల మీద అడుసు బుసబుస పొంగినా కూడా వర్షసూచనగానే భావించాడు రెట్టడు.

ఈ లక్షణాలు కనిపించినా కూడా వర్షం వస్తుందని భావించవచ్చునని ఆయన అన్నాడు.నీళ్లలో నుంచి చేపలు ఎగిరి పడడం,అలా పడిన జలచరాలు చని పోవడం, పెద్ద జంతువులు తలలు దించి అరిచినా, శరీరం దులపరించినా కూడా వర్షం రావచ్చునని అంటాడు.

మేఘాలు ఎలా ఉంటే వర్షాలు వస్తాయి? మెరుపులు, తళుక్కు తళుక్కుమని మెరుస్తూ ఉంటే ఆకాశంలో గట్టిగా కమ్మి ఉన్న తెల్లని మేఘం భూమి కరిగిపోయేటట్టు కురుస్తుందట. నీలం వలె వెలుగు లీనుతూ ఉండే మేఘం లోపల మెరపులు రాగి రంగుగాను, మంకెన పువ్వు చందంగా ప్రకాశించి నట్లయితే వాటిని రాజ మేఘాలని అంటారు. అవి గంగానది, వింధ్య పర్వతాలలో విస్తారంగా వర్షిస్తాయి. మేఘాలలో నిప్పుల వంటి కాంతి గల గొప్ప మెరుపులు మెరిసిన పక్షంలో, వింధ్యకు గోదావరి నదికి మధ్య మిక్కిలి సంవృద్ధిగా వానలు కురుస్తాయి.

కొన్ని రంగులను బట్టి వాటిని కులాల పేరు మీదుగా రెట్టడు పిలిచాడు. ఆకృతిని బట్టి కూడా అవి ఇచ్చే వర్షం ఆధారపడి ఉందంటాడు. వింజా మరల మాదిరిగా, కొలనుల వలె, చెరువుల వలె, మొసళ్ల వలె, వెండికొండల రూపంలో, సింహ రూపంలో, గోపురాల ఆకృతిలో, శృంగారవనాల రూపంలో, దేవతల విమానాల వలె, ఎద్దలను తలపించే, గొడుగును గుర్తు చేసే, కత్తుల వలె, ఏనుగుల వలె, శంఖంలా ప్రకాశించే మేఘాలు చక్కగా వర్షిస్తాయి. అలా కాక; కాకి, కోతి, కాటుక కొండ, చెవులపిల్లి, మోడువారిన వృక్షం, శూలం, పాడుబడిన ఇల్లు వంటి వాటిని మరిపించే మేఘాలు కొంచెంగానే కురుస్తాయని పెద్దలు చెబుతారు.

గోరోజనం (ఆవు కడుపులో నుంచి వస్తుంది) వలె, ఆరుద్ర పురుగు వలె, నరకగా వచ్చిన రక్తంలా మేఘం ప్రకాశిస్తే వాన కురియదని రెట్టడు చెబుతున్నాడు. సూర్యుడు తూర్పున నుండగా పడమర దిక్కున మెరుపులు మెరసినా, బంగారు రంగు మేఘాలు కనపడినా సమృద్ధిగా వాన కురుస్తుంది. పెద్ద మర్రిచెట్టుపై బంగారు రంగు మేఘం కనిపించినా సంవృద్ధిగా వర్షం ఇస్తుంది. రోహిణి నక్షత్రంలో పదిద్రోణములు వాన కురిస్తే చెరుకు తోటలు ఏపుగా పెరుగుతాయి. ఆరుద్రలో వాన కురిస్తే కూరగాయలు సమృద్ధిగా పండుతాయి. మెరుపులు పొగవలె, బూడిద రంగులోనూ కనపడితే వానలు ఆలస్యమవుతాయి. ఇంద్రధనుస్సు పసుపు వన్నె గలది కనిపిస్తే ప్రజలకు బాధలు తప్పవు. అది తెల్లటి వర్ణంలో కనిపిస్తే అన్ని ప్రాంతాలకు చేటు కలుగుతుంది. దుక్కి దున్నడానికి ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రూపంలో నాగళ్లు ఉంటాయి. నేలను బట్టి వాటి ఆకృతి ఉంటుంది. ఆ దున్నడు యంత్రానికి, పొలమున్న నేలకి గంధం, అక్షితలు, ధూపం వేసి, నైవేద్యం పెట్టి ఆపై జొన్నలు మొదలైన విత్తనాలు చల్లితే మంచి ఫలితాలు కలుగుతాయం టాడు రెట్టడు. విత్తనాలు చల్లేందుకు వెళ్లే సమయంలో కొన్ని ధ్వనులు, కొన్ని పక్షుల కూతలు వినిపిస్తే మంచి దంటాడాయన. పైడికంటి పక్షి కూసిన సమయంలో పెసలు చల్లితే, బ్రాహ్మణులు సంతోషంగా చేస్తున్న వేద పఠనం వినిపించిన సమయంలో వేసిన విత్తనాలతో పైరు హెచ్చుగా, చక్కగా పండుతుంద న్నాడు రెట్టడు. ధాన్యం హెచ్చుగా పండుతుంది. కాబట్టి సేద్యగాడు సంతోషంగా ఉంటాడంటాడు.

కొన్ని వస్తువులను కొన్ని సమయాలలో నిలవ చేస్తే లాభం విశేషంగా ఉందని చెప్పాడు రెట్టడు. అందులో ఆషాఢ బహుళ అమావాస్య ఒకటి. ఆనాడు నేయి, తేనె, నూనె, మంచి గంధం నిలువ చేస్తే, రెండు నెలల నాటికి రెండు రెట్లు లాభం వస్తుందని చెప్పాడు. అలాగే మదపుటేనుగులు, గుర్రాలు, బంగారం, వెండి, మరకతములు, రత్నాలు కొన్నట్టయితే రెండు నెలల నాటికి రెండింతలు లాభం కలుగుతుందని సూచించాడు.

శుక్రుడు నల్లనివాడైతే యుద్ధాలు అధికమవుతా యన్నాడు. ఆయనే ఎర్రని రంగు గలవాడైతే ఆయు ధాల వలన బాధలు కలుగుతాయి. ఆ శుక్రుడే ఆకుపచ్చ రంగ గలవాడైతే దొంగల వలన బాధలు కలుగుతాయి. బూడిద రంగు గల వాడైతే మనిషికి దేహ సంబంధ బాధలు తప్పవు. అదే తెల్లనికాంతితో ఉంటే భూమి అంతా సుభిక్షంగా ఉంటుంది.

గురుడు వృషభరాశిలో ఉంటే పాపాలు సంభవిస్తాయి. శిశువులకు, ఆవులకు మిక్కిలి చేటు జరుగుతుంది. మనుషులు రోగాల పాలవుతారు. పంటలు లేక బాధలు కలుతాయని రెట్టడు అన్నాడు.

మూలం:

1. రెట్ట మతశాస్త్రము : అయ్యలు, భాస్కరుడు, పురాణం సూర్యనారాయణ తీర్థ (సంకలనం) పేజీ-5, 13
2. వ్యవసాయ సామెతలు : నేదునూరి గంగాధరం.



డా. కాశింశెట్టి సత్యనారాయణ

విశ్రాంత ఆచార్యుడు

హైదరాబాద్ విమోచన దినోత్సవం అంటే ఈ తరానికి ఒక సాధారణ సంఘటనలా అనిపించవచ్చు. కొందరు నాయకులకు రాజకీయ అవసరం కావచ్చు. కానీ సమాజం తమకు ఏమిచ్చిందని కాకుండా సమాజానికి తాము ఏమి ఇస్తున్నామన్న తలంపుతో ఉద్యమించిన ఎందరో త్యాగధనుల ఫలితం. 'బ్రిటీష్ పాలకులు వెళ్లిన తరువాత తెలంగాణను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకుంటా..' అని బీరాలకు పోయిన నియంత మెడలు వంచిన అహింసావాదుల ప్రసాదం.'ప్రజలంతా ఒక్కటైననాడు క్రూరాతిక్రూర నియంతలు సైతం వారి ముందు నిలబడలేరు. మోకరిల్లక తప్పదు' అన్న ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ మాటలకు వాస్తవ రూపం.

విమోచనోద్యమ



కొమురం భీం | రామానందతీర్థ | సురవరం | కాళోజీ

దేశ స్వరాజ్యం సంగ్రామంలో హైదరాబాద్ విమోచన ఉద్యమం మహోజ్జ్వల ఘట్టం. పత్రికలు, ఆర్యసమాజ్, హిందూ మహాసభ లాంటి సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంస్థలు ఉద్యమానికి ఊపిరులూదాయి. నిజాం, రజాకారులకు వ్యతిరేంగా హిందువులను జాగృతం చేశాయి. హైదరాబాద్ వివేక వర్ధని ప్రాంగణంలో సమావేశంలో (నవంబర్ 11,1921) తెలుగులో మాట్లాడిన అల్లంపెల్లి వెంకటరావుకు అవమానం ఎదురవడంతో మాడపాటి హనుమంతరావు, ఆదిరాజు వీరభద్రరావు నేతృత్వంలో 'ఆంధ్రజన సంఘం' ఏర్పాటైంది. మాడపాటి, ఆదిరాజు, బూర్గుల రామకృష్ణారావు, ముఖ్దూం మొహియుద్దీన్, అరిగే రామస్వామి, రావి నారాయణరెడ్డి, మందుముల నరసింగరావు తదితరులు నిజాం నిరంకుశత్వంపై పోరాడుతూనే తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు పాటుపడ్డారు. సత్యాగ్రహ ఉద్యమాలకు సావర్కర్ మద్దతు(డిసెంబర్ 29, 1938) ప్రకటిస్తూ, జనవరి 14, 1939న హిందువుల డిమాండ్‌లను అంగీకరించకపోతే ఉద్యమం తప్పదని నిజాంను, ఆతని ప్రధానిని హెచ్చరించారు. ఎందరో నేతలు, నారీమణుల పోరాటం,అమరుల త్యాగలకు నిజాం ఏడవ నవాబ్ మీర్‌ఉస్మాన్ ఆలీఖాన్ దిగివచ్చి వల్లభభాయ్ పటేల్ సమక్షంలో సెప్టెంబర్ 17,1948న మోకరిల్లాడు.

ప్రజాహితమే నాటి పోరాటయోధులకు సమ్మతం. జనం కోసం జీవితాలను పణంగా పెట్టారు. ఆశయం కోసం అహరహం ఉద్యమించిన వారికి జైళ్లంటే వెరపు కానీ, ప్రాణం మీద తీపికాని లేవు.

గిరిజన పోరాట యోధుడు కొమరం భీం 'జల్, జమీన్, జంగల్' నినాదంతో ఉద్యమించారు. పశువుల కాపర్ల నుంచి నిజాం ప్రభుత్వం వసూలు చేస్తున్న అర్థం పర్థంలేని పన్నులకు నిరసనగా ఆసిఫాబాద్ జోడేఘాట్ గుట్టల పరసరాలు కేంద్రంగా గెరిల్లా దాడులకు దిగాడు. ఆయన పేరు వింటేనే నిజాంకు వణుకట. అయితే కుర్దుపటేల్ అనే వ్యక్తి ఇచ్చిన సమాచారంతో నిజాం సైన్యం భీంను, ఆయన అనుచరులను కాల్చి చంపింది.

నైజాం నవాబు హిందూ వ్యతిరేక మత దురంహంకార, అప్రజాస్వామిక పాలనపై పోరాడిన యోధుడు, నిష్కామ యోగి రామానంద తీర్థ (వేంకటేశ్ భావనరావు ఖడ్గిగర్). సామ్యవాదం, ప్రజాస్వామ్యం వంటి ప్రసంగాలతో ప్రజలను మేల్కొల్పిన మేటి దేశభక్తుడు. వందేమాతరం గీతాలాపన నిషేధం, హిందువులను మతం మార్చే ఇత్తేహాద్ చర్యలకు నిరసనగా ఆర్యసమాజ్ చేపట్టిన ఉద్యమ నిర్వహణంలో కీలకభూమిక పోషించారు. గాంధీ వారింపులను లక్ష్యపెట్టక నైజాం సరిహద్దులకు ఆవల సాయుధ స్థావరాలు ఏర్పాటు చేసి, నైజాం పోలీసులపైనా, రజాకార్లపైనా దాడులు చేయించారు.

నిజాం రాజ్యంలోని అన్యాయాలు, దౌర్జన్యాలను వెలికితీసేందుకు గోలకొండ పత్రికను స్థాపించి నిజాంకు వ్యతిరేక అనేక కథనాలు రాసిన ధీశాలి. సురవరం ప్రతాపరెడ్డి, ఆయన సంపాదకీయాలు నిజాం ప్రభుత్వం గుండెల్లో కుంపట్లు రాజేసేలా ఉండేవని ప్రసిద్ధి. ఆయన 'గ్యారా కద్దూ బారా కోత్వాల్' కథనం నిజాం పాలన అవినీతి గుట్టును రట్టు చేసింది.

ఉద్యమమే ఇంటి పేరు (వందేమాతరం)గా మారిన ఉద్యమశీలి వావిలాల రామచంద్రరావు. స్వరాజ్య సమరంలోనూ జైలులో తోటి ఖైదీలతో వందేమాతరం గీతం ఆలపిస్తుండంగా, ఆగ్రహించిన జైలు అధికారి ఆయన చెంపలపై కొట్టడంతో పాటు 24 కొరడా దెబ్బల శిక్ష వేశాడు. ప్రతి దెబ్బకు 'వందేమాతరం' అని నినదించారు రామచంద్రరావు. అదే ఇంటి పేరైంది. నైజం విమోచన ఉద్యమం కాలంలో అజ్ఞాతంగా పోరాటం సాగిస్తూ, సైనిక రహస్యాలను సేకరించి హైదరాబాద్‌లోని భారత ప్రభుత్వ ప్రతినిధి జనరల్ కెఎం మున్షీకి అందచేసే వారు. పండరీపురంలో జరిగిన బహిరంగసభలో వీరసావర్కర్ ఆయనకు (రామచంద్రరావు) 'వందేమాతరం' బిరుదు ప్రదానం చేశారు.

'పుట్టుక నీది/చావు నీది/బతుకంతా దేశానిది' అన్న ప్రజాకవి కాళోజీ దానిని అక్షరాల పాటించారు. 1946లో వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన వారిలో ఆయన కీలకవ్యక్తి. హింసను ప్రతిఘటించేవారిని నరసింహులుగా అభి వర్ణించారు. 'నవయుగంబున నాజీ వృత్తుల నగ్న నృత్య మింకెన్నాళ్లు?/పోలీసు అండను దౌర్జన్యశక్తుల పోషణ పొందేదెన్నాళ్లు..' అంటూ నిజాంకు వ్యతిరేకంగా కవితలల్లి కరపత్రాలు పంచుతూ జైలు పాలయ్యారు.

నిజాం పోలీసుల, రజాకారుల నిక్రుష్ట చేష్టలపై...

'మన కొంపలార్చి మన స్త్రీలను చెరిచిన
మన పిల్లలను చంపి మనల బంధించిన
కిరాతకులను కసి ఆరిపోకుండ బుస కొట్టు చుండాలె
కాలంబురాగానే కాటేసి తీరాలె'

అని జనాన్ని మేల్కొల్పారు.

తెలంగాణ ప్రాంత తొలి నవలా రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి. తెలంగాణ విమోచన ఉద్యమాలలో నిజాంకు వ్యతిరేక రచనలతో ప్రజలను చైతన్యపరిచారు. నిజాంప్రభుత్వం ఆయనను నాలుగు జైళ్లకు తిప్పింది. జైళ్లలోని ఖైదీల మనోభావాలను విశ్లేషిస్తూ, 'జైలు లోపల' గ్రంథాన్ని వెలువరించారు.

తెలంగాణ రైతాంగ పోరాటం సాయుధ పోరాటంగా మారడానికి ఆళ్వార్‌స్వామి రచనలే కారణంగా విశ్లేషకులు చెబుతారు.

దాశరథి ప్రజాకవి, విప్లవ కవి. విద్యావేత్త, నిరంకుశ ఏలికకు 'అగ్నిధార'.

'ఓ నిజాము పిశాచమా! కానరాదు
నిన్ను బోలిన రాజు మాకెన్నడేని
తీగెలను తెంపి ,అగ్నిలో దింపినావు
నా తెలంగాణ కోటి రతనాల వీణ'... పద్యం ఆయన రచనల్లో తలమానికంగా పేర్కొంటారు. అడ్డూఅదుపు లేని చిత్రహింసలకు మనసు రగిలి, కట్టలు తెంచుకున్న ఆవేశంతో..

'దగాకోరు బడాచోరు రజాకారు పోషకుడవు/ ఊళ్లకూళ్లు అగ్గిపెట్టి ఇళ్లన్నీ కాలబెట్టి /పెద్దరికం చేస్తావా?' అని నిజాంను నిలదీసిన ధీశాలి.'ముసలి నక్కకు రాచరికమ్ము దక్కునే' అని ప్రశ్నించి కారాగార శిక్ష అనుభవించారు.

పటేల్ ఎదుట
లొంగిపోయిన నిజాం

వైతాళికులు

వట్టికోట | వందేమాతరం | దాశరథి | ఐలమ్మ

తెలంగాణ భగత్ సింగ్‌గా పేరొందిన నారాయణ రావు పవార్ , తన అనుచరులు మేరా గుండయ్య, జగదీశ్‌లతో కలసి నిజాంపై బాంబులు వేసి ప్రాణభయం రుచి చూపారు. త్రుటిలో తప్పించుకున్న నిజాం, నారాయణరావు పవార్‌కు ఉరిశిక్ష, గండయ్యకు యావజ్జీవ కారాగార శిక్ష విధించాడు. పోలీస్ చర్య అనంతరం జైలు నుంచి విడుదలయ్యారు.

హైదరాబాద్ ఉక్కు మనిషి ఆర్యసమాజ్ పండిత్ నరేంద్ర జీ పేరు వింటేనే నిజాం గుండెల్లో రైళ్లు పరిగెత్తేవట. ఆయనపై అనేకసార్లు హత్యాయత్నం జరిగింది. జైళ్లలో చిత్రవధలు పెట్టారు. ఆయన ధాటికి తట్టుకోలేక నిజాం నగర బహిష్కరణ చేశాడు. పండిత్ జీ మత మార్పిడులను వ్యతిరేకించి శుద్ధి కార్యక్రమంతో తిరిగి హిందూమతంలోకి రప్పించడంలో కీలక పాత్ర వహించారు.

నిజాం, ఆయన అనుచరుల అరాచకాలను వెలువరిస్తూ, ఏలికకు నిద్రలేని రాత్రులు మిగిల్చిన పాత్రికేయుడు షోయబుల్లాఖాన్. నిజాం రాజ్యాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయాలంటూ ఏడుగురు ముస్లిం పెద్దలు తయారు చేసిన వినతిని షోయబుల్లా తన పత్రిక 'ఇమ్రోజ్' (ఈరోజు)లో ప్రచురించినందుకు రజాకారులు హైదరాబాద్ కాచిగూడ కూడలిలో ఆగస్టు 9,1948న కుడిచేతిని నరికేయగా, ఆ మరునాడు ఆయన కన్నుమూశారు.

మరో ఉద్యమకారుడు, ఖమ్మంవాసి హీరాలాల్ మోర్యా....

'మాకు వద్దీ నిజాంరాజు
ఈ కఠిన పాషాణ సదృశ
డీ నిరంకుశ లోహమూర్తి
మాకు వద్దు మాకు వద్దు' అని గర్జించారు.

'బండెనక బండి కట్టి
పదహారు బండ్లు కట్టీ
ఏ బండ్లే పోతావు కొడుకో
నైజం సర్కరోడా' అంటూ బండి యాదగిరి నిగ్గదీత గీతం నాడు తిరగబడిన తెలంగాణ నోట నానింది. సామాన్యుడి నోట తూటాల పేలింది.

వరంగల్ నివాసి బత్తిని మొగిలయ్య ఓరుగల్లు గడ్డపై గస్తీ పోలీసులను ఎదురించి వరంగల్ తూర్పు కోటలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి, అడ్డువచ్చిన రజాకార్లలో ముగ్గురిని మట్టుపెట్టారు. ఇంటికి చేరుతుండగా, రజాకారులు దారిలో అడ్డగించి బల్లేలతో దాడి చేశారు. 'వందేమాతరం, భారత్ మాతాకీ జై 'అంటూ మొగిలయ్య నేల రాలాడు.

నిజాం తాబేదారు దేశ్‌ముఖ్ విసునూరు రామచంద్రారెడ్డి దురాగతాలను ప్రతిఘటించిన వీరవనిత చాకలి ఐలమ్మ. పొలంలోని పంటను స్వాధీనం చేసుకోవాలనే ఆయన ప్రయత్నాలను ధైర్యంగా ప్రతిఘటించారావె. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారనే ఆరోపణపై భర్తను, కుమారుడిని అరెస్టు చేసినా, వ్యవసాయం కూలీలను కూడగట్టి దొరల దౌర్జన్యాలను ప్రతిఘటించారు.

నిజాం అనుయాయుల బాధలు భరించలేక భాయి శ్యాంలాల్ జీ బీదర్ జైలులో వారు ఇచ్చిన విషం తాగి ప్రాణత్యాగం చేశారు. సరిహద్దు అపర గాంధీగా పేరొందిన జమలాపురం కేశవరావు, 'నిజాం నిరంకుశ పాలనను అంతమొందించి బాధ్యతాయుత ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించగలమని బహిరంగంగానే గర్జించారు. జాగీర్దార్లు, దేశ్‌ముఖులు, భూస్వాములు, నిరంకుశ ఉద్యోగులకు వ్యతిరేకంగా పోరాడడంతో తెలంగాణ ప్రజలు కోటి గొంతుకలతో ఆయనను 'సర్దార్' అని సంబోధించారు.

సర్దార్ పటేల్ ఆధ్వర్యంలో 'ఆపరేషన్ పోలో' (సెప్టెంబర్ 13,1948) చేపట్టిన దరిమిలా హైదరాబాద్ రాష్ట్రం అదే మరో నాలుగు రోజులకు భారతదేశంలో విలీనమైంది. ఈ ప్రాంత ప్రజలు రాష్ట్ర విమోచనంతో పాటు అప్పటికి పదమూడు నెలల క్రితం వచ్చిన స్వరాజ్య సంబరాలను జరుపుకున్నారు.

- స్వామి

స్వయంసేవక్ నుంచి

అంతా అనుకున్నట్టే భారత 15వ ఉపరాష్ట్రపతిగా చంద్రపురమ్ పొన్నుసామి రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు. ఎన్‌డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్ ఇండీ కూటమి తరపున బరిలోకి దిగిన సుప్రీంకోర్టు మాజీ న్యాయ మూర్తి బి. సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. మొత్తం పోలైన ఓట్లు 767. ఎన్‌డీఏ అభ్యర్థికి 452 ఓట్లు, ఇండీ అభ్యర్థికి 300 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్(4), అకాలీదళ్(1), బీజేడీ(7), ఒక ఇండిపెండెంట్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. మొత్తంగా 14 మంది ఎంపీలు ఓటింగ్‌కు గైర్హాజరు కాగా, 15 మంది ఎంపీల ఓట్లు చెల్లకుండా పోయాయి.

సీపీ రాధాకృష్ణన్ అచ్చమైన స్వయంసేవక్. ఎలాంటి ఆర్భాటాలు, ఎలాంటి సంచలన ప్రకటనలు ఇవ్వకుండా తనదైన ధోరణిలో ప్రచారం చేసుకు న్నారు. అయితే జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అలా కాదు. ఆయన విమర్శలకు, ప్రతి విమర్శలకు కేంద్ర బిందు వయ్యారు. ఆయన కొన్ని ఆరోపణలు ఎదుర్కొనక తప్పలేదు. జవాబులు ఇవ్వక తప్పలేదు.

రాధాకృష్ణన్ అక్టోబర్ 20, 1957న తమిళనాడు లోని తిరుప్పూర్‌లో జన్మించారు. బిజినెస్ అడ్మిని స్ట్రేషన్‌లో బీఏ పట్టా పొందారు. ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్‌గా ప్రజా జీవితాన్ని ప్రారంభించారు. 1974లో భారతీయ జనసంఘ్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీలో సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1996లో తమిళనాడులో బీజేపీ కార్యదర్శిగా నియమితు లయ్యారు. 1998లో కోయంబత్తూరు నుంచి తొలిసారిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1999లో మరోసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఎంపీగా ఉన్న కాలంలో జౌళి రంగానికి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ప్రభుత్వ రంగ సంస్థలకు పార్లమెంటరీ కమిటీకి, ఆర్థికానికి సంప్రదింపుల కమిటీకి సభ్యుడిగా ఉన్నారు. 2004లో పార్లమెంట్ ప్రతినిధుల బృందంలో భాగంగా ఐక్యరాజ్యసమితిని సందర్శించారు. అక్కడి సర్వసభ్య సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. 2004-2007 మధ్య కాలంలో తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 93 రోజుల పాటు 19 కి.మీ.ల మేర రథయాత్రను చేపట్టారు. నదుల అనుసంధానం, ఉగ్రవాద నిర్మూలన, ఏకీకృత పౌరస్మృతి అమలు, అస్పృశ్యతానివారణ, మాదక ద్రవ్యాల మహమ్మారిపై పోరాటం లక్ష్యంగా రథ యాత్రను సాగించారు. 2020-2022 మధ్య కాలంలో కేరళ రాష్ట్రానికి బీజేపీ అఖిల భారత ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఫిబ్రవరి 18, 2023న జార్ఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. పదవీ బాధ్యతలు చేపట్టిన మొదటి నాలుగు నెలల కాలంలోనే రాష్ట్రంలో మొత్తం 24 జిల్లాల్లో పర్యటించారు. అదే సమయంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలను నిర్వర్తిం చారు. జూలై 31, 2024న మహారాష్ట్ర గవర్నర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. క్రీడల విషయానికి వస్తే.. ఆయన కాలేజీ చాంపియన్, రన్నర్. క్రికెట్, వాలీబాల్ క్రీడలను ఆస్వాదిస్తారు. రాధాకృష్ణన్‌కు విదేశీ పర్యటనలంటే ఎంతో మక్కువ. అమెరికా, యూకే, ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్, నార్వే, డెన్మార్క్, స్వీడన్, ఫిన్లాండ్, బెల్జియం, హాలండ్, టర్కీ చైనా, మలేసియా, సింగపూర్, తైవాన్, థాయ్ ల్యాండ్, ఈజిప్టు, యూఏయీ, బాంగ్లాదేశ్, ఇండోనేషియా, జపాన్ దేశాల్లో పర్యటించారు.

ఉప రాష్ట్రపతి ఎన్నికలలో సుదర్శన చక్రం ప్రయోగించానని ఇండీ, కొన్ని మీడియా సంస్థలు సంబరపడిన మాట నిజం. జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి పరిస్థితి చూసిన తరువాత చాలామందికి ఒక మాట గుర్తుకొచ్చి ఉంటుంది. 'వసుదేవుడంతటి వాడే గాడిద కాళ్లు పట్టుకున్నాడు' అన్న మాట అది. నక్సల్స్ సానుభూతి పరునిగా మొదటే జస్టిస్ సుదర్శనరెడ్డి మీద విమర్శ మొదలయింది. ఆ విమర్శకు అమిత్ షా ఇంకాస్త పదును తెచ్చారు సల్వా జుడుం వంటి నక్సల్ వ్యతిరేక ఉద్యమాన్ని అణచివేయడానికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి న్యాయ వ్యవస్థను ఉపయోగించుకున్నా రన్నది షా ఆరోపణ. నక్సల్ ఉద్యమం రెండు దశాబ్దాలు కొనసాగేందుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి దోహదపడ్డారని కేంద్ర హెూం మంత్రి బాహాటంగానే ఆరోపించారు.

సల్వాజుడుం స్థాపకుడు మహేంద్ర కర్మ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేనే. ఆయనను నక్సల్స్ చంపేశారు. మీ పుణ్యమా అంటూ సల్వాజుడుం (కోయసేన) రద్దయిన తరువాత కొన్ని వేలమందిని నక్సల్స్ చంపేశారు. ఇంకొన్ని వేల మంది గిరిజనులను నుంచి తరిమేశారు. ఇక్కడ మీరు ఎవరి హక్కులు కాపాడినట్టు? గతానికి బందీలు కారు కాబట్టి కాంగ్రెస్ వారు ఆ హింస, ప్రతిహింసలకు దారి తీసిన (అమిత్ షా దృష్టిలో) తీర్పరి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని బరిలోకి దింపింది. సల్వా జుడుం ద్వారా నక్సల్స్ హక్కులు కాపాడిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, తరువాత వారి నుంచి గిరిజనుల హక్కుల రక్షణ గురించి ఏమీ మాట్లాడలేదు.

తాను ఏ పార్టీ తరపున బరిలోకి దిగలేదని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పదే పదే చాటుకున్నారు. ఇది జనం నమ్మే వివరణ కాదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి స్థాయి వారికి తెలియదని అనుకోలేం. ఇంతకీ వసుదేవుడంతటి వాడు అన్నమాట ఎవరి విషయంలో? గడ్డి కుంభకోణం ద్వారా చిరకీర్తిని ఆర్జించిన లాలూ ప్రసాద్ విషయంలోనే. పార్ల మెంటరీ వ్యవస్థను సక్రమ మార్గానికి తెస్తానని ఢంకా బజాయించిన తరువాత కూడా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి లాలూను కలవడం నిజంగా అక్షరాలకు అందనంత సాహస చర్య. నేషనల్ హెరాల్డ్ కేసుతో పాటు, 'చిల్లర'మల్లర కేసులు మరో 20 కూడా ఎదుర్కొం టున్న రాహుల్ గాంధీ, దేశ పౌరురాలు కాకుండానే ఓటు హక్కు సంపాదించిన ఘటికురాలు సోనియా

గాంధీ వెంటరాగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ వేశారు. సెప్టెంబర్ 7వ తేదీన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి లాలూను కలుసుకున్నారు. లాలూ జీవితంలో రెండు విషయాలు సుస్పష్టం. ఒకటి, నిండా అవినీతి. రెండు, కుటుంబ పాలన పట్ల ఎనలేని విశ్వాసం. కాబట్టి జస్టిస్ గారు ఈ రెండు అంశాల మీద సంపూర్ణంగా రాజీ పడ్డారని భావించవచ్చునేమో! తామిద్దరూ సమావేశమైన సంగతిని లాలూ ప్రసాద్ అలా తొందరపడి సామాజిక మాధ్యమాలలో ప్రదర్శించి, తన మచ్చును కాస్త వెలిసేటట్టు చేసుకునే ప్రయత్నం చేస్తారని జస్టిస్ ఊహించలేదేమో మరి! లాలూ ఎంపీ కాదు. ఎమ్మెల్యే కాదు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకి ఈ ఎన్నికతో పనిలేదు. మరి ఎందుకు ఉపరాష్ట్రపతి అభ్యర్థి పనిగట్టుకుని పట్నాలో లాలూ ఇంటికి వెళ్లి కలిసినట్టు? ఉప రాష్ట్రపతిగా ఎన్నికైతే రాజ్యాంగ వ్యవస్థలకి ఇక ఇబ్బడి ముబ్బడిగా భద్రత అని

ఉపరాష్ట్రపతి దాకా..!

చెప్పుకున్న న్యాయమూర్తి అంతరాత్మకు ఈ పని సబబు అనే అనిపించిందా? నిజానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు తీసుకుని ఆయన తాను కుటుంబ పాలనకు, అవినీతికి వ్యతిరేకమేమీ కాదన్న సంగతిని వ్యక్తం చేశారు. అయితే వాటికి ఆయన అనుకూలమని ముమ్మాటికీ అనలేం.

సల్వా జుడుం మీద తాను తీర్పు ఇవ్వలేదని, అది సుప్రీంకోర్టు తీర్పు అని, హోం మంత్రి ఆ తీర్పును ప్రతిని క్షుణ్ణంగా చదివి ఉండవలసిందని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి హితవు పలికారు. కానీ దీనికి అమిత్ షా స్పందిస్తే, ఆ స్పందన ఇలా ఉండేదేమో కదా! అయ్యా! న్యాయమూర్తి గారు! మీరు కాంగ్రెస్ మద్దతుతో బరిలోకి దిగారు. ఈ దేశంలో అత్యవసర పరిస్థితిని రుద్దిన పార్టీ అదేనని మీకు గుర్తు చేయవలసి రావడం బాధగా ఉంది.



షాబానో కేసులో అవసరమైతే సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టి పార్లమెంట్ చేత చట్టం చేయిస్తాం అన్న పార్టీ నాయకుడు కూడా అందులో నుంచే ప్రధాని అయ్యాడు. అది కుటుంబ పాలనకు చిరునామా. ప్రధాని, కేంద్ర మంత్రిమండలి చేసిన తీర్మానాన్ని విలేకరుల సమావేశంలో పరపరా చింపేసిన వ్యక్తి ఇవాళ మీ ప్రధాన మద్దతుదారుడు. ఈ విషయాలేవీ మీరు పరిశీలించనట్టే ఉంది.

దేశంలో ఆర్టికల్ 356 ద్వారా 1950 నుంచి 134 పర్యాయాలు రాష్ట్రాల ప్రభుత్వాలను కూలిపోతే, అందులో సింహభాగం కాంగ్రెస్ నిర్వాకమేనన్న సంగతి మీరు సౌకర్యంగా మరచిపోయినట్టున్నారు! ఈ విస్మృతి భావ్యమా! అలా కూల్చేసిన తొలి ప్రభుత్వం మీ హృదయ సీమను అలంకరించే ఉండే కమ్యూనిస్టు పార్టీదే న్యాయమూర్తి గారు! అదే, ఈఎంఎస్ నంబూద్రి ప్రభుత్వం. కేరళలోనే కదా! ఆ పని చేసింది నెహ్రూయే. ఇంకొక జాబితా కూడా మీ ముందు ఉంచడం అవసరమనిపిస్తున్నది. ఆ 134 కూల్చివేతలలో రికార్డు సృష్టించిన వారెవరో మీకు తెలియదని చచ్చినా అనుకోలేం. ఇందిరాగాంధీయే. 356 అధికరణతో 50 సార్లు ప్రభుత్వాలను కూల్చిపారేశారు. అంతేనా, ప్రథమ ప్రధాని నెహ్రూ (7 ప్రభుత్వాలని), రాజీవ్‌గాంధీ (6 ప్రభుత్వాలు), పీవీ, మన్మోహన్‌సింగ్ (చెరి 11 ప్రభుత్వాలు) కూల్చినవారే. ఇప్పుడు ఆ పార్టీ సాయంతో మీరు రాజ్యాంగ వ్యవస్థలను రక్షించే పని, రాజ్యాంగాన్ని రక్షించే పని జమిలిగా చేపడతామంటే మీరు అమాయకత్వం నటిస్తున్నారేమోనని అనిపించక మానదు. ఇక డీఎంకే అన్న పార్టీ చేసే పనులన్నీ మీకు తెలియకుండా ఉండవు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ హిందూధర్మాన్ని కరోనాతో, డెంగీతో పోల్చాడు. ఆ పార్టీ మద్దతు తీసుకుంటున్నారు కాబట్టి ఆ విమర్శలు మీకు సమ్మతమనే కదా అర్థం! ఆ పార్టీ కుటుంబ పాలన గురించి మీరు ఏమీ అనలేరు కదా! బీసీ గణన, ఓబీసీ రాజ్యాధికారం గురించి నోటికి విశ్రాంతి లేకుండా మాట్లాడుతున్న రాహుల్ మిమ్మల్ని కాకుండా ఆ వర్గం వారిని ఎందుకు పోటీకి దింపలేదు? రాహుల్ మీరు మీ నినాదానికి కట్టుబడితే మంచిదని మీరైనా అన్నారా?

ఎన్నికలకు రెండు రోజుల ముందు, అంటే సెప్టెంబర్ 7న మీరు ఇచ్చిన పిలుపు వింటే, ఎందుకో 1969లో సరిగ్గా ఇందిరాగాంధీ ఇచ్చిన పిలుపునకు ప్రతిధ్వనిలా ఉంది. ఆత్మ ప్రబోధానుసారం ఓటు వేయండి అని కదా పిలుపునిచ్చారు! పార్టీ సమావేశంలో కూర్చుని నీలం సంజీవరెడ్డి పేరును ఖరారు చేసిన ఇందిర, తరువాత తన అభ్యర్థిగా వివి గిరిని నిలిపి ‘ఆత్మ ప్రబోధానుసారం ఓటు వేయండి’ అని పిలుపునిచ్చారు. ఇలాంటి పిలుపు మీ నోటి నుంచి కూడా రావడం సబబేనా? ఆ చర్యతో భారత ప్రజాస్వామ్యానికి వచ్చిన అపఖ్యాతిని మీరు విస్మరించడం చిత్రమే. విప్ ఉండదు కాబట్టి పార్టీలు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయమని చెప్పడం అనైతికమేనని మీ వంటి న్యాయ నిపుణులకు తెలియనిది కాదు. తెలుగువారైన జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయమని తెలంగాణ నుంచి తెలుగు ఎంపీలకు పిలుపు వెళ్లింది. దీనిని సమర్థిస్తారా? అంటే తెలుగు ప్రాంతాల నుంచి ఎన్నికైన బీజేపీ సభ్యుల ఓట్లు మీకు రుచికరమేనా? అన్నట్టు ఎన్నికలలో కాంగ్రెస్ ప్రదర్శించే చేతివాటం, తుచ్ఛపు వ్యూహాలు అన్నీ మీ గెలుపు కోసం కూడా ప్రదర్శించాలని ఉబలాట పడింది. క్రాస్ ఓటింగ్ మీద కాంగ్రెస్‌కు చాలా ఆశలు ఉన్నట్టు వార్తలు వచ్చాయి. ‘దేశభక్తి ఉంటే నాకు ఓటేయండి’ అని పిలుపునిచ్చిన మీరు ఇలాంటి కాంగ్రెస్ మార్కు ‘ఆశలు’ ఆత్మహత్యా సదృశమని ఎందుకు ప్రకటించలేదు? కాబట్టి మీ దేశభక్తి అంటే వేరే ఏదో! మరొక ప్రశ్న! దేశభక్తి అన్న పదం మీరు ఇంతకు ముందు ఉపయోగించిన సందర్భం ఏదైనా ఉందా? అమిత్ షా ప్రశ్నల వర్షం ఇకచాలు.

చట్టసభలను, రాజ్యాంగ వ్యవస్థలను చక్రమేసి రక్షిస్తానని చెప్పిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి విలేకరుల నుంచి రావలసిన కొన్ని ప్రశ్నలు కూడా రాలేదు. ఎందుకంటే, తమ వారిని ఇబ్బంది పెట్టడం మీడియాలో చాలామంది ఎర్ర భృత్యులకు నచ్చదు. మీకు ఆర్‌జేడీ, కాంగ్రెస్ ఓటు వేశారు. మమత పార్టీ కూడా. వీళ్లు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను దారుణంగా వ్యతిరేకిస్తున్నారు. దీని మీద మీ వైఖరి ఏమిటి? ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలన్న సరదా కాంగ్రెస్‌కి ఉంది. ఇది సబబేనా? ఈ ఆర్టికల్‌ను మోదీ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా రద్దు చేసిందన్న వాదనతో మీరు ఏకీభవిస్తారా? అన్నట్టు తలాక్ తలాక్ రద్దు చేయడం ముస్లిం మహిళలకు మంచిదా కాదా? ఇవన్నీ విలేకరులు మిమ్మల్ని అడిగి ఉంటే, మీరే ఏం చెప్పి ఉండేవారో కదా!



జస్టిస్ సుదర్శన్ రెడ్డి

ఏమైనా మీరు ఓడిపోవడం మీకే మేలు. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యులను నిలువరించడం మీ వంటి పెద్ద మనుషులకు సాధ్యంకాదన్నది రెండు వందల శాతం నిజం. న్యూయార్క్‌టైమ్స్‌లో వార్తల ఆధారంగానో, జార్జ్ సోరోస్ మనుషుల దుష్ప్రచారా లను పట్టుకునో దిగువ సభతో పాటు ఎగువ సభను కూడా స్తంభింప చేయడం ఇటీవలి కాంగ్రెస్ వ్యూహం. దానిని మీరు నివారించే అవకాశం లేదు. ఒక వేళ మిమ్మల్ని గెలుపించుకున్నా, సభలో మీ చేత మూడు చెరువులు నీళ్లు తాగించేది. ఓడిపోయి నందుకు అభినందనలు.

– జాగృతి డెస్క్

కొత్త ఉద్యోగం చూసుకో.. విలేకరిపై ట్రంప్ కస్సుబుస్సు

అత్త మీద కోపం దుత్త మీద చూపడం అంటే ఇదే..పాపం ఆ విలేకరికి ఏం తెలుసు? ప్రపంచం అంతా తనను పూచికపుల్ల కన్నా హీనంగా చూస్తున్నదనే బాధలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉన్నాడనే సంగతి. సుంకాలను పెంచినాకానీ భారత్ దారికి రావడంలేదనే ఉక్రోషం వైపు.. తనకు కొరకరాని కొయ్యలా తయారైన ప్రధాని నరేంద్ర మోదీని చైనాలో రష్యా అధ్యక్షుడు పుతిన్ తన కారులో ఎక్కించుకొని మరీ గంటల కొద్దీ మంతనాలు జరపడంపై కడుపు మంట ఒకవైపు.. తనలో రగులుతున్న అసూయాగ్నికి మరింత ఆజ్యం పోస్తున్నట్టుగా వీళ్లిద్దరితో కలిసి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇకఇకలు పకపకలు .. ఇవ్వన్నీ తెలుసుకోకుండా కనీసం అర్థం చేసుకోకుండా ఆ విలేకరి అమాయకంగా ఒక ప్రశ్న వేశాడు. పోనీ ఒక్కడే ఉన్నప్పుడు అడిగాడా అంటే అదీ లేదు. పక్కన పోలాండ్ అధ్యక్షుడు కరోల్ నారోకి ఉండగా అడిగాడు. ఆ విలేకరి కూడా పోలాండ్ నుంచి వచ్చినవాడే. అంటే పోలాండ్ అధ్యక్షుడే కావాలనే ఆ విలేకరితో అలాంటి ఒక ప్రశ్న అడిగించి ఉండవచ్చనే అనుమానం ట్రంప్ ఉన్న పరిస్థితిలో, ఆయన స్థానంలో ఆయన కాకుండా ఇంకెవరూ ఉన్నాకానీ తప్పకుండా వచ్చి తీరుతుంది. ఇంతకీ విలేకరి అడిగిన ప్రశ్న ఏమిటంటే.. ""అయ్యా.. అమెరికా అధ్యక్ష మహాశయా.. మీరు ఊ అంటే చాలు.. ఆ అంటే చాలు.. రష్యా మీద అదేపనిగా ఆవేశంతో ఎగిరెగిరిపడటమే తప్ప ఆంక్షలు విధించే ఆలోచన మీకేమైనా ఉందా?" అని. ఇంకేముంది.. ట్రంప్‌కు ఎక్కడ లేని ఆవేశం, ఆగ్రహం లోపల్నుంచి తన్నుకొచ్చాయి. "అసలు నీకేం తెలుసని? మేం తీసుకున్న చర్యలతో రష్యాకు వందలకోట్ల డాలర్ల నష్టం వచ్చింది. అంటే మేం చేతులు ముడుచుకొని కూర్చున్నట్టా? భారత్ రష్యా నుంచి చమురు కొంటే ఆ దేశం పెద్ద సమస్యల్లో చిక్కుకుంటుందని రెండు వారాల క్రితం చెప్పాను. ఇప్పుడదే జరుగుతోంది. ఇది నీకు తెలుసా? నేనేం చేయాలో నువ్వు నాకు చెప్పవద్దు. మేమింత చేసినప్పటికీ మేం ఎలాంటి చర్య తీసుకోవడం లేదని నువ్వు అంటున్నావు. అలాంటప్పుడు నువ్వు ఈ పని మానేసి కొత్త ఉద్యోగం చూసుకోవడం మంచిది" అని ట్రంప్ విరుచుకుపడ్డాడు.

భారత్‌కు మరిన్ని ఎస్-400 గగన రక్షణ వ్యవస్థలు

ఆపరేషన్ సిందూర్ సందర్భంగా మనదేశానికి రక్షాకవచంగా నిలిచి, పాకిస్తాన్ దాడులను తిప్పికొట్టిన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ సంఖ్యను పెంచుకునే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. ఇటీవల చైనాలో షాంఘై సహకార సంస్థ-ఎస్‌సీవో సదస్సు సందర్భంగా భారత్-రష్యా మధ్య చర్చల్లో ఎస్-400 ప్రధానాంశంగా నిలిచిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2018లోనే కేంద్రం ఐదు ఎస్-400 వ్యవస్థల కోసం రష్యాకు ఆర్డర్ పెట్టింది. అయితే గతేడాది రష్యాలో పర్యటించిన సందర్భంగా వీటి సరఫరాలో జాప్యాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లేవనెత్తారు. దీంతో 2026 నాటికి ఒకటి, 2027నాటికి ఇంకొకటి సరఫరా అవుతాయని రక్షణ వర్గాలు వెల్లడించాయి. మోదీ సర్కారు ఈ రెండింటికి తోడుగా తన ప్రతిష్ఠాత్మకమైన సుదర్శన్ చక్ర ప్రాజెక్టును అభివృద్ధి చేయడానికి ఉపకరించేలా మరిన్ని ఎస్-400 వ్యవస్థలను రష్యా నుంచి కొనుగోలు చేయాలనే ఆలోచనలో ఉంది. ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో తొలిసారిగా సుదర్శన్ చక్ర ప్రాజెక్టును ప్రకటించారు. సుదర్శన్ చక్ర యావత్ దేశానికి నిఘా, సైబర్ రక్షా కవచంగా నిలుస్తుందని తెలిపారు. రష్యా సైనిక-సాంకేతిక సహకార సమాఖ్య సర్వీసుల అధినేత డిమిత్రీ షుగయేవ్ మాట్లాడుతూ భారత్ మా ఎస్-400 వ్యవస్థను వినియోగిస్తోంది. ఈ రంగానికి సహకారాన్ని విస్తరించే సామర్థ్యం ఉంది. భారత్‌కు కొత్తగా వాటిని సరఫరా చేయాలనుకుంటున్నాం. బేరసారాలు జరుగుతున్నాయి అని తెలిపారు. ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్ ఆపరేషన్ సిందూర్ ఎస్-400ను గేమ్‌చేంజర్‌గా పేర్కొన్నారు.

ఎస్-400 ప్రత్యేకతలు

ఇది 600 కి.మీ.ల పరిధిలో శత్రువుల కార్యకలాపాలను పసిగడుతుంది. ఏకకాలంలో 100కుపైగా లక్ష్యాలను ట్రాక్ చేస్తుంది. 400 కి.మీ.లవరకు ఫైరింగ్ రేంజ్‌ను కలిగి ఉంటుంది. బాంబర్లు, ఫైటర్ జెట్‌లు, డ్రోన్లు, ముందస్తు హెచ్చరికలు చేసే ఎయిర్‌క్రాఫ్ట్‌లు, చివరకు బాలిస్టిక్ క్షిపణులను సైతం నామరూపాల్లేకుండా చేస్తుంది. భారత్ 2018లో పాకిస్తాన్, చైనా నుంచి ముప్పులను తిప్పికొట్టడానికి రష్యా నుంచి ఎస్-400ను కొనుగోలు చేసింది. అదే సమయంలో మరో 5 ఎస్-400 వ్యవస్థల కొనుగోలుకు రష్యాతో రూ.39 వేల కోట్ల ఒప్పందం కుదుర్చుకుంది. కానీ వాటి సరఫరాలో అనేక పర్యాయాలు జాప్యం చోటు చేసుకుంది. రష్యా 2021-2023 మధ్యకాలంలో మూడు ఎస్-400 వ్యవస్థలను సరఫరా చేసింది. ఈ మూడింటిని ఆదమ్‌పూర్(పంజాబ్), తూర్పు సెక్టార్,పశ్చిమ సెక్టార్‌లలో మోహరించారు. భారత్-రష్యా మధ్య సహకారానికి కీలకమైన సూచిగా ఎస్-400 నిలిచింది.

స్వదేశీ చిప్ విక్రమ్-32 ఆవిష్కారం

భారత్ సెమీకండక్టర్ రంగంలో అతి పెద్ద అడుగు వేసింది. సెప్టెంబర్ 2న ఢిల్లీలో సెమికాన్ ఇండియా సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ విక్రమ్-32 చిప్‌ను ఆవిష్కరించారు. ఐటీ శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తొలి చిప్‌ను ప్రధానికి బహూకరించారు. మోదీ చిప్‌ను డిజిటల్ వజ్రంతో పోల్చారు. విక్రమ్-32 చిప్‌ను భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ-ఇస్రో చండీగఢ్‌లోని ది సెమీకండక్టర్ లేబొరేటరీతో కలిసి రూపొందించింది. చిప్‌ను అత్యంత కఠినమైన పరిస్థితులను తట్టుకునేలా తయారు చేశారు. ఉష్ణోగ్రతకు సంబంధించి-55 డిగ్రీల నుంచి +125 డిగ్రీల సెల్సియస్ వరకు తట్టుకుంటుంది. చిప్ మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ వంటి దైనందిన జీవితంలో వినియోగించే పరికరాలకు ఉపకరించదు. అంతరిక్ష పరిశోధనలకు సంబంధించిన రాకెట్లు, ఉపగ్రహాలు, లాంచ్ వెహికల్, ఏవియానిక్స్‌లో మాత్రమే వినియోగిస్తారు. చిప్‌లోని 32 బిట్ ప్రాసెసర్ లాంచ్ వెహికల్‌లో నేవిగేషన్ నియంత్రణ, మిషన్ నిర్వహణ, స్ప్లిట్ సెకన్లను లెక్కకట్టడం వంటివి చేస్తుంది. రాకెట్ సరైన మార్గంలో ప్రయాణించడానికి ఇది చాలా కీలకం. అత్యంత కఠినంగా రోదసి వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని చిప్‌ను రూపొందించారు. విక్రమ్-32ను అంతరిక్షంలో పరీక్షించారు. పీఎస్‌ఎల్‌వీ-సీ60 ప్రాజెక్ట్‌లో వాడారు. ఆర్బిటర్ ఎక్స్‌పెరిమెంట్ మాడ్యూల్స్‌లోని మిషన్ మేనేజ్‌మెంట్ కంప్యూటర్‌లో వినియోగించారు.

సీఏఏ కటాఫ్ తేదీ పొడిగింపు

కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ పౌరసత్వ సవరణ యాక్టు-సీఏఏ కటాఫ్ తేదీని డిసెంబర్ 31, 2024కు పొడిగించింది. ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బాంగ్లాదేశ్ దేశాలలో మతపరమైన పీడనకు గురై డిసెంబర్ 31, 2024 నాటికి లేదా అంతకుముందు పాస్‌పోర్టు, తదితర డాక్యుమెంట్లు లేకుండా భారత్‌లోకి ప్రవేశించిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులు అలాంటి డాక్యుమెంట్లు కలిగి ఉండాలనే నియమం నుంచి మినహాయింపును పొందుతారు. ఈ కీలకమైన ఉత్తర్వును ఇటీవల అమలులోకి వచ్చిన 2025నాటి దేశాంతరాధివాసం, విదేశీయుల చట్టానికి లోబడి జారీ చేశారు. ఇది పెద్ద సంఖ్యలో భారత్‌కు వలస వచ్చినవారికి మరీ ముఖ్యంగా 2014 తర్వాత పాకిస్తాన్ నుంచి వచ్చిన హిందువులకు పెద్ద ఊరటను ఇస్తుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సీఏఏ గతేడాది నుంచి అమలులోకి వచ్చింది. తద్వారా డిసెంబర్ 31, 2014నాటికి లేదా అంతకుముందు భారత్ కు వలసవచ్చిన మతపీడనకు గురైన అల్పసంఖ్యాకవర్గీయులకు భారత పౌరసత్వం మంజూరవుతుందని వెల్లడించాయి.

సిద్ధరామయ్య రోగానికి రాష్ట్రపతి మందు..!

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు వైద్యానికి లొంగని ఓ రోగం ఉంది. అదేమిటంటే కర్ణాటకేతరులెవరైనా సరే, వారెంత గొప్పవారైనా సరే అలాంటివారు కర్ణాటక వచ్చినపుడు ఆయన మొదటగా అడిగే ప్రశ్న "మీకు కన్నడ భాష మాట్లాడటం వచ్చునా?" అని. ఇదే ప్రశ్నను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వేశారు. ఆమె ఇచ్చిన సమాధానానికి మరింక మాట్లాడలేకపోవడం ఆయన వంతుగా మారింది. రాష్ట్రపతి ముర్ము ఇటీవల మైసూరులో జరిగిన ఒక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చారు. అదే కార్యక్రమానికి సిద్ధరామయ్య కూడా హాజరయ్యారు. ఆయన ఈ సందర్భంగా ప్రసంగించడానికి ముందు రాష్ట్రపతి వైపు తిరిగి "మీకు కన్నడ భాష తెలుసునా? నేనిప్పుడు కన్నడ భాషలో మాట్లాడుతాను" అని అన్నారు.

ద్రౌపది ముర్ము ఆయన మాటలకు బదులిస్తున్నట్టుగా "గౌరవనీయులైన ముఖ్యమంత్రికి నేను ఇప్పుడు ఒక మాట చెప్పదలుచుకున్నాను. అదేమిటంటే.. నా మాతృభాష కన్నడ భాష కాకపోయినప్పటికీ నా దేశంలో అన్ని భాషలను, సంస్కృతులను, సంప్రదాయాలను హృదయంలో పదిలపరుచుకుంటాను. నాకు ప్రతీ భాషపైన, ప్రతీ సంస్కృతిపైన, ప్రతీ సంప్రదాయం పైన అపారమైన గౌరవం ఉంది" అని అన్నారు. అక్కడితో ఆగకుండా.. "ప్రతి ఒక్కరు వారి భాషను బతికించుకోవాలి. సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ అదే దిశలో ముందుకు సాగాలని నేను ఆకాంక్షిస్తున్నాను. కన్నడ భాషను కొద్ది కొద్దిగా నేర్చుకోవడానికి నా వంతు ప్రయత్నాన్ని తప్పకుండా చేస్తాను" అని సభికుల కరతాళధ్వనుల మధ్య రాష్ట్రపతి అన్నారు.

ఇతడి పిచ్చి పరాకాష్టకు..!

గుంథర్

అదేమిటో! ప్రతి అంతర్జాతీయ స్థాయి విధ్వంసకుడి కన్ను భారత్ మీదే ఇప్పుడు. భారత్ అంగుళం కూడా అభివృద్ధి చెందకూడదని తల్లకిందులుగా తపస్సు చేస్తున్న వాళ్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అయితే వాళ్ల పిచ్చి వాగుడుతో వ్యక్తం కాని కొన్ని వాస్తవాలు మాట్లాడే అవకాశం వస్తున్నది. గుంథర్ ఫెలింగర్–జాన్ ఈ పేరు బాగా గుర్తు పెట్టుకోండి. ఇతడు ఆస్ట్రేలియాలో ఆర్థికవేత్త అట. నాటో కూటమిలో ఎన్‌లార్జ్‌మెంట్ కమిటీకి స్వయం ప్రకటిత అధిపతి. అంటే భారతదేశంలో చాలా మంది మేధావుల వలెనన్నమాట. వాళ్లని ఎవరూ మేధావి అనరు. మేధావి, సామాజిక కార్యకర్త, సాంస్కృతిక ఉద్యమకారుడు ఇలా–వాళ్లని వాళ్లే సత్కరించుకుంటారు. భారత్‌ను విచ్ఛిన్నం చేసి 'ఒకనాటి భారత్' అన్న పేరుతో పిలవాలని పిచ్చిగా ఆరాటపడుతున్నాడు. ఒక భౌగోళిక పటం గీయించి, అందులో ఖలిస్తాన్‌కి స్థానం ఇచ్చాడు. కొన్ని భారత భూభాగాలు అటు పాకిస్తాన్‌కీ, ఇటు బాంగ్లాదేశ్‌కీ, ఇంకొన్ని నేపాల్‌కీ కాంగ్రెస్ వాళ్లకి మించి ఉదారంగా ధారాదత్తం చేశాడు కూడా. ఇతడి పిచ్చికి పరాకాష్ట అనండి! లేదంటే వాస్తవిక దృష్టి అని కూడా అంచనాకు రండి! 'అందుకే (అనగా తనదైన విచ్ఛిన్న భారత్ కల నెరవేరడానికీ, 'ఒకనాటి భారత్' పేరు స్థిర పడేందుకూ) మనం ప్రధానిగా రాహుల్ గాంధీకి మద్దతు పలుకుదాం' అంటున్నాడు. రేపటి ఎన్నికలలో ఇదే నినాదంతో గుంథర్ గ్రూపంతా ప్రచారం చేస్తే ఎలా ఉంటుంది?

గుంథర్ పెట్టిన ఒక సందేశంలో ఇలా ఉంది. భారత్ ముక్కలై, ఒకనాటి భారత్‌గా మిగిలిపోవాలి. నరేంద్ర మోదీ రష్యా మనిషి. ఖలిస్తాన్ స్వాతంత్ర్యం కోసం అందుకు ఆశించే వ్యక్తి మిత్రుడుగా రావాలని కోరుకుందాం. దీనితో పాటే ఒక భౌగోళిక పటం కూడా పెట్టాడు. తరువాత దీనిని భారత్‌లో నిషేధించారు.

మహిళా జర్నలిస్ట్ మీద కాంగ్రెస్ ఎమ్మెల్యే విసుర్లు

కొందరు కాంగ్రెస్ నేతలు మాటలు వింటే 'కడుపు' పండవలసిందే. అయితే అవన్నీ రాజకీయ వివాదాలకీ, చీవాట్లకీ కారణమవుతూ ఉంటాయి. కర్ణాటక రాష్ట్రంలోనే సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, హలియాల్ ఎమ్మెల్యే ఆర్‌వీ దేశ్‌పాండే మాటలు చూడండి! ఆయన మీడియా సమావేశం ఒకటి నిర్వహించారు. ఒక మహిళా జర్నలిస్ట్ లేచి, జొయిదా తాలూకాలో ఆసుపత్రి లేదండి అని ఫిర్యాదు చేశారు. అందుకు దేశ్‌పాండే ఒక చిరునవ్వు వెలయించారు. ఆపై ఇలా చీవాట్లు తినక తప్పని వ్యాఖ్యలు వినిపించారు. 'నీ ప్రసవం వరకు రానీ! నీవు ప్రసవించే సమయానికి మేం ఆసుపత్రిని తప్పక ఇస్తాం' అన్నారు. కాంగ్రెస్ నేత ఈ మాట అనడం తరువాయి, మరుక్షణం సామాజిక మాధ్యమాలలో మార్మోగిపోయింది.

పాపం, ఆ మహిళా జర్నలిస్ట్ పేరు రాధా హిరంగౌదర్. కాంగ్రెస్ నేత మాటలకి షాక్ కొట్టినట్టయింది. ఆ ప్రాంతంలో ఆసుపత్రి లేకపోవడం వల్ల, ప్రధానంగా గర్భిణులు ఇక్కట్లకు గురి అవుతున్న కారణంగాను ఆ ప్రశ్న అడిగాను. ఆ ఎమ్మెల్యే ఇలా స్పందిస్తారని అనుకోలేదు అని తెప్పరిల్లిన తరువాత అన్నారామె. ఈమె గ్యారంటీ న్యూస్ ప్రధాన సంపాదకురాలు కూడాను. ఆయన నోటి నుంచి వచ్చిన అర్థంపర్థంలేని ఆ సమాధానం విన్నాక నాకు మతిపోయినంత పనైంది అని కూడా చెప్పారామె. తనకూ, తన చానెల్‌కూ ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని అడిగానని కానీ ఎమ్మెల్యే స్పందించలేదని అన్నారామె. ఇలా మాట్లాడుతున్నారేమిటని అడిగితే, మళ్లీ అదే మాట అన్నాడాయన.

దీనితో మహిళా హక్కుల సంఘాలు, ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఇది కాంగ్రెస్ నాయకుల చౌకబారు మనస్తత్వానికీ, నైతిక దివాలాకోరుతనానికీ నిదర్శమని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి విజయ్ ప్రసాద్ విమర్శించారు. ఎమ్మెల్యే ఇలా మాట్లాడడం జర్నలిస్టులకే కాక, మహిళలకు కూడా అవమానకరమని మహిళా సంఘాలు విమర్శించాయి. వివరణ ఇచ్చి లేదా క్షమాపణ చెప్పి ఈ వివాదానికి ఇంతటితో ముగించకపోతే, అసలే కష్టాలలో ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ మరిన్ని చిక్కులలో పడడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఉత్తర కన్నడ జిల్లాలోని జొయిదా తాలూకాలో ఆసుపత్రి లేక చిరకాలంగా జనం ఆందోళన చేస్తున్నారు. తమ ప్రాంతంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి కావాలని అడుగుతున్నారు. ఆ విషయం ఆ మహిళా జర్నలిస్ట్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తే ఇంత మర్యాదగా స్పందించాడు.

చాలామంది ఈ భౌగోళిక పటాన్ని బూతులు తిట్టారు. శివసేన (ఉద్దవ్ ఠాక్రే వర్గం) సభ్యురాలు, రాజ్యసభ సభ్యురాలు ప్రియాంకా త్రివేది అయితే ఇదే పిచ్చి అన్నారు.

ఈ నేపథ్యంలో గుంథర్ 2023లో ప్రపంచం మీదకు వదిలిపెట్టిన పాత సందేశం కూడా ఎవరో బయటపెట్టారు. అందులో భారత్ తరువాతి ప్రధాని ఎవరనుకుంటున్నారు, రాహుల్! అన్నదే దాని సారాంశం. కానీ 2024 ఎన్నికలలో నరేంద్ర మోదీయే మళ్లీ ప్రధాని అయ్యారు. చైనాకూ, రష్యాకూ తాను మిత్రుడినని మోదీ చెప్పడం కూడా గుంథర్‌కి నచ్చలేదు. కొందరు సందిట్లో సడేమియాలు గుంథర్ సందేశ సారం సారా మత్తులా తగిలింది. చాలా ఆనందించారు. నిజం నిజం..రాహుల్ ప్రధాని అవుతారు. గుంథర్ జోస్యం నిజమగుట తథ్యం, తథ్యం అన్నారు. కొందరికి కడుపు మండిపోయింది. జై శంకర్ గారూ! వీడికి మొహం పగిలేటట్టు జవాబు ఇవ్వండి అని మొరపెట్టుకున్నారు.

తెలుసుకోండి.. వరదలూ, తుపానులూ అల్లా దయ..

'ఇదంతా దైవ సంకల్పం. కాబట్టి ఈ పెను తుపానులనీ, వరదలనీ తిట్టుకోకూడదు. అయినా నదీతీరాలలో అడ్డూఅదుపూ లేకుండా ఇలా కట్టడాలు నిర్మిస్తే ఏమౌ తుంది?' అన్నాడు పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్. పైగా ఈ మాటలు ఆ దేశ నేషనల్ అసెంబ్లీలో విని పించారు. దీనితో రాజకీయ తుపాను మొద లయింది. వర్షాలంటే ఏమనుకున్నారు? దేవుడి దీవెన అని కూడా భాష్యం చెప్పారు. అయితే దురదృష్టవశాత్తు అవి వేరే రూపంలో ఉన్నాయంతే అని అన్నారు. డ్యామ్‌లు కట్టి ఉంటే ఈ వరద బాధ ఉండేది కాదు. అలా అని ఐదేళ్ల నుంచి పదేళ్లు పట్టే డ్యామ్‌ల నిర్మాణం పాకిస్తాన్ ఇప్పుడు చేపట్టే స్థితిలో లేదు. కాబట్టి గ్రామ స్థాయిలోనే ప్రజలే చిన్న చిన్న డ్యాములు నిర్మించుకోవాలని ఉచిత సలహా పడేశారు. ప్రస్తుతం వర్షాలు, చీనాబ్, రావి, సట్లేజ్ నదులు పొంగడంతో వెల్లువెత్తిన వరదల కారణంగా లాహోర్, గుజ్రన్‌వాలా వంటి ప్రాంతాలు అతలాకుతలమైపోతున్నాయి. దీని గురించి భారత్ ముందస్తు హెచ్చరిక చేసి అనేక మంది ప్రాణాలను కాపాడింది కూడా. పాకిస్తాన్ రక్షణ మంత్రి అక్కడితో ఆగలేదు. టీవీ చానల్‌లో చర్చలో పాల్గొంటూ కూడా ఇదే విషయం ఇంకాస్త పిచ్చి జోడించి చెప్పారు. భగవంతుడు (అనగా అల్లా) ఇచ్చిన ఈ నీటిని కంటేనియర్లలో నిల్వ చేసుకోవాలే తప్ప, ధర్నాలూ, నిరసనలూ అంటూ రోడ్లెక్కడం ఎందుకు అని కూడా ప్రశ్నించారు. వరదలలో చిక్కుకుని దేశ ప్రజలు తిండీతిప్పలూ లేకుండా అలమటిస్తుంటే ఈ మంత్రేమిటి? ఈ మాటలేమిటి? అంటూ దేశ ప్రజలు సరే, నెటిజన్లు కూడా చీదరించుకుంటున్నారు.

ఆయువు.. ఆరునెలలే?!

మావోయిస్టులకు, నక్సలిజానికి ఆయువు తీరే రోజు ఎంతో దూరంలో లేదు. మార్చి, 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని సమూలంగా నిర్మూలిస్తామని హోమ్ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. భద్రతా బలగాలు సైతం మంత్రి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి శాయశక్తులా కృషి చేస్తున్నాయి. మరోవైపు మావోయిస్టులు సైతం కొత్తవారిని నియమించుకోవడానికి నానాతంటాలు పడుతున్నారు. సిద్ధాంతం, భావజాలానికి ఏనాడో కాలం చెల్లింది. అందుకని బెదిరింపులకు పాల్పడి లేదా డబ్బు ఆశ చూపించి కొత్తవారిని నియమించుకుంటున్నారు. అంటే ఆ కొత్తగా నియమితులయ్యేవారు అంతంత మాత్రంగా ఇచ్చే డబ్బులు కోసం ప్రాణాల మీద ఆశలు ఒదులుకోవాలి. సిద్ధాంతం, భావజాలాల గురించి వారికి చెప్పే నాథుడే లేడు. వీరంతా రిమోట్ కంట్రోల్డ్ మావోయిస్టులు. కమాండర్లు చెప్పినట్టుగా చేసుకుంటూ పోవడమే వీరి పని. వయసుడిగిన తొలి తరం నేతలే తప్ప, కొత్త తరం నేతలను తయారు చేయడానికి మార్గాలు పూర్తిగా మూసుకుపోయాయి. ఆ కారణంగానే భద్రతా బలగాలు దాడులు ముమ్మరం చేయగానే, డబ్బుకు ఆశపడి మావోయిస్టులతో చేరినవారు ప్రాణభయంతో పోలీసులకు లొంగిపోతున్నారు. వారు చూపించే జీవనోపాధితో బతుకును సాఫీగా వెళ్లదీస్తున్నారు. దీంతో నక్సలిజాన్ని క్రమక్రమంగా నిర్మూలించడంలో భద్రతా బలగాల పని సులువుగా మారిపోతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు కూడా కొత్తగా మావోయిస్టుల నియమాకాలు తగ్గిపోవడానికి కారణమవుతున్నాయి. ప్రభుత్వాలు మావోయిస్టుల ఆర్థిక మూలాలను దెబ్బ తీయడంతో వారు తమ కార్యకలాపాలను సాగించడానికి కిందామీదాపడు తున్నారు. మరోవైపు మావోయిస్టు అగ్రనేతలు చనిపోవడం లేదా అరెస్టు కావడం జరుగు తుండటంతో పెద్ద దిక్కు లేని అనాథగా నక్సలిజమ్ మిగిలిపోయింది. 2023లో మావోయిస్టు అగ్రనేత కటకం సుదర్శన్ అనారోగ్యంతో మరణించాడు. 2021లో మరో నేత కిషన్ దా (అసలు పేరు ప్రశాంత్ బోస్) అరెస్టయ్యాడు. పార్టీ నుంచి బహిష్కృతుడైన కోబడ్ గాంధీ 2019లో అరెస్టయ్యాడు. పటిష్టమైన సైద్ధాంతిక భావజాలాన్ని పుణికిపుచ్చుకున్న మావోయిస్టు అగ్రనేతల్లో కీలకమైన చెరుకూరి రాజ్‌కుమార్, మల్లోజుల కోటేశ్వర్ రావు అలియాస్ కిషన్‌జీ, నారాయణ్ సన్యాల్, రామన్న, యాపా నారాయణ్, బస్వేందర్ సింగ్, అక్కిరాజు రాజగోపాల్, లక్ముమల్ల రాజిరెడ్డి, దీపక్ మిలింద్ తెల్‌తుంబ్డే, రామచంద్రారెడ్డి మరణించారు. అదే కోవకు చెందిన షీలా మరాండి, శాంతా దీపక్ రావు, మిథిలేష్ మెహతా, అరుణ్ భట్టాచార్జీ, బాలరాజు, విజయ్ కృష్ణమూర్తి అరెస్టయ్యారు. దీంతో మావోయిస్టుల కార్యకలాపాలకు గుండెకాయ లాంటి పొలిట్ బ్యూరో చాలావరకు తుడిచిపెట్టుకుపోయింది. ★

కథ

"ఇదిగో ...మిమ్మల్నే...!"

"ఏమిటే గొడవ!"

"పిలిస్తేనే గొడవంటే ఎలా?"

"ఈ టైం లో ఎందుకు పిలిచిచావని?"

"వస్తేగా తెలిసేది"

"వస్తున్నా... వస్తున్నా!"

"త్వరగా!"

"సరే...సరే..నన్ను కంగారు పెట్టకు మరి!"

"కంగారెందుకు"

"ఎందుకంటే ఏం చెప్పేది? లుంగీయేనా బిగించుకోవాలా వద్దా?"

"మీ ఇష్టం"

"అందుకే...."

"ఏమిటి...అందుకే"

"నీకు చెలగాటం........"

"చాల్లే సంబడం...రండి త్వరగా..."

ఇదిగో ఈ పళ్లెం తీసుకోండి"

"ఏం పళ్లమే ...ఈ బట్టలేమిటి......నా కోసం కొన్నావా?"

".... దసరా పండుగేమన్నా కదూ...... అల్లుడుగారు ఇప్పుడు వస్తారు. ఇంకో మూడు గంటల్లో తిరుగు ప్రయాణమట. ఈ బట్టలు ఆయనకివ్వండి. నేను అమ్మాయికి ఈ బట్టలు ఇస్తాను" అంటూ మరో పళ్లాన్ని తన చేతుల్లోకి తీసుకుంది కుసుమ.

"ఈ రోజు వాళ్ల పెళ్లి రోజు కదండీ....! అతనికి సెలవు లేదట. ఆఫీసు పని పూర్తి చేసుకుని బయలుదేరాడట. మళ్లీ రేపు ఉదయం వెళ్లాలట. ఈ రోజు అర్ధరాత్రికే తిరిగి బయలుదేరుతాడట ...అదీ విషయం" చెప్పింది కుసుమ.

"ఏమే! నాకు తెలీక అడుగుతాను... పెళ్లిరోజు బానే వుంది. బట్టలు పెడదాం. బానే వుంది. అతను ఈ రాత్రివేళ ఇంత పొద్దుపోయిన తరువాత రావటం ఏమిటి? తినే వేళా కాదు, పడుకునేవేళా కాదు. ఈలోగా ఆఫీసు వాళ్లు ఫోన్ చేయరని గ్యారంటీ ఏమీలేదు. ఎందుకు వచ్చినట్టు,ఎందుకు వెళుతున్నట్టు! "

"చాల్లే....అతను చేసేది మీలాగా కోర్టులో టైపిస్టు ఉద్యోగం కాదు. సాఫ్ట్‌వేర్ ....ఆ ఉద్యోగాలంతే. వాళ్లకు తీరికే వుండదు."

"సరే నా ఉద్యోగం సంగతి ఎందుకులే..... ఆ రోజులు మళ్లీ వస్తాయా!"

"అవునవును......పెళ్లిరోజంటూ, రోజూకంటే ఓ అరగంట ముందే బయలుదేరి సైకిల్ బెల్ మోగించుకుంటూ ఇంటికి వచ్చేవాళ్లు. పంచభక్ష్య పరమాన్నాలతో సుష్టుగా భోజనం చేసి, ఓ అరగంట కునుకు తీసి ఆనక తీరిగ్గా సైకిలెక్కి ఆఫీసుకు వెళ్లేవాళ్లు. అడిగేవారా పెట్టేవారా? మనం ఆడింది ఆట, పాడింది పాట." అని కొంటెగా భర్త వైపు చూసింది.

....

"మళ్లీ సాయంత్రం అయిదో గంట కల్లా ఆగమేఘాలమీద ఇంటికి వచ్చి స్నానం చేసి టింగు రంగడిలా తయారయ్యి, నన్ను తొందరపెట్టి ఏ సినిమాకో ,పార్కుకో తీసుకు వెళ్ళేవాళ్లు" అంటూ సిగ్గుపడిపోయింది కుసుమ.

"ఆ తరువాత విషయం కూడా చెప్పు మరి" అంటూ భార్య కళ్లల్లోకి చూశాడు శేఖరం.

"ఇంకా నయం. ఇప్పుడు ఆ ముచ్చట్లు చెప్పుకుంటూ కూర్చుంటే అల్లుడుగారు వచ్చేస్తారు. పదండి ముందు హాల్లోకి" అని నెట్టినంత పని చేసింది.

"ఆ నాటి ఆ హాయీ కల కాదోయి నిజమోయి.." నిద్రమత్తు వదిలిన శేఖరం కూనిరాగం తీసుకుంటూ హాల్లోకొచ్చి సోఫాలో కూర్చున్నాడు. చేతిలో వున్న బట్టల పళ్లాన్ని టీపాయ్ మీద పెట్టాడు.

"అబ్బా....ఆపండి స్వామీ మీ కూని రాగాలు... అమ్మాయికి వినబడితే బాగుండదు" బుంగమూతితో అన్నది కుసుమ.

"ముక్కు మీద కోపం నీ ముఖానికే అందం. నీ బుంగమూతి చందం ....." ఊరుకోలేదు శేఖరం

"మీకు దండం పెడతా, పాటలు ఆపండి" అంటూ రెండు చేతులూ జోడించింది కుసుమ.

సరిగ్గా అప్పుడే కారు హారన్ మోగింది. కూతురు సరళ గదిలో నుంచి బయటకు వచ్చి, వడివడిగా వరండాలోకి నడిచింది. అలసిన ముఖంతో బలవంతపు నవ్వుతో దర్శనం ఇచ్చాడు అల్లుడు కుమార్. ఉభయకుశలోపరి అయింది. మంచినీళ్లు తాగినట్లు నటించాడు. శేఖరం దంపతులు ఇచ్చిన బట్టలు అందుకుని, నాలుగు అక్షింతలు నెత్తిన చల్లించుకుని వడివడిగా కూతురు, అల్లుడూ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. కుసుమ దంపతులు వాళ్ల గదిలోకి వెళ్లి లైటు వేసుకుని కూర్చున్నారు.

"అదిగాదే ... ఈ ఉన్న రెండు,మూడు గంటలైనా కాస్తంత సరసం, అచ్చటా ముచ్చటా ఏమన్నా వుంటయ్యా. అంత టైము వుండదా?" అడిగాడు భార్యే కదా అని.

కస్సుమని లేచింది కుసుమ. "మీరేం మాట్లాడు తున్నారో అర్థమవుతుందా? అరవై దాటినా ఇలాంటి సందేహాలు, మీరూను.... తినటానికి, పడుకోవటానికే వాళ్లకి టైము ఉండటం లేదంటుంటే.." చిరుకోపం ప్రదర్శించింది కుసుమ.

"అలాంటి ఉద్యోగాలు చేయకపోతే ఏం పోయిందట!" అన్నాడు శేఖరం.

"ఇదిగో మీరు ఈ చాదస్తపు మాటలు మాట్లాడటం ఆపేయండి బాగుంటుంది"

"చాదస్తం మాటలా! అన్నం తినటానికి టైము లేకుండా, మొగుడూపెళ్లాలు ముద్దుముచ్చట్లు తీర్చుకోవటానికి టైము లేకుండా, పిల్లల్ని కనటానికి అసలే టైము లేకుండా చేసే ఉద్యోగాలు ఉండటం కన్నా ఊడటమే నయం. కడుపు నిండా తిండి,, కంటి నిండా నిద్ర పోనీయని ఉద్యోగాలు ఎందుకు... ఊళ్లో వాళ్లకి చెప్పుకోవటానికీ,

భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది

మళ్లిన వలపు

పెనుమాక నాగేశ్వరరావు

లక్షలకి లక్షలు బ్యాంకుల్లో దాచుకోవటానికీ తప్ప ఎవరికైనా సుఖము, సంతోషము ఉంటున్నాయా?" ఒకింత ఆవేదనతోనే అని వెనక్కి వాలి పడుకున్నాడు.

"మీకు తెలీదులెండీ.... మీ రోజుల్లో లాగానే కుదరాలంటే కాదు. ఇప్పటి కాలంలో ఉద్యోగాలు ఇలానే ఉంటున్నై. వాళ్ల తిప్పలు వాళ్లవి!"

"గంతకు తగ్గ బొంతలు" గొణిగినట్లుగా అన్నాడు

"గంతలూ లేవు, బొంతలూ లేవు. వాళ్లు వస్తారు, మీరు మాట్లాడకండి" హెచ్చరించింది కుసుమ.

కిక్కురుమనకుండా కూర్చున్నాడు కాసేపు.

"అవునే... మన మొదటి మేరేజ్ డే కి మీ నాన్న నాకు పేంటు, షర్టు కాకుండా, పంచెలచాపు పెట్టాడేంటే!" బ్రహ్మానందం స్టైల్లో అడిగాడు శేఖరం.

"అందుకేగా ఆరోజు నానా యాగీ చేశారు"

"నేనా! నానా యాగీ చేశానా! ఏవే. కావాలని అంటున్నావ్ కదూ! నాకు గుర్తున్నంత వరకూ ఆ రోజు పాపం ఎందుకు ఈ పిచ్చి మాస్టారు ఇవన్నీ పెట్టటం అనుకుని ఆ తర్వాత ఆయన మనింటికి వచ్చినప్పుడు ఉగాది పండుగ వంకన మళ్లీ ఆ పంచెల చాపు ఆయనకే పెట్టినట్లు గుర్తు నాకు" అన్నాడు శేఖరం.

"అవునండి.. మా నాన్న ఆ విషయం ఎన్ని సార్లు అనుకున్నారో....మిమ్మల్ని ఎంత పొగుడుకున్నారో!" సంతోషం తో పొంగిపోతూ అన్నది కుసుమ.

"ఓ.కే..ఓ.కే ..నువ్విప్పుడు ఆ విషయం పొడిగించకు...ఎలాంటి రోజులోయ్ అవి!" అంటూ కుసుమ భుజం మీద ఆప్యాయంగా చేయి వేశాడు శేఖరం.

"మమ్మీ... ఆయన వెళుతున్నారు" కూతురి పిలుపుకి ఇద్దరూ గదిలోంచి బయటకు వచ్చారు

"వెళ్లొస్తా మామయ్యగారూ!" అంటూనే హడావిడిగా బయటకు నడిచాడు అతగాడు. అంతలోనే ఫోన్ మోగనే మోగింది. ఓ చేతిలో బ్యాగు, మరో చేతిలో సెల్లు, కళ్లతోనే భార్యకు వీడ్కోలు చెప్పి కారెక్కాడు అల్లుడు. కారు గేటు దాటంగానే లోపలికి నడిచింది సరళ.

"అది కాదమ్మా...కనీసం ఈ ఒక్క పూటైనా ఉండి వెళితే బాగుండేది కదా అల్లుడుగారు" అన్నాడు శేఖరం.

"రేపు ఉదయాన్నే జి.యం.తో మీటింగ్ ఉందట డాడీ. లేకపోతే ఉండేవాళ్లే" సమాధానం చెబుతుండ గానే ఫోన్ వచ్చింది ఆమెకు. బహుశా అల్లుడు గారి దగ్గరినుంచే అయివుంటుంది అనుకుంటూ కుసుమ వెనుకాలే తమ గదిలోకి నడిచాడు మవునంగా శేఖరం.

"ఇష్!" అంటూ తన నోటిమీద వేలేసుకున్నది కుసుమ. "నువ్వు ఏమైనా అనుగాని, మనసులో మాట చెబుతున్నా కుసుమా... ఈ కాలం పిల్లలకి సరసం లేదు, శృంగారం లేదు, మాటల్లేవు, పాటల్లేవు, పలవరింతలు, పులకరింతలు, పలకరింపులూ లేవు. లేపు. టాపులు, డెస్కు టాపులు, స్మార్ట్‌ఫోన్లు, వర్క్ ఫ్రమ్ హోములు, ఇంక్రిమెంట్లు, బెటర్మెంట్లు. ఏ వయసుకా ముచ్చట అన్నది మర్చిపోతున్నారు. యాంత్రిక జీవితాలయిపోయినై పాపం"

మంచం మీద పడుకున్న కుసుమ గోడ గడియారం వంక చూసింది. 'అబ్బో రెండున్నారా!' అనుకుని నిద్రకుపక్రమించబోయింది.

తలుపు గడియ వేసి బెడ్ లైటు ఆపేసి ట్యూబ్ లైటు ఆన్ చేశాడు

"ఇదేం చోద్యం! బెడ్ లాంప్ ఆపి పెద్ద లైటు వేసారూ!" కళ్లు చిట్లించుకుంటూ అడిగింది

"ఏంలేదోయ్... ఓ సారి నీ ముఖం చూడాలనిపించీ..."

"చూసింది చాలు! ఆ లైటు తీసేసి పడుకోండి"

పెద్దగా నవ్వాడు శేఖరం.

విస్తుపోయి చూసింది కుసుమ. "ఏమైందండీ అలా నవ్వుతున్నారు?"

"నువ్వు అలా అనగానే నాకో జోక్ గుర్తుకు వచ్చింది. వింటే నువ్వూ నవ్వాపుకోలేవు.

"ఇప్పుడే నవ్వాలా?"

అదే మరి.. ముందు విను.... మనం ఇప్పుడు మాట్లాడుకుంటున్న బల్బు కనిపెట్టింది ఎవరో గుర్తుందా?"

పూర్తిగా గుర్తు లేదుగాని....ఎడిసన్ అని గుర్తు

"అబ్బో...నీ జ్ఞాపక శక్తి గొప్పది. సరే ...అసలు విషయం ఏమిటంటే ఆ ఎడిసన్ గారు కొన్ని నెలలు కాదు సంవత్సరాలు పరిశోధనలు చేసి చేసి అలసి సొలసి చివరికి ఈ బల్బు కనిపెట్టాడుట. మన అదృష్టమో ఆయన అదృష్టమో ఆ బల్బు కూడా ఇలాగే అర్ధరాత్రి ఏ రెండుకో రెండున్నరకో వెలిగిందట మొదటిసారి. ఆ ఆనందం పట్టలేక ఉబ్బితబ్బిబ్బవుతూ భార్యని తట్టి లేపాడట ఎడిసన్ మహానుభావుడు. అబ్బా వెలిగితే వెలిగింది ఆర్పేసి పడుకోండి, నాకు నిద్ర వస్తున్నది అనేసి పక్కకు తిరిగి పడుకుందట ఆ ఇల్లాలు. ఆమె కూడా నీలానే చాలా అందగత్తెట."

అని భార్య కళ్లల్లోకి చూశాడు కొంచం బిడియంగా వచ్చే నవ్వుని బిగపట్టుకుంటూ పడుకుంది కుసుమ.

"ప్రతి పురుషుడి విజయం వెనుకా ఓ స్త్రీ వుంటుంది అంటారు ఇదేనా?" అడిగాడు.

పగలబడి నవ్వింది కుసుమ. నవ్వే అందాన్ని నాజూకుగా హత్తుకున్నాడు శేఖరం.

నిద్ర పట్టీ పట్టనట్లుండగానే తెల్లవారిపోయింది. కుసుమ లేచి ఇంటి పనుల్లో లీనమైపోయింది. ఆ తరువాత ఓ గంటకి లేచిన శేఖరం కాలకృత్యాల పనిలో పడ్డాడు.

అంతలోనే కాఫీ కప్పుతో తన వైపే నడిచి వస్తున్న కుసుమని తనివి తీరనట్లు చూడసాగాడు. రాత్రంతా ప్రశాంతంగా నిద్రించిన ముఖం మరింత తేటగా ఉంది.

"ఏమిటా చూపు....." గుస గుసగా అన్నది కాఫీ కప్పు అందిస్తూ.

"ఏం లేదోయ్. ముఖారవిందం రాత్రిపూట ఒకలా, ఉదయం పూట ఒకలా ఎందుకు కనబడుతుందా అని శోధిస్తున్నాను."

అవునా!... ఇవ్వాళ మధ్యాహ్నం కూడా చూడండి. అప్పుడింకోలా కనబడుతుందేమో కనిపెడు దూరు గాని, ఆయనెవరూ.. ఎడిసన్‌లాగా!" అంటూ కాఫీ కప్పుతో ఎదురుగ్గా కూర్చుంది కుసుమ.

"అవును నిజమే. ఈ ఆలోచన నాకెందుకు రాలేదబ్బా!"

"కాఫీ తాగడం మొదలెట్టండి... ఇంకా ఎన్నెన్ని ఆలోచనోస్తాయో!"

"అవును కదూ" అంటూ కాఫీ సిప్ చేశాడు. ఘుమఘుమ లాడుతోంది వాసన.

కాఫీ తాగుతూ లైటు వేసి ఉన్న కూతురు గదిలోకి చూశాడు శేఖరం.

ఎప్పుడు లేచిందో, లాప్‌టాప్ ముందు కూర్చుని వర్క్ ఫ్రం హోంలో భాగంగా పనిచేసుకుంటున్న కూతుర్ని చూసి పెదవి విరిచాడు శేఖరం. నిద్రచాలని ఆమె కళ్లలో ఎరుపు దూరానికి కూడా కనిపిస్తున్నది.

తనకీ కాఫీ తాగాలనిపించింది కాబోలు. హఠాత్తుగా లేచి బ్రష్ పట్టుకుని సింక్ వైపు అడుగులు వేసింది.

"ఏమ్మా...! ఉదయాన్నే లాప్‌టాప్ ముందు కూర్చున్నావ్!" అడిగాడు శేఖరం.

"అవును డాడీ..... రాత్రి ఆయన వచ్చి వెళ్లాడు కదా! వేస్ట్ అయిన రెండు గంటల పని ఇప్పుడు పూర్తి చేసుకున్నాను" అవలింతను ఆపుకుంటూ వెళ్లింది అమ్మాయి.

అవాక్కయ్యాడు శేఖరం. 'భార్యాభర్తలు కలసి ఉన్న రెండుగంటలూ వేస్టా!' స్వగతంలో అనుకోవాల్సిన మాటలు గొణుక్కున్నట్లు అనేశాడు.

"ఇష్!" అంటూ తన నోటిమీద వేలేసుకున్నది కుసుమ.

"నువ్వు ఏమైనా అనుగాని, మనసులో మాట చెబుతున్నా కుసుమా... ఈ కాలం పిల్లలకి సరసం లేదు, శృంగారం లేదు, మాటల్లేవు, పాటల్లేవు, పలవరింతలు, పులకరింతలు, పలకరింపులూ లేవు. లేపు. టాపులు, డెస్కు టాపులు, స్మార్ట్‌ఫోన్లు, వర్క్ ఫ్రమ్ హోములు, ఇంక్రిమెంట్లు, బెటర్మెంట్లు. ఏ వయసుకా ముచ్చట అన్నది మర్చిపోతున్నారు. యాంత్రిక జీవితాలయిపోయినై పాపం"

"రోజులట్లా ఉన్నై." అన్నది కుసుమ.

వచ్చేవారం కథ..

ఇంద్రచాపం

– ఎం.విజయ శ్రీముఖి

ఆసియా హాకీలో భారత్ ఆధిపత్యం అప్రతిహతంగా కొనసాగుతోంది. తిరుగులేని విజయాలతో నాలుగోసారి ఆసియాకప్‌ను అందుకోడం ద్వారా 2026 ప్రపంచకప్ హాకీ సమరానికి అర్హత సంపాదించింది.

'బంగారు' బాటలో భారత్ హాకీ!

భారత్ 'బంగారు' క్రీడ హాకీ పునర్ వైభవాన్ని సాధించే దిశగా దూసుకుపోతోంది. ఒలింపిక్స్ హాకీ చరిత్రలోనే అత్యధికంగా ఎనిమిది బంగారు పతకాలు అందుకుంది. హాకీ క్రీడ 1972 తరువాత నుంచి గాడి తప్పి పాతాళానికి పడిపోయింది. గత ఐదేళ్ల కాలంలో అనూహ్యంగా తిరిగి పుంజుకొంది. 2020 టోక్యో ఒలింపిక్స్, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు సాధించడం ద్వారా సత్తా చాటు కొంది. ప్రపంచ హాకీలోనే ప్రమాదకరమైన జట్లలో ఒకటిగా, ఆసియా హాకీకే అత్యుత్తమజట్టుగా నీరాజనాలు అందుకొంటోంది.

హర్మన్ ప్రీత్ సింగ్ నాయకత్వం

మిడ్ ఫీల్డర్ మన్ దీప్ సింగ్ వారసుడిగా జట్టు పగ్గాలు చేపట్టిన పెనాల్టీకార్నర్ స్పెషలిస్ట్ హర్మన్ ప్రీత్ సింగ్ సారథ్యంలో మన హాకీ పంచకళ్యాణి గుర్రంలా దూసుకుపోతోంది. ప్రపంచస్థాయిలో మొదటి ఐదు అత్యుత్తమ జట్లలో ఒకటిగా నిలిచింది. ఆసియా స్థాయిలో తనకు ఎదురేలేదని చాటుకొంటూ వస్తోంది. ఆసియాలోని మిగిలిన జట్లు జపాన్, దక్షిణ కొరియా, మలేసియా, చైనా భారత్‌కు దాసోహమనక తప్పడం లేదు. బీహార్‌లో రాజగిరి వేదికగా ముగిసిన 2025 హీరో ఆసియాకప్ ట్రోఫీ సమరంలో వీరవిహారమే చేసింది. గ్రూప్ లీగ్, సూపర్- 4 దశల నుంచి నాకౌట్ టైటిల్ పోరు వరకూ కళ్లు చెదిరే విజయాలతో అసలుసిసలు విజేతగా నిలిచింది.

దూకుడే ప్రధాన అస్త్రం

భారత హాకీజట్టు వ్యూహం మార్చింది. ఆత్మరక్షణ ధోరణి వీడి దూకుడే ప్రధాన అస్త్రంగా ప్రత్యర్థిజట్లను చిత్తు చేస్తూ వస్తోంది. క్రెగ్ ఫుల్టన్ శిక్షణలో రాటు దేలిన ప్రతిభకు మెరుపువేగాన్ని, పటిష్టమైన రక్షణా త్మక వ్యూహాన్ని జోడించి అలవోకగా గోల్స్ సాధిస్తూ తనకుతానే సాటిగా నిలుస్తూ వస్తోంది. ఇది భారతజట్టేనా? అని అభిమానులు అచ్చెరువొందేలా చేస్తోంది. లీగ్ దశ ప్రారంభమ్యాచ్‌లో చైనా నుంచి అనుకోని పోటీ ఎదుర్కొని 3-2 గోల్స్‌తో గట్టెక్కింది. తరువాత 3-2 గోల్స్‌తో జపాన్‌ను సైతం ఆ ధిగమించగలిగింది. పసికూన కజకిస్థాన్‌ను 15-0 గోల్స్‌తో చిత్తు చేసింది. సూపర్-4 రౌండ్‌కు చేరుకుంది. ఐదుసార్లు ఆసియాకప్ విజేత దక్షిణ కొరియాతో సూపర్-4 తొలిమ్యాచ్‌ను 2-2తో డ్రాగా ముగించింది. కీలక రెండోమ్యాచ్‌లో మలేసియాను 4-1 గోల్స్‌తో కంగు తినిపించింది. నాకౌట్ సెమీ ఫైనల్లో అడుగుపెట్టింది. ఫైనల్లో చోటు కోసం చైనాతో జరిగిన తొలి సెమీఫైనల్స్ పోరులో 7-0 గోల్స్‌తో చెలరేగిపోయింది. భారత్‌కు చైనా ఏమాత్రం సరిజోడీ కాలేకపోయింది.

టైటిల్ సమరమూ ఏకపక్షమే!

భారత్ 2025 ఆసియాకప్‌తో పాటు నెదర్లాండ్స్ -బెల్జియం దేశాల సంయుక్త ఆతిథ్యంలో జరిగే 2026 ప్రపంచకప్ హాకీ అర్హతను దక్కించుకొనే కీలక టైటిల్ పోరులో సైతం చెలరేగిపోయింది. ఆట అన్ని విభాగాలలోనూ పైచేయి సాధించింది. 4-1 గోల్స్‌తో దక్షిణ కొరియాను అలవోకగా ఓడించింది. నాలుగోసారి ఆసియాకప్ విజేతగా నిలిచింది. ఆటగాళ్లలో దిల్ ప్రీత్ సింగ్ రెండుగోల్స్, సుఖ్ జీత్ సింగ్, అమిత్ రోహిదాస్ చెరో గోల్ చేశారు. జట్టు విజయంలో ప్రధానపాత్ర పోషించారు. భారత్ 2017లో ఢాకా వేదికగా ముగిసిన ఆసియాకప్‌లో చివరిసారిగా విజేతగా నిలిచింది. మరో ఆసియాకప్ కోసం ఎనిమిదేళ్లపాటు ఎదురుచూడాల్సి వచ్చింది. 2003లో జరిగిన కౌలాలంపూర్ ఆసియాకప్‌లో తొలిసారిగా ట్రోఫీ అందుకుంది. 2007 చెన్నై ఆసియాకప్‌లోనూ విజేత కాగలిగింది. మూడో టైటిల్ కోసం దశాబ్దకాలంపాటు నిరీక్షించింది. మరో ఎనిమి దేళ్లకు నాలుగో ట్రోఫీని అందుకుంది. మలేసియాకు మూడు, చైనాకు నాలుగు, జపాన్‌కు ఐదు, బాంగ్లా దేశ్‌కు ఆరుస్థానాలు దక్కాయి. దక్షిణ కొరియా ఆసియాకప్ హాకీ చరిత్రలో అత్యధికంగా ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచింది. భారత్ నాలుగు టైటిల్స్‌తో ఆ తరువాతి స్థానంలో నిలిచింది. భారత్ వచ్చే ప్రపం చకప్‌లో ఆస్ట్రేలియా, జర్మనీ, నెదర్లాండ్స్, బెల్జియం, ఇంగ్లండ్, న్యూజిలాండ్, అర్జెంటీనా లాంటి దిగ్గజ జట్లతో తలపడి తానేమిటో నిరూపించుకోవాలి.

కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

శ్రీ ఆంజనేయ స్మాల్ అగ్రి టూల్స్

కలుపు పరికరాలు, కూరగాయల పంటలు, టెర్రస్ గార్డెన్‌లో వాడే పరికరాలు

1) అయ్యన్న వీడర్ రూ.1200/- 2) అన్నమయ్య వీడర్ రూ. 2000/-
3) ఒంగోలు గిత్త ప్లోయింగ్ వీడర్ రూ. 3000/- 4) రామయ్య వీడర్ రూ. 1500/-



Visit Youtube Link:
- Agriculture Implements at low cost - Rythu Nestham
- Low Cost agriculture machines to farmers - HMTV

Contact Number : 9849140465

బాల జాగృతి

భక్తాగ్రేసరులు

పెద తిరుమలాచార్యులు

పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య, అక్కమాంబ దంపతుల రెండవ కుమారుడు పెద తిరుమలాచార్యులు. తండ్రి ఆరంభించిన తిరుమలేశుని సంకీర్తన యజ్ఞాన్ని కొనసాగించారు. అన్నమయ్య అంత్యకాలంలో కుమారుడిని దగ్గరకు పిలిచి, 'నేటితో నా సంకీర్తన యజ్ఞం ముగుస్తుంది. ఇంక దినానికి ఒక్క సంకీర్తనకు తక్కువ కాకుండా శ్రీనివాసుడికి అర్పించే బాధ్యత నీది. ఈ యజ్ఞాన్ని నీవే కొనసాగించవయ్యా...' అంటూ తంబుర, చిడతలు అందించారట. తిరుమలాచార్యులు తండ్రి ఆనతిని పాటిస్తూనే, ఆయన సంకీర్తనలను రాగిరేకులపై రాయించి సంకీర్తనా భాండాగారంలో భద్రపరిపించారు. శ్రీవేంకటేశ్వర వచనములు, శ్రీవేంకటేశ్వర ప్రభాత స్తవం... శృంగార దండక, చక్రవాళ మంజరి, శృంగార నృత్త పద్యశతకము, వేంకటేశ్వరోదాహరణము, నీతి సీసపద్య శతకము, సుదర్శన రగడ, శ్రీకృష్ణ శతకమనే లక్షణ గ్రంథం.. తదితరాలను రాశారు. ఆనాటి వచనంలో రాసిన భగవద్గీతకు 'ఆంధ్రవేదాంతం, భగవద్గీత టీకా' అని పేరు. 'ప్రప్రథమ వ్యావహారిక వచన ప్రదాత'గా పేరుపొందారు.

కథ | సీతాఫలం నీతి



నాగావళి నదీతీరంలో ఆశ్రమాన్ని నిర్మించుకున్న ఆనందమహర్షి కొంతమంది శిష్యులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ జీవనం సాగిస్తూ ఉండేవాడు.

ఆయన రోజూ సాయంత్రం దగ్గరలోని శివాలయానికి వెళ్లి ప్రవచనాలు చెప్పేవాడు. ఆయన చెప్పే సంగతులు ఆసక్తికరంగా ఉండటంతో చుట్టుపక్కల గ్రామాల వాళ్లందరూ అక్కడికి చేరిపోయేవారు.

ఓ రోజు ఆయన ఉపన్యసిస్తూ ఉండగా నలుగురు శిష్యులు ఒక వ్యక్తిని మోసుకుంటూ వచ్చారు. ఆ వ్యక్తి బట్టలు తడిసి ఉన్నాయి. 'ఇతడు నదిలో కొట్టుకుపోతూ ఉంటే రక్షించి తీసుకొచ్చాం గురువుగారూ' అన్నారు వాళ్లు. అతడు కొంచెం సేపు సేద తీరాక 'నదిలో ఎలా పడిపోయావు నాయనా?' అని అడిగారు స్వామీజీ.

'పడిపోలేదు, కావాలనే దూకాను. నా జీవితంలో అన్నీ కష్టాలే. ఏ పనిచేసినా కలిసి రాలేదు. ఆఖరికి భార్యాపిల్లల్ని కూడా పోషించుకోలేక జీవితం మీద విరక్తితో చచ్చిపోదామని ఇలా చేశాను' అన్నాడు.

అంతా విన్న స్వామీజీ 'సరే, బాగా నీరసంగా ఉన్నావు. ఈ పండు తిను' అంటూ ఒక సీతాఫలాన్ని అందించారు. అతడు ఆవురావురంటూ దానిని తినేశాడు. స్వామీజీ ప్రశాంతంగా అతడికేసి చూస్తూ 'పండు తిన్నావు కానీ, గింజలు మాత్రం ఉమ్మేశావేం?' అని ప్రశ్నించారు.

ఆ ప్రశ్న విన్న జనమంతా ఆశ్చర్యానికి లోనయ్యారు. ఆ వ్యక్తిమాత్రం పకాల్న నవ్వి 'గింజలు తినడానికి

పద్యం

అంతరంగమందు అపరాధములు జేసి
మంచివాని వలెను మనుజు డుండు
ఇతరు లెరుగకున్న ఈశ్వరు డెరుగడా
విశ్వదాభిరామ వినుర వేమ

భావం : పైకి మంచివాడుగా నటిస్తూ మనసులో చెడుగా ఆలోచించే మనిషిని గురించి ఇతరులకు తెలియక పోవచ్చును గానీ, దేవుడికి తెలియకుండా పోతుందా? అని భావం.

శ్లోకం

వజ్రాదప కఠోరాణి
మృదూని కుసుమా దపి
లోకోత్తరాణాం చేతాంసి
కో హి విజ్ఞాతు మర్హతి

భావం : లోకోత్తర మహాపురుషుల మనస్సులు వజ్రం కంటే కఠినం, పూవుల కంటే మెత్తనైనవి. వాటిని అర్థం చేసుకోగల యోగ్యులు ఎందరు? మహాపురుషులు సందర్భానుగుణంగా ఆగ్రహానుగ్రహాలు ప్రదర్శిస్తుంటారని భావం.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

భారత్	విక్టరీ మెడల్
బ్రిటన్	మిలటరీ క్రాస్
బెల్జియం	పరమవీరచక్ర
అమెరికా	ఐరన్ క్రాస్
జర్మనీ	విక్టోరియా క్రాస్

సమాధానాలు : భారత్–పరమవీరచక్ర, బ్రిటన్–విక్టోరియా క్రాస్, బెల్జియం–మిలటరీ క్రాస్, అమెరికా–విక్టరీ మెడల్, జర్మనీ–ఐరన్ క్రాస్.

శాస్త్రవేత్తలు

హోమీ జహంగీర్ బాబా

(1909 అక్టోబరు 30 – 1966 జనవరి 24)

భారతదేశానికి చెందిన ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సంస్థ, అటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్మెంట్, ట్రోంబేకు వ్యవస్థాపక డైరెక్టర్. ఆయన గౌరవార్థం ఆ సంస్థకు బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ అని పేరు పెట్టారు. భారత అణ్వాయుధాల అభివృద్ధి కార్యక్రమానికి ఈ రెండు సంస్థలూ మూలస్థంభాలుగా నిలిచాయి. ఈ కార్యక్రమాన్ని కూడా బాబా డైరెక్టర్‌గా పర్యవేక్షించారు. జహంగీర్ బాబాను 'భారత అణు కార్యక్రమానికి పితామహుడు'గా అభివర్ణిస్తారు.

జనరల్ నాలెడ్జ్

1. అజంతా, ఎల్లోరా గుహలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
2. భారతదేశంలో అతిపెద్ద బ్యాంక్ ఏది?
3. యెమన్ దేశ రాజధాని ఏది?

సమాధానాలు : 1. మహారాష్ట్ర, 2. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, 3. సనా.

పనికిరావుగా స్వామీ. అందుకే ఉమ్మేశాను' అన్నాడు.

'మరి గింజలు అడ్డురాగానే తినడం మానేయలేక పోయావా?' అని మరో ప్రశ్నవేశారు స్వామీజీ.

'ఇంత తియ్యగా ఉన్న పండును గింజల కోసం వదులుకుంటామా స్వామీ.. మీరు మరీ విడ్డూరంగా అడుగుతున్నారే?' అన్నాడా వ్యక్తి.

దానికి స్వామీజీ నవ్వి 'జీవితం కూడా ఈ సీతాఫలం లాంటిదే.' గింజలు తొలగించుకుంటూ పండు తిన్నట్లే, కష్టాలను ఎదుర్కొంటూ జీవితాన్ని అనుభవించాలి కానీ ఇలా మధ్యలోనే ఆపేసుకుంటామా?' అన్నారు.

దానికా వ్యక్తి సిగ్గుపడి 'నిజమే స్వామీ, ఇంకెప్పుడూ ఇలాంటి తెలివితక్కువ పని చెయ్యను. కాయకష్టం చేసుకుని బతుకుతాను' అన్నాడు. ఇదంతా చూస్తున్న గ్రామస్థులందరూ ఆనందంగా చప్పట్లు కొట్టారు. ★

మెదడుకు మేత

మొదట చప్పన,
నడుమ పుల్లన,
కొస కమ్మన?

జవాబు : పాలు, పెరుగు, నెయ్యి

మంచిమాట

మెదడులో ఒక ఆలోచన పుట్టి.. మనసు అది నమ్మగలిగితే కచ్చితంగా దానిని సాధించగలరు

నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల హత్యాకాండ నుండి హైదరాబాద్ సంస్థానం
సర్దార్ వల్లబ్‌బాయ్ పటేల్ గారి నాయకత్వంలో విమోచనం పొందిన రోజు (సెప్టెంబర్ 17)

మన ప్రియతమ ప్రధాని గౌ॥ నరేంద్ర మోదీ గారికి
(సెప్టెంబర్ 17)
75వ జన్మదిన
శుభాకాంక్షలు

జి. సోమ నర్సయ్య
చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ భువనగిరి / యాదాద్రి భువనగిరి జిల్లా కోశాధికారి, బీజేపీ, తెలంగాణ

మన ప్రియతమ ప్రధాని
గౌ నరేంద్ర మోదీ గారికి
(సెప్టెంబర్ 17)
75వ జన్మదినం
&
తెలంగాణ విమోచన దినోత్సవ
శుభాకాంక్షలు
పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నవార్ శ్రీనివాస్ రెడ్డి, కొంతం ప్రకాశ్ రెడ్డి, రావుల మల్లేష్ యాదవ్
బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ బీజేపీ నాయకులు

సెప్టెంబర్ 17
రాష్ట్ర ప్రజలకు
తెలంగాణ విమోచన దినోత్సవం
&
75వ జన్మదినం జరుపుకుంటున్న
మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ గారికి
శుభాకాంక్షలు
తలుసాని హైందవి రెడ్డి
State Monitoring team Member BJP, Telangana

మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ గారికి
(సెప్టెంబర్ 17)
75వ జన్మదినం మరియు
తెలంగాణ విమోచన దినోత్సవ శుభాకాంక్షలు
పుప్పాల శ్రీనాధ్
భాగ్యనగర్ జిల్లా
బీజేపీ ప్రధాన కార్యదర్శి

మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ గారికి
(సెప్టెంబర్ 17)
75వ జన్మదినం &
తెలంగాణ విమోచన దినోత్సవ శుభాకాంక్షలు
అమర్‌సింగ్ తిలావత్
మాజీ మంత్రి, బీజేపీ ప్రత్యేక ఆహ్వానితులు, తెలంగాణ

మన ప్రియతమ ప్రధాని
గౌ॥శ్రీ నరేంద్ర మోదీ గారికి
75వ పుట్టినరోజు
మరియు
తెలంగాణ విమోచన దినోత్సవ
శుభాకాంక్షలు
డా॥ వన్నాల శ్రీరాములు
మాజీ ఎమ్మెల్యే, జాతీయ కౌన్సిల్ సభ్యులు BJP
డా॥ వన్నాల వెంకటరమణ
B.D.S.,M.D.S.,Ph.D.
BJP రాష్ట్ర కార్యవర్గసభ్యులు

విందు.. వినోదం... పెండ్లి.. పేరంటం...
అన్నింటా మీ నేస్తం.
క్రేన్
వక్క పలుకులు
వీటికి సాటి మరేవి లేవు
www.craneindia.net
శ్రీగ్రంధి సుబ్బారావు మరియు శ్రీమతి గ్రంధి లక్ష్మీనరసమ్మ
ఇప్పుడు మీ కోసం
సరికొత్త ప్యాకింగ్‌లో
సరికొత్త రుచులతో
Taste of India
CRANE
BETEL NUT PIECES
Since 60 Years
CRANE
SWEET BETEL NUT PIECES
PREMIUM
CRANE
BETEL NUT PIECES
₹5
CRANE
TARA 9044

వారఫలాలు

15-21 సెప్టెంబర్, 2025

సింహంభట్ల సుబ్బారావు

6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

చేపట్టిన కార్యక్రమాలు సమయానికి పూర్తి. పలుకుబడి కలిగిన వ్యక్తులు పరిచయమవు తారు. బంధువులు, శ్రేయోభిలాషులతో ఆనందంగా గడుపు తారు. ఉద్యోగార్థుల యత్నాలు సఫలం. బంధువుల నుంచి శుభవార్తలు. స్థిరాస్తులు కొనుగోలు చేస్తారు. వ్యాపారులకు మరింత ఉత్సాహంగా ఉంటుంది. ఉద్యోగులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. రాజకీయ వేత్తల కృషి ఫలిస్తుంది. 20,21 శారీరక రుగ్మతలు. మానసిక అశాంతి. గణేశాష్టకం పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆస్తుల విషయంలో వివాదాలు నెలకొంటాయి. నిరుద్యోగులకు శ్రమాధిక్యం. శారీరక రుగ్మతలు కొంత బాధిస్తాయి. కాంట్రాక్టులు కొన్ని చేజారవచ్చు. వ్యాపారులకు పెట్టుబడులు ఆలస్యమవుతాయి. లాభాలు స్వల్పంగా ఉంటాయి. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు మీదపడవచ్చు. కళాకారులు, రాజకీయవేత్తలకు ఒడిదుడుకులు. రచయితలు, వైద్యుల సేవలకు గుర్తింపు కష్టమే. 18,19 తేదీల్లో శుభవార్తలు, ధనలాభం. దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

శారీరక రుగ్మతలు తీరి ఉపశమనం లభిస్తుంది. దూర ప్రాంతాల నుంచి శుభవార్తలు. విద్యార్థులకు అనుకూల ఫలితాలు రావచ్చు. పలుకుబడి పెరుగుతుంది. వ్యాపారులకు భాగస్వాములతో వివాదాలు తీరతాయి. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు. కళాకారులకు నూతన అవకాశాలు. రచయితలు, క్రీడాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 17,18 తేదీల్లో చిత్రమైన సంఘటనలు. కుటుంబంలో చికాకులు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.



కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇతరులకు సాయం అందిస్తారు. రాబడి మరింత పెరిగి అవసరాలు తీరతాయి. వ్యాపారులకు లాభాలు ఉత్సాహాన్నిస్తాయి. భాగస్వాములతో విభేదాలు పరిష్కారం. ఉద్యోగులకు విధినిర్వహణ ప్రశాంతంగా సాగిపోతుంది. రాజకీయవేత్తల యత్నాలు సఫలం. క్రీడాకారులు, పరిశోధకులకు నూతనోత్సాహం. 15,16 తేదీల్లో ఖర్చులు పెరుగుతాయి. దూర ప్రయాణాలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

రాబడి మరింత మెరుగుపడుతుంది. దీర్ఘకాలిక రుణాలు తీరతాయి. విద్యార్థులకు కృషి ఫలిస్తుంది. పరిచయాలు విస్తృతమవుతాయి. ఉద్యోగులకు ఒక సమాచారం ఊరటనిస్తుంది. రాజకీయవేత్తలకు అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది. కళాకారులు, రచయితలకు మరింత గుర్తింపు లభిస్తుంది. 20,21 తేదీల్లో శారీరక రుగ్మతలు. ఖర్చులు పెరుగుతాయి. శివాష్టకం పఠించండి.

కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

గృహ నిర్మాణయత్నాలు ఫలిస్తాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. స్థిరాస్తి వివాదాలు, కోర్టు వ్యవహారాలు పరిష్కారవుతాయి. వ్యాపారులు విస్తరణ కార్యక్రమాలు పూర్తి చేస్తారు. ఉద్యోగులు బాధ్యతలను సమర్థనీయంగా పూర్తిచేస్తారు. రచయితలు, క్రీడాకారులకు శుభవార్తలు. 17,18 తేదీల్లో వృథాఖర్చులు. ఆరోగ్య సమస్యలు. లక్ష్మీస్తోత్రాలు పఠించండి.

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ఇంటి నిర్మాణయత్నాలు తిరిగి ప్రారంభిస్తారు. మీ అభిప్రాయాలను కుటుంబసభ్యులు గౌరవిస్తారు. అందర్నీ మాటలతో ఆకట్టుకుంటారు. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలలో ఆటంకాలు తొలగుతాయి. ఉద్యోగులకు విధుల్లో ఒత్తిడులు తొలగుతాయి. రాజకీయవేత్తలకు నూతన పదవులు. క్రీడాకారులు, పరిశోధకులకు ఆహ్వానాలు. 15,16 తేదీల్లో స్వల్ప రుగ్మతలు. లక్ష్మీనృసింహస్తోత్రాలు పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ముఖ్యమైన కార్యక్రమాలలో అవాంతరాలు తొలగుతాయి. ఇంతకాలం పడిన కష్టానికి ఫలితం కనిపిస్తుంది. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగులకు విధుల్లో అనుకూల వాతావరణం. పారిశ్రామికవేత్తలు, క్రీడా కారులకు పురోగతి. శాస్త్రవేత్తలకు విశేష గుర్తింపు లభిస్తుంది. 17,18 తేదీల్లో శారీరక రుగ్మతలు. ఇంట్లో ఒత్తి డులు. ఆకస్మిక ప్రయాణాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని మంచీచెడ్డా విచారిస్తారు. వ్యాపారులకు నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు కొన్ని ఇబ్బందులు తొలగుతాయి. కళాకారులకు అవకాశాలు మరిన్ని దక్కుతాయి. రాజకీయ వేత్తలు, క్రీడాకారులకు అంచనాలు నిజం కాగలవు. 19,20 తేదీల్లో అనుకోని ఖర్చులు. కుటుంబ సభ్యులతో తగాదాలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

భూవివాదాల పరిష్కారం. ఊహించని ఆహ్వానాలు అందుతాయి. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. కొందరు ఆప్తులు మరింత దగ్గరవుతారు. వ్యాపారులకు లాభాలు మరింతగా ఉత్సాహాన్నిస్తాయి. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం. రాజకీయవర్గాలకు పదవీయోగం. వైద్యులు, రచయితలకు శుభవార్తలు. 20,21 తేదీల్లో ఖర్చులు పెరుగుతాయి. స్నేహితుల నుంచి విమర్శలు. సూర్యారాధన చేయండి..

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

అందరిలోనూ సత్తా చాటుకుంటారు. మీలో దాగిన నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. సమాజ సేవలో భాగస్వాములవుతారు. వ్యాపారాలు సజావుగా సాగి లాభాలు గడిస్తారు. ఉద్యోగులకు విధుల్లో ప్రశంసలు. రాజకీయవేత్తలకు అన్ని విధాలా అనుకూల సమయం. క్రీడాకారులు, పరిశోధకులకు మరింత ప్రగతి కనిపిస్తుంది. 16,17 తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక ఆందోళన. ఆంజనేయ దండకం పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

దేవాలయాలు సందర్శిస్తారు. పాత సంఘటనలు గుర్తుకు వస్తాయి. సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. వాహనాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులకు అవాంతరాలు తొలగి విస్తరణ కార్యక్రమాలు ఫలప్రదమవుతాయి. ఉద్యోగులకు పనిభారం నుంచి విముక్తి. పారిశ్రామికవేత్తలకు ఆహ్వానాలు అందుతాయి. రచయితలు, వైద్యుల సేవలకు తగిన గుర్తింపు లభిస్తుంది. 17,18 తేదీల్లో మనశ్శాంతి లోపిస్తుంది. శారీరక రుగ్మతలు. హనుమాన్ చాలీసా పఠించండి.

పదరసం-531



ఆధారాలు

అడ్డం

1. కొంగ (3)
3. గోలుకొండ పత్రిక సంపాదకుడి ఇంటిపేరు (4)
6. త్రాసు..ఒక రాశి (2)
7. కనిష్ఠం (3)
8. రక్షణే (2)
9. మోసగాడు (3)
11. భార్య (2)
12. నగతో కొండ (2)
14. రాత్రి (2)
15. చతురోపాయాలలో చివరిది (2)
17. మున్నగు..మొదలగు (4)
18. పవనసుతుడు (3)
19. అతిథి తడబడ్డాడు (3)
22. యశోదాపతి పేరు తొలి అక్షరాలు (2)
24 తులసీదళంతో తూచిన కృష్ణపత్ని...(3)
25. ధనం... సొమ్ము (3)
26. ధ్వని... శబ్దం (2)
27. నీరో చక్రవర్తి రాజ్యం (2)
28. పిసినారి (2)
29. భూస్వాములను ఎదిరించిన 'చాకలి'... (3)
31. నష్టం కాదులెండి (2)
32. అవునుకు వ్యతిరేకం(2)
33. ఇదొక వింతట (2)

నిలువు

1. పూలపండుగ దేవత (4)
2. స్వప్నం (2)
3. చక్కని నడవడి (3)
4. ద్రవం... సారం (2)
5. ప్రఖ్యాత ఇంజనీర్ విశ్వేశ్వరయ్య ఇంటిపేరు (4)
10. నటి తిరగబడింది (2)
11. 'మా నిజాం జన్మజన్మల బూజు' అన్న కవి (4)
13. దీనికి తగ్గ బొంతట (2)
14. ఇతని కాదు... కింద నుంచి (3)
15. మాల.. హారం (2)
16. అర్జునుడి శంఖం (5)
20. వెంకన్న నెలవు (4)
21. సర్పం..(2)
23. ఒకనాటి ప్రముఖ నాటక సంస్థ (3)
25. శత్రుత్వం (3)
28. అరిషడ్వర్గాలలో మూడవది (2)
29. పదిలో సగం (2)
30. శాఖ, స్త్రీ... కింద నుంచి (2)

పదరసం - 530 సమాధానాలు

1 భా	ర	2 త	3 ర	త్న	■	4 పా	ను	గం	5 టి
ర	■	6 డ	జ	■	7 పు	రి	■	■	మే
త	■	8 వ	ని	9 త	■	10 జా	గృ	11 తి	■
12 కో	క	■	■	13 గ	ణి	తం	■	14 రు	షి
కి	■	15 అ	16 ను	వు	■	■	17 నా	వ	■
18 ల	19 క్ష	■	డి	■	20 అ	21 ర	■	22 రం	పం
■	23 మ	24 మ	కా	రం	■	25 వి	26 భా	గం	■
27 ని	■	28 తి	రం	■	29 ఏ	■	వి	■	30 ము
31 మి	సి	■	■	32 హా	లు	డు	■	33 నిం	గి
షం	■	34 కి	టి	కి	■	■	35 మం	ద	స

అరుదైన ప్రపంచ రికార్డును సాధించి ప్రపంచ అగ్రనేతగా కీర్తి పొంది,
విశ్వగురువుగా భారతదేశానికి పునర్వైభవం తీసుకురావాలన్న సంకల్పం బూని,
140 కోట్ల భారతీయుల ఉన్నతికై కంకణం కట్టుకొని
పేదరికం, అవినీతి, ఉగ్రవాదం వంటి పీడల
నుంచి విముక్తి పొందిన నవభారత నిర్మాణానికై యజ్ఞం చేస్తున్న
భరతమాత ముద్దుబిడ్డ ప్రధానమంత్రి
గౌ॥ నరేంద్ర మోదీ గారికి 75వ జన్మదిన
(సెప్టెంబర్ 17)
శుభాకాంక్షలు
డా॥ కిలారు దిలీప్
మీడియా ఇన్‌చార్జ్, బీజేపీ, ఆంధ్రప్రదేశ్

ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక దేశంగా
భారతదేశాన్ని అభివృద్ధిపరిచిన
గౌ॥ నరేంద్ర మోదీ గారికి 75వ జన్మదిన
(సెప్టెంబర్ 17)
మరియు
తెలంగాణ విమోచన దినోత్సవ
శుభాకాంక్షలు
వెంకటాద్రి రెడ్డి
(అడ్వకేట్ -గద్వాల్)
రాష్ట కార్యవర్గ సభ్యులు బీజేపీ, తెలంగాణ


మూడవసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి,
విదేశాలలో భారత ఖ్యాతిని చాటుతూ,
దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లి, ఆర్థిక రంగంలో
ప్రపంచ స్థాయిన నాలుగవ స్థానం సంపాదించి,
అరుదైన ప్రపంచ రికార్డును సాధించి,
ప్రపంచ అగ్రనేతగా కీర్తి పొందిన,
మన ప్రియతమ ప్రధాని
గౌ॥ నరేంద్ర మోదీ గారికి
75వ జన్మదిన
శుభాకాంక్షలు...
పోలీస్ యాక్షన్ ద్వారా
నిజాం మెడలు వంచి
తెలంగాణను భారత్‌లో
విలీనం చేసిన రోజు సెప్టెంబర్ 17
ఈ విమోచన పోరాటంలో
అసువులు బాసిన అమరవీరులకు
అశ్రుపూరిత వందనములు,
ఉక్కుమనిషి సర్దార్‌పటేల్‌కు జోహార్లు.
తెలంగాణ విమోచన దినోత్సవ శుభాకాంక్షలు...
బోల్లంపల్లి ఇంద్రసేన్ రెడ్డి
బీజేపీ సీనియర్ నాయకులు, తెలంగాణ

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 47

Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01